అమెరికన్ వార్తాపత్రిక "THE WORLD" విలేకరి లింకన్ ఎయిర్‌తో సంభాషణ[22]

మిత్రరాజ్యాల ''చదరంగపు ఆట''

దిగ్బంధన ఎత్తివేతకు మిత్రరాజ్యాలు నిర్ణయించినట్టుగా వస్తూన్న వార్తలను[23] గురించి లెనిన్ ఇలా అన్నాడు:

''అత్యంత అస్పష్టంగా వున్నట్టి — అదీగాక, పోలెండ్ గుండా మామీద మరొక సరి కొత్త దాడికి సన్నాహాలతో ముడిపెట్టినట్టుగా అవుపడుతూన్నట్టి — ఈ ప్రతిపాదనలో వున్న చిత్తశుద్ధిని నమ్మడం కష్టంగానే వుంది. మొదటి చూపులో, సుప్రీమ్ కౌన్సిల్ ప్రణాళిక — రష్యన్ కోఆపరేటివ్‌ల ద్వారా వర్తక సంబంధాల పునస్థాపన — నమ్మదగినదిగానే కనబడుతుంది. కాని కోఆపరేటివ్‌లు ఇప్పుడు లేనే లేవు, వీటిని మా సోవియట్ పంపకపు వ్యవస్థ సంస్థలతో కలిపివేశాం అందుచేత కోఆపరేటివ్‌లతో వ్యవహరిస్తామని మిత్ర రాజ్యాలు అనడంలో అర్థమేమిటై వుంటుంది? సహజంగానే ఇది అస్పష్టంగా వుంది.

కనుకనే మరింత శ్రద్ధగా పరిశీలించిన మీదట, ఇంకా ఇంతవరకూ అస్పష్టంగానే వుంటూన్న అభిప్రాయాలతో మిత్రరాజ్యాలు ఆడుతూన్న ఈ చదరంగపు ఆటలో ఈ పారిస్ నిర్ణయం ఒక ఎత్తు అని మాకు నమ్మకం కల్గిందని అంటున్నాను.''

లెనిన్ ఒక్క క్షణం వూరుకుని, తరువాత గొప్పగా చిరునవ్వు నవ్వుతూ ఇంకా ఇలా అన్నాడు:

"ఆ మాటకొస్తే, మార్షల్ ఫోష్ ఉద్యమించిన వార్సా సందర్శన కంటేనూ మరీ అస్పష్టంగా వుంది."

పోలెండ్‌వారి ఎదురుదాడికి గట్టి అవకాశాలే వున్నట్టు మీరు అభిప్రాయ పడుతున్నారా? — అని నేనడిగాను. (పోలెండ్‌వాళ్ళమీద బోల్‌షెవిక్‌లు దాడిచేయడం కాకుండా, బోల్‌షెవిక్‌లమీద పోలెండువాళ్లే దాడిచేస్తారని రష్యాలో అనుకుంటు న్నారన్న విషయం జ్ఞప్తికితెచ్చుకోవాలి.)

లిన్ ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు: "నిస్సందేహంగా. క్లెమాన్‌సో, ఫోష్‌లు అత్యంత, అత్యంత గంభీరులైన దొడ్డమనుషులు; కాగా ఈ దురాక్రమణ పథకాన్ని మొదటి పెద్దమనిషి వేశాడు, దానిని అమలు పరచబోతున్నాడు రెండో పెద్దమనిషి. ఈ బెదరింపు ప్రమాదభరితమైనదే, అందులో సందేహంలేదు. కాని ఇంతకంటెనూ ప్రమాదభరితములైన బెదరింపులనే మేం చూశాం. అసాధ్యమైనదానిని సాధించే యత్నాన్నే మిత్రరాజ్యాలు ఇంకా కొనసాగిస్తున్నాయని మాకెంతో ఆశాభంగం కల్గుతూందే తప్ప మేమేమీ హడలిపోవడంలేదు. కారణమేమిటంటే: కొల్చాక్ దెనీకిన్‌ల ఎదురుదాడులు రష్యన్ సమస్యను మిత్రరాజ్యాలకు ఎంత ఆశాజనకంగా పరిష్కరించగల్గాయో, అంత ఆశాజనకంగానే పరిష్కరించగల్గుతుంది పోలెండ్‌వారి ఎదురుదాడి కూడా. పోలెండ్ తన చిక్కులలో పడి కొట్టుకుపోతూందన్న విషయం మరచిపోకండి. రుమేనియాతో సహా తన పొరుగువాళ్ళెవ్వరినుండీ తనకు సహాయం అందుతుందని పోలెండ్ అనుకునేందుకు వీల్లేదనేది స్పష్టంగా కనబడుతూనే వుంది కూడా."

"అయినప్పటికీ వెనుకటికంటె ఇప్పుడు శాంతి మరింత చేరువగా వున్నట్టే కనబడుతూంది" అని నేను సూచించాను.

"అవును, అది నిజమే. మాతో వ్యాపారానికి శాంతి ఒక అనుషక్తమే గనుక అయిన పక్షంలో మిత్రరాజ్యాలు ఇక ఆట్టేకాలం మాతో శాంతిని తప్పించుకోలేవు. రష్యన్ ప్రజతో వ్యాపార సంబంధాలను నెలకొల్పు కోవడమనే ప్రశ్నను క్లెమాన్‌సో స్థానంలో వచ్చిన మిలెరాన్ పరిశీలించనాశిస్తూన్నట్టు విన్నాను. ఫ్రెంచి పెట్టుబడిదార్ల మనస్థితిలో ఏదైనా మార్పు కల్గివుంటే ఆ మార్పుకిది చిహ్నమైతే కావచ్చు. అయినప్పటికీ ఇంగ్లండులో చర్చిల్ ఇంకా అందరికంటెనూ బలమైన స్థానంలో వున్నాడు, కాగా మాతో వ్యవహార సంబంధాలు పెట్టుకుందుకు బహుశ ఇష్టపడుతూన్నట్టున్న లాయడ్ జార్జికి, చర్చిల్ విధానానికి అండ ఇస్తూన్న రాజకీయ, ఫైనాన్షియల్ ప్రయోజనాలతో బహిరంగంగా తెగతెంపులు చేసుకుందుకు ధైర్యం చాలడంలేదు."

సంయుక్త రాష్ట్రాలు సోషలిస్టులను హింసించుతున్నాయి

"మరి అమెరికా మాటేమిటి?"

"అక్కడేమిటి జరుగుతూందో స్పష్టంగా చెప్పడం కష్టమే. మేమంటే మీ బ్యాంకర్లకి మరీ భయంగా వున్నట్టుంది చూడబోతేమా. ఏమైతేనేమి, సోషలిస్టులు ఒక్కరిపైనే కాకుండా, సామాన్యంగా కార్మికవర్గంపైన కూడా కదను అన్నిదేశాల ప్రభుత్వాలకంటేమా,

అభివృద్ధి నిరోధకమైన ఫ్రెంచి ప్రభుత్వంకంటేనూ మీ ప్రభుత్వమే అసాధారణమైన హింసా చర్యలను ప్రయోగించుతూంది. మీ ప్రభుత్వం విదేశీయులను పీడించుతూన్నట్టు స్పష్టంగా కనబడుతూనే వుంది. ఏమైనప్పటికీ, విదేశీయ కార్మికులు ఉండబట్టిగాని, లేకపోయినట్టయితే అమెరికా ఏమైవుండేదో? మీ ఆర్థికాభివృద్ధి కొనసాగాలీ అంటే వాళ్ళుండి తీరాలి.

అయినప్పటికీ రష్యామీద యుద్ధం చేసేకంటె రష్యాలో డబ్బు చేసుకోవడమే ఎక్కువ విజ్ఞత అని కొందరు అమెరికన్ వ్యాపారస్థులు గ్రహించినట్టు కనబడుతూంది. ఇదీ మంచి చిహ్నమే. ఇతర .దేశాల పారిశ్రామిక ఉత్పత్తులకంటెనూ అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులే —రైల్వే ఇంజన్లు, మోటారుకార్లు వగైరాలు — మాకెంతైనా అవసరమవుతాయి."

"మరి మీ శాంతి షరతులో?"

"వాటి గురించి సంభాషించడం వృధా కాలయాపనే అవుతుంది," అని లెనిన్ కృత నిశ్చయంతో అడ్డుతగిలాడు. "అత్యంత సామ్రాజ్యవాద మనస్కులైన పెట్టుబడిదార్లకు సహితమూ ఖండించ వీలుపడనంతటి న్యాయబుద్ధితో కూడుకున్నట్టి షరతుల ప్రకారం శాంతిని స్థాపించేందుకు మేము సిద్ధంగా వున్నామని సర్వప్రపంచానికీ తెలుసును. శాంతికై మా యత్నాలను గురించీ, మాకు శాంతి అత్యవసరమనే సంగతిని గురించీ, విదేశీయ పెట్టుబడికి అత్యంత ఉదారమైన రాయితీలనూ, హామీలనూ ఇవ్వడానికి మేము సిద్ధంగా వున్నామన్న విషయాన్ని గురించీ మేము పదేపదే ప్రకటించాం. కాని శాంతి కోసమని మాత్రం మేము పీకపిసుక్కుని చావదుల్చుకోలేదు.

మా రాజ్యంలాంటి సోషలిస్టు రాజ్యం పెట్టుబడిదారీ దేశాలతో ఎట్టి కాలపరిమితి సహితమూ లేని వ్యాపార సంబంధాలను ఎందుకు పెట్టుకోకూడదో నాకేకారణమూ అవుపించడంలేదు. పెట్టుబడిదారీ రైల్వేఇంజన్లనూ, వ్యవసాయ యంత్రాలనూ ఉపయోగించుకుందుకు మాకెలాంటి అభ్యంతరమూ లేనప్పుడు, మాసోషలిస్టు గోధుమలనూ, ఫ్లాక్స్ నారనూ, ప్లాటినమునూ ఉపయోగించుకుందుకు వారికెందుకు అభ్యంతరం వుండాలి? సోషలిస్టు గింజలూ కడమ గింజలూ రుచికి ఒకలాగా వుంటాయిగా — లేకుంటే వాటి రుచి వేరుగా వుంటుందేమో మరి? ఘోరమైన బోల్షెవిక్‌లతో — అనగా సోవియట్ ప్రభుత్వంతో—వ్యాపార సంబంధాలను వారు కుదుర్చుకోవాల్సి వుంటుంది, సహజంగానే. అయినప్పటికీ, ఉదాహరణకు అంటాంట్ ప్రభుత్వాలతో అమెరికన్ ఉక్కు ఉత్పత్తిదార్లు యుద్ధకాలంలో ఆయుధసామగ్రి సరఫరాచేసేందుకు బేరాలు కుదుర్చుకోవడం కంటేనూ సోవియట్లతో బేరాలు కుదుర్చుకోవడం ఏమంత కష్టతరం కాకూడదే."

రష్యాపై ఆధారపడుతుంది యూరప్

"ఇందుకనే రష్యాతో కోఆపరేటివ్‌ల ద్వారా వాణిజ్యపునరుద్ధరణ గురించిన ఈ ప్రస్తావన కపటబుద్ధితో కూడుకున్నట్టుగా, కనీస పక్షంలో అస్పష్టంగా వున్నట్టు — వెంటనే గ్రహించుకుందుకూ నెరవేర్చేందుకూ వీలయేటట్టీ, నిష్కపటమూ సూటీ అయినట్టీ ప్రతిపాదనలు కాకుండా, చదరంగపు ఆటలో ఒక ఎత్తులాగున వున్నట్టు — మాకు అవుపడుతూంది. అంతేకాకుండా, దిగ్బంధన ఎత్తివేతే వాస్తవంగా సుప్రీమ్ కౌన్సిల్ ఉద్దేశమే అయితే, తన ఉద్దేశాలను మాకే ఎందుకు నివేదించకూడదు? అధికారపూర్వకమైన నివేదిక ఏదీ కూడా పారిస్‌నుంచి మాకు అందలేదు. మాకు తెలిసిన ఆ రవంత కూడా మా రేడియో పోగుచేసినట్టి వార్తాపత్రికా నివేదికలపై ఆధారపడి మేం తెలుసకున్నదే.

రష్యాదేశపు ప్రస్తుత ఆర్థిక శిథిలావస్థ ప్రపంచ ఆర్థికశిథిలావస్థలో ఒక భాగం మాత్రమే అని అంటూంట్, సంయుక్త రాష్ట్రాల రాజ్యధురంధరులు అర్థంచేసుకున్నట్టు కనబడదు. ఆర్థిక సమస్యను కేవలం ఏవో కొన్ని నిర్దిష్ట జాతులయొక్క, లేదా జాతులలో ఒక గ్రూపుయొక్క దృక్స్థానంనుండే పరిశీలించకుండా, ప్రపంచ దృక్స్థానంనుండి పరిశీలించనంత వరకు, ఈ సమస్యను పరిష్కరించడం అసాధ్యమే అవుతుంది. రష్యాలేనిదే యూరప్ తన కాళ్లపై నిలబడజాలదు. కాగా యూరప్ బలహీనంగా వున్నంత కాలమూ అమెరికా స్థితి సందిగ్ధంగానే వుంటుంది. తనకున్న ధనంతో అమెరికా తనకు అవసరమైన వస్తువులను కొనుక్కోలేకపోతే అంత ధనం వుండి కూడా ఏం లాభం? ఆ కూడబెట్టుకున్న బంగారాన్ని అమెరికా తింటుందా, నెత్తిమీద పెట్టుకుని ఊరేగుతుందా? ఏం చెప్పండి మరి? అమెరికా తాను విధిగా అమ్మితీరాల్సిన సరుకులతో తాను కావాలనుకుంటూన్న సరుకులను మార్పిడి చేసుకుందుకు తనకు ఆ సరుకులను ఇవ్వగల్గే స్థితికి యూరప్ వచ్చేంతవరకూ, యూరప్‌తో అమెరికా లాభసాటి వ్యాపారం, అనగా తనకు నిజమైన విలువను చేకూర్చిపెట్టే ప్రాతిపదికపైన సాగే వ్యాపారం, చేయజాలదు. ఆర్థికంగా తానుతన కాళ్లపై నిలబడలేనంత కాలమూ యూరప్ ఈ సరుకులను అమెరికాకి ఇవ్వలేకపోతుంది."

ప్రపంచానికి రష్యన్ సరుకులు అవసరం

"సర్వప్రపంచమూ అవురావురుమని కావాలంటూన్న గోధుమ, ఫ్లాక్స్‌నార, ప్లాటినం, పొటాష్‌లు రష్యాలో మాకున్నాయి. బోల్షెవిజం వున్నా వూడినా, వీటికోసమని ప్రపంచం చిట్టచివరకు మా దగ్గరకి రాకతప్పదు. ఈ సత్యం క్రమక్రమంగా అవగాహన అవుతూన్నట్టు

విప్లవాలు కనబడుతూన్నాయి. అయినప్పటికీ ఈలోపునే రష్యా ఒక్కటే కాకుండా, యూరప్ యావత్తూ ముక్కచెక్కలై కూలిపోతూంది, సుప్రీమ్ కౌన్సిల్ ఏమో ఈ పాటా ఆ పాటా పాడుతూ మోసపు విధానం అవలంబించుతూంది. రష్యానూ, యూరప్‌నూ కూడా సర్వనాశనంనుండి రక్షించవచ్చు, కాని అందుకోసమై చర్య తక్షణమే జరగాలి, త్వరగా జరగాలి. కాని సుప్రీమ్ కౌన్సిల్ మెల్లగా, మరీ మెల్లగా పనిచేస్తూంది. వాస్తవంగా, అది ఏ నిర్ణయాన్నీ తీసుకోకుండానే అప్పుడే చెదిరిపోయి, తన విధులను రాయబారుల కౌన్సిల్‌కు బదిలీ చేసివేసి, చచ్చిపుట్టినట్టు అవుపడుతూన్నట్టి అసలింతవరకూ జీవమే లేనట్టి నానా జాతి సమితిని[34] తన స్థానే పనిలో వుంచినట్టు కనబడుతూంది. తనకు ప్రధానాశ్రయంగా ఏర్పడుతూన్నట్టి సంయుక్త రాష్ట్రాలు లేనిదే నానాజాతి సమితి తన వ్యాపార నిర్వహణను నిజంగా ప్రారంభించగల్గుతుందా?"

"మిలిటరీ పరిస్థితి సోవియట్ ప్రభుత్వానికి సంతృప్తికరంగానే వుందా?" అని నేను ప్రశ్నించాను.

"బాగా సంతృప్తికరంగా వుంది," అని లెనిన్ వెంటనే జబాబు చెప్పాడు. "మా మీద ఇంకా సైనిక దురాక్రమణకు దిగే చిహ్నాలు, ఇదివరకు నేను చెప్పినట్టుగా, ఒక్క పోలెండ్‌లోనే కనబడుతున్నాయి. ఇట్టి దుస్సాహసానికే గనుక పోలెండ్ దిగినట్టయితే, ఇది ఇరు వైపులా మళ్లీ కొత్త బాధలకే కారణమవుతుంది, కొత్తగా మళ్లీ ఎన్నో మానవ ప్రాణాలు నిష్కారణంగా బలికావాల్సి వస్తుంది. కాని పోలెండ్‌వాళ్లకి విజయం చేకూర్చి పెట్టడం ఫోష్‌కైనా సరే సాధ్యంకాదు. చర్చిల్ సహితమూ స్వయంగా వాళ్లతో కలిసి యుద్ధం చేసినప్పటికీ కూడా మా ఎర్రసైన్యాన్ని ఓడించడం వాళ్లతరంగాదు."

ఇలా అని, లెనిన్ శిరస్సు నొక్కి, నిరుచుకుని, వ్యాకులపడుతూ నవ్వాడు. తరువాత గంభీర కంఠంతో ఇంకా ఇలా అన్నాడు:

"మిత్రరాజ్యాలలో అగ్రరాజ్యాలు ఏవైనా సరే వారి సొంత సేనలను మామీదకి పంపించగల్గితే, అవి సహజంగానే మమ్మల్ని అణచివేయగల్గుతాయి. కాని ఈ పని చేయడానికి అవి సాహసించలేవు. అసాధారణ విపరీతవాక్యం ఏమిటంటే, మిత్రరాజ్యాలకున్న అపారమైన వనరులతో పరిపోల్చి చూస్తే రష్యా బలహీనంగానే వున్నప్పటికీ, మిత్రరాజ్యాలు తన మీదకు పంపించగల్గిన బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి సైనికులతో కూడుకున్నట్టి సాయుధ బలాలతో ప్రతి ఒక్క దానిని రష్యా చిత్తుగా ఓడించగల్గడమే కాకుండా, సాంకుధ్యపు వలయాన్ని నిర్మించిన దేశాలపై దౌత్య, నైతిక విజయాలను సహితమూ రష్యా సాధించగల్గడం,

లోనే వుంది. మామీద యుద్ధం చేయడానికి ఫిన్లండ్ నిరాకరించింది. ఎస్తోనియాతో మేము శాంతిని స్థాపించుకున్నాం, ఇక సెర్బియాతోనూ* లిథువేనియాతోనూ త్వరలో శాంతి సంధిపై సంతకం చేయబోతున్నాం. ఈ చిన్న ప్రభుత్వాలకు ఆంటాంట్ భౌతికంగా ప్ప ఆశలు చూపించినప్పటికీ, వీటిని భయానకంగా బెదరించినప్పటికీ ఇవి మాతో శాంతియుత సంబంధాలను నెలకొల్పుకుందుకే ఎంచుకున్నాయి."

భావి ఆంతరంగిక పరిస్థితి ఆశాజనకం

"మాకున్న బృహత్తర నైతికబలానికి ఇదే సాక్ష్యం. మాకు మిక్కిలి చేరువనూ, మా ఇరుగు పొరుగునా వున్న బాల్టిక్ రాజ్యాలు తమ స్వాతంత్ర్యానికి గానీ, తమ శ్రేయస్సుకి గానీ ఏ విధంగానూ ప్రమాదం కల్గించని వారం మేమొక్కరమే అని అర్థంచేసుకున్నాయి."

"మరి రష్యా ఆంతరంగిక పరిస్థితి ఎలా వుంది?"

"పరిస్థితి సందిగ్ధంగానే వున్నప్పటికీ భవిష్యత్తు ఆశాజనంగానే వుంది. వసంత కాలం వచ్చేసరికల్లా అధమపక్షం పట్టణ ప్రజలను ఆకలి బాధనుండి విముక్తి చేయగల్గే మేరకు ఆహారవస్తువుల కొరతను అధిగమించేందుకు వీలవుతుంది. ఇంధనం కూడా అప్పటికి సమృద్ధిగానే వుంటుంది. ఎర్రసైన్యం సాధించిన అద్భుత వీరోచిత కృత్యాల పుణ్యమా అంటూ, ప్రజా ఆర్థిక పునర్నిర్మాణ కార్యం అప్పడే ప్రారంభమైంది. ప్రస్తుతం ఆ సైన్యంలో కొంత భాగం శ్రమ సైన్యాలుగా రూపొందింది; ఉన్నతాదర్శానికై పోరాడుతూన్న దేశంలో మాత్రమే ఈ అపూర్వ దృగ్విషయం సంభవించడం సాధ్యమవుతుంది. పెట్టుబడిదారీ దేశాలలో ఇది అసంభవమనేది హేతుబద్ధమే. సాయుధులైన మా శత్రువులపై విజయం సాధించేందుకు గతకాలంలో మా సర్వస్వమూ ధారపోశాం; ఇక ఇప్పుడు మా శక్తినంతనూ ఆర్థిక పునరుద్ధరణకై వినియోగిస్తాం. దీనిని సాధించేందుకు అనేక సంవత్సరాల కాలం అవసరమవుతుంది; అయితేనేం చిట్టచివరకు మేం గెలుస్తాం."

"రష్యాలో కమ్యూనిజాన్ని నిర్మించడం మీ ఉద్దేశంలో ఎప్పుడు పూర్తి అవుతుంది?"

ఇది చిక్కు ప్రశ్నే అని నేననుకున్నాను, కాని లెనిన్ వెంటనే జబాబు చెప్పాడు.

---

* ఇది వార్తాపత్రికా పాఠంలోని పొరపాటు. సోవియట్ రష్యాకీ సెర్బియాకీ యుద్ధం లేదు. లాత్వియా గురించి లెనిన్ చెప్పినట్లు కనబడుతూంది. — సం.

"ఉరాల్ ప్రదేశంలోనూ, ఇంకా ఇతర చోట్లనూ విద్యుదుత్పాదక కేంద్రాలను స్థాపించడం ద్వారా మా యావత్తు పారిశ్రామిక వ్యవస్థనూ విద్యుదీకృతం చేయదల్చుకున్నాం. ఇందుకు పదేళ్లు పడుతుందని మా ఇంజనీర్లు అంటున్నారు. విద్యుదీకరణను విజయవంతంగా, సాధించడమంటే, సమాజ ఆర్థిక జీవనాన్ని కమ్యూనిస్టు రీతిలో ఆర్గనైజ్ చేసే పథాన ప్రధానమైనట్టి తొలి మజిలీ చేరుకోవడమన్నమాట. మా యావత్తు పరిశ్రమకూ దాని అవసరాలన్నిటినీ సమృద్ధిగా తీర్చగల్గే సామర్థ్యాన్ని గల్గిన ఒకేఒక ఉత్పత్తిస్థానంనుండి దానికి అవసరమైన శక్తి అంతా సరఫరా చేయబడుతుంది. ఇంధనపు అన్వేషణలో దుబారా పోటీని ఇది తొలగించివేసి, కమ్యూనిస్టు సూత్రాలననుసరించి ప్రధానావసరాలను సంపూర్ణ స్థాయిలో మార్పిడి చేసుకోగల్గే సామర్థ్యాన్ని సాధించుకుందుకుగాను ఏది లేకపోతే సాధ్య పడదో అట్టి వస్తూత్పత్తి పరిశ్రమకు దృఢమైన ఆర్థిక పునాదిని నిర్మించగల్గుతుంది.

మూడు సంవత్సరాలు అయేసరికి రష్యాలో 5,00,00,000 ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతూంటాయని మేం ఆశించుతున్నామని సందర్భవశాత్తూ చెప్పవచ్చు. ఇటువంటి దీపాలు సంయుక్త రాష్ట్రాల్లో 7,00,00,000 వున్నాయని నేననుకుంటున్నాను, కాని విద్యుచ్ఛక్తి ఇంకా శైశవంలో వున్న దేశంలో ఈ సంఖ్యలో మూడింట రెండు వంతులంటే బ్రహ్మాండమైన విజయం సాధించడమే అవుతుంది. మా ముందున్న బృహత్తర కర్తవ్యాలన్నిటిలోనూ అత్యంత ముఖ్యమైనది నా దృష్టిలో విద్యుదీకరణమే.

సోషలిస్టు నాయకులపై నిశిత విమర్శ

మా సంభాషణ ముగించుతూ లెనిన్ యూరప్ అమెరికాలలోని సోషలిస్టు నాయకులను కొందరిని నిశితంగా విమర్శించాడు. సహజంగానే ఈ విమర్శ ప్రకటనార్థం చేసినదికాదు. ప్రపంచవ్యాప్త విప్లవానికి సార్థకంగా దోహదం చేసేందుకు ఈ పెద్దమనుషుల సామర్థ్యంలోనూ, అంతేకాకుండా వారి ఆకాంక్షలో సహితమూ లెనిన్‌కు విశ్వాసం లేనట్టు ఈ విమర్శలో బయలుపడింది. ఈ సోషలిస్టు "అధికారయుత" అధినేతల వలన కాకుండా, వారిని తోసివుచ్చడం వల్లనే బోల్షెవిజం తన పథాన పురోగమించుతుందనే ఈయన అభిప్రాయమని స్పష్టంగా తెలుస్తూంది.

"The World", నెం. 21368, ఫిబ్రవరి 21, 1920

"కమ్యూనిస్టు" మాసపత్రిక నెం.15, 1957 లో రష్యన్ భాషలో తొలి సారి ప్రచురించబడింది.

"The World" పాఠం అనుసరించి అనువదించబడింది.

మన వైదేశిక ఆంతరంగిక పరిస్థితీ, పార్టీ కర్తవ్యాలూ

ఆర్.సి.పి.(బి.) మాస్కో గుబేర్నియా కాన్ఫరెన్స్‌లో 1920 నవంబరు 21 ని ఇచ్చిన ఉపన్యాసంనుండి

ఈలాగున మన అంతర్జాతీయ పరిస్థితిని మొత్తంగా సింహావలోకనం చేసినట్లయితే, మనం బ్రహ్మాండములైన విజయాలు సాధించామనీ, మనకు ఊపిరి తీసుకుందుకు క్షణమాత్రం తీరుబడి దొరకడమే కాకుండా, అంతకంటెనూ ఎంతో అంత ముఖ్యమైనదే మనకు లభించిందనీ మనకు స్పష్టమవుతూంది. మన ఉద్దేశంలో క్షణమాత్రం తీరుబడి అంటే, సామ్రాజ్యవాదులకు మరింతగా అధికమైన బలంతో అనేక సార్లు మనమీద యుద్ధాన్ని తిరిగి ఆరంభించేందుకు యత్నించే అవకాశం లభించినట్టి స్వల్పవ్యవధి అన్నమాట. కాగా మనదృష్టి ఇతరత్రా ఆకర్షించబడేందుకు కానీ, మన వ్యవహారాల్లో పెట్టుబడిదారీ దేశాలు భవిష్యత్తులో సైనిక జోక్యం కలుగజేసుకునే అవకాశం లేదని చెప్పేందుకు కానీ మనం ఈనాడు కూడా అంగీకరించబోము. సైనిక సంసిద్ధత స్థితిని నిలబెట్టుకోవడం మనకు అవశ్యకం. కాని రష్యన్ విప్లవప్రతిఘాతం చేసిన యత్నాలన్నిటినీ మనం ఏ పరిస్థితులలో ఓడించామో, పాశ్చాత్య రాజ్యాలన్నిటితోనూ ఏ పరిస్థితులలో మనం సలాంఛనంగా శాంతిని కుదుర్చుకున్నామో ఆ పరిస్థితులపై మన దృష్టిని మరలించిన యెడల, ఊపిరి తీసుకుందుకు క్షణమాత్రం తీరిక సమయమే కాకుండా అంతకంటె అధికమే మనకు లభించినట్టు మనకు స్పష్టమవుతుంది — పెట్టుబడిదారీ విధాన రాజ్యాల జాలకంలో మన అంతర్జాతీయ స్థానాన్ని మనం మౌలికంగా గెల్చుకున్నట్టి నూతన వ్యవధి కాలం మనకిప్పుడు లభించింది. బలోపేతమైన పెట్టుబడిదారీ దేశం ఏ ఒక్కటీ కూడా తన సైన్యాన్ని రష్యా మీదకి తరలించేందుకు ఆ దేశం ఆంతరంగిక పరిస్థితులు అంగీకరించవు; ఆ దేశాలలోపల విప్లవం పరిపక్వం చెందడమూ, వెనుకటి రోజుల్లో అవి మనను జయించగల్గి వుండేంతటి త్వరగా ఇప్పుడు ఆ కార్యాన్ని నెరవేర్చగల్గే అవకాశం ఇది ఇవ్వజాలని

డమూ. ఇందులో ద్యోతకమవుతూంది. బ్రిటన్, ఫ్రెంచి, జపాన్ దేశాల సైన్యాలు [illegible] పాటుగా రష్యా భూభాగంపై వున్నాయి. ఈ మూడు రాజ్యాలూ వాటి సైనిక బలాలను ఏమాత్రం స్వల్పాతిస్వల్పంగా మోహరించి వుండినా సరే, కొద్ది నెలలో కాదుకదా కొద్ది వారాల్లోనే మనను జయించి వుండగల్గడంలో ఎట్టి సందేహమూ లేదు. ఈ దాడిని మనం తట్టుకుని నిలబడగల్గామంటే అందుకు కారణం, ఫ్రెంచి సైనికదళాలలో ప్రవేశించిన విచ్ఛిత్తి, బ్రిటిష్ వాళ్ళల్లోనూ, జపాన్‌వాళ్ళల్లోనూ పెల్లుబిక నారంభించిన అల్లకల్లోలమే. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలలోని ఈ వైవిధ్యాన్నే మనం ఈ కాలం అంతటిలోనూ ఉపయోగించుకున్నాం. వ్యవధానంపై మనం విజయం సాధించామూ అంటే అందుకు వారివారి సొంత ప్రయోజనాలే వారిని విడదీసి వుండగా, మన ప్రయోజనాలు మనని సంసక్తపరచి పటిష్ఠవంతం చేశాయి. ఈ విధంగా, మనం ఊపిరి తీసుకుందుకు తీరిక సమయాన్ని సుస్థిరంచేసుకుని, బ్రెస్ట్ శాంతి శకంలో జర్మన్ సామ్రాజ్యవాదుల సంపూర్ణ విజయం అసాధ్యమయేటట్లు చేశాం.

ఇప్పుడు, ఇటీవలి కాలంలో, ఒక కుబేరుల గ్రూపును చేరదీయ నాశించుతూన్నట్టి ఒక అమెరికన్ కుబేరుని నాయకత్వాన అమెరికన్ పెట్టుబడిదారీ సొరచేపలన్నిటిలోనూ అతిభయంకరమైన సొరచేపతో ఏర్పడిన ఒక గ్రూపుతో రాయితీల విషయమై ఒప్పందం ఒకటి కుదుర్చుకునేందుకుగాను రూపొందించిన ప్రాజెక్టు దృష్ట్యా ఈ వైమనస్యం మరింత బెడిసిపోయింది. కేవలమూ ప్రాజెక్టు ఒకటి మాత్రమే తప్ప ఇంతవరకూ ఒప్పందం అంటూ లేనప్పటికీ, దూరప్రాచ్యనుండి మనకు అందుతూన్న సమాచారాలన్నిటిలోనూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునే యత్నాలను గురించి జపాన్‌లో అసాధారణమైన దుగ్ధ ప్రబలుతూన్నట్టు ధ్రువపరచని సమాచారం ఇంచుమించు ఒక్కటైనా లేదని మనకు తెలుసును. జపాన్‌లోని ప్రజాభిప్రాయం మాత్రం అప్పుడే అట్టుడికి పోయినట్టు ఉడికిపోతూంది, కాగా అమెరికా మీదకి జపాన్‌ను ఉసికొల్పడమే సోవియట్ రష్యా కోర్కె అంటూ సోవియట్ రష్యాపై నేరం మోపుతూన్న ఒక వార్తను నేనీవేళ చదివాను.

సామ్రాజ్యవాద పోటీ ఉద్రిక్తతను మనం సరిగానే విలువకట్టి, మనపై వారు సాగించే పోరాటాన్ని కుంటుపరచేందుకని వారిమధ్య వున్న వైమనస్యాన్ని మనం వ్యవస్థాబద్ధంగా ఉపయోగించుకు తీరాలనే మనలో మనం అనుకున్నాం. బ్రిటన్, ఫ్రాన్సుల పరస్పర సంబంధాలలో రాజకీయ విరోధం పైకే అవుపడుతూంది. మనకు లభించినది ఊపిరి తీసుకుందుకు ఒక్క క్షణమాత్రపు తీరిక సమయమనే కాకుండా, నూతన నిర్మాణానికిగాను దీర్ఘకాలపు వ్యవధి లభించగల్గే వాస్తవమైన అవకాశమనే మనమిప్పుడు చెప్పుకోగలం. నిజానికి అంతర్జాతీయ సంబంధాలలో మనకింత వరకూ ఎట్టి స్థావరమూ లేదు. అట్టి స్థావరం మనకిప్పుడు లభించింది, ఇందుకు కారణం, సైనికంగానూ రాజకీయంగానూ అగ్రరాజ్యాలపైనే పూర్తిగా

ఆధారపడాల్సినట్టి స్థితిలో వున్న చిన్న రాజ్యాల వైఖరే. ఫ్రాన్సు ఎంత వొత్తిడి తెచ్చినప్పటికీ పోలెండ్ అందుకు లొంగక మనతో ఇప్పుడు శాంతిని స్థాపించుకుంది. పోలిష్ పెట్టుబడిదార్లు సోవియట్ రాజ్యాధికారంపై ప్రబల ద్వేషాన్నే ప్రదర్శిస్తున్నారు; అత్యంత సరళములైన సమ్మెలను సహితమూ వారు అపూర్వ క్రౌర్యంతో అణచివేస్తున్నారు. వారి కోర్కెలన్నిటిలోనూ అత్యంత ప్రబలమైనది సోవియట్ రష్యాతో యుద్ధమే — అయినప్పటికీ వారిపై ఆంటాంట్ విధించిన షరతులను నెరవేర్చే కంటె మనతో శాంతినే వారు ఎంచుకుంటున్నారు. మొత్తం ప్రపంచ జనసంఖ్యలో సామ్రాజ్యవాద రాజ్యాల భాగం స్వల్పాతిస్వల్పమే అయినప్పటికీ, ప్రపంచమంతా వారి ఏలుబడిలోనే వుంది. సర్వప్రపంచ సామ్రాజ్యవాదాన్ని మూడేళ్లపాటు ప్రతిఘటించిన దేశం ఒకటి అవతరించిందన్న వాస్తవవిషయమే అంతర్జాతీయ పరిస్థితిని గణనీయంగా మార్చివేసింది; కనుకనే చిన్న రాజ్యాలన్నీ — ప్రపంచ ప్రజలో అధికసంఖ్యాకవర్గం వీటిదేకదా — మనతో శాంతిని నెలకొల్పుకుందుకే మొగ్గుచూపుతున్నాయి.

సోషలిస్టు దేశం పెట్టుబడిదారీ విధాన దేశాలతో వర్తక సంబంధాలను పెట్టుకోవడమనే బృహత్తర కారణాంకమే, కేవలం ఈ కారణాంకమే, ఇటువంటి సంక్లిష్టమూ, కేవలం అసాధారణమూ అయిన పరిస్థితులలో మన అస్తిత్వానికి అవకాశం కల్గజేస్తూంది.

అమెరికన్ సోషల్-దురహంకారవాదులలో ఒకడైనట్టీ, మన కుడిపక్షపు సోషలిస్టు-రివల్యూషనరీల, మెన్షెవిక్‌ల అభిప్రాయాలతో అత్యంత సన్నిహితమైన అభిప్రాయాలను కల్గినట్టీ, II వ ఇంటర్నేషనల్ నాయకులలో ఒకడైనట్టీ, ఒక రకం అలెక్సిన్‌స్కి[25] అని చెప్పదగినట్టీ, బోల్షెవిక్‌లకు వ్యతిరేకంగా ఒక దొంతికి దొంతీ పుస్తకాల గ్రంథకర్త అయిన అమెరికన్ సోషలిస్టు పార్టీ సభ్యుడు స్పార్గో, మనం పెట్టుబడిదారీ రాజ్యాలతో బేరాలు కుదుర్చుకుందుకు సంప్రతింపులు సాగిస్తున్నామని మనను నిందించడమూ, కమ్యూనిజం పూర్తి దివాలాకోరుతనానికి ఇదొక నిదర్శనమని నిరూపించడమూ నేను చూడడం తటస్థించింది. కమ్యూనిజం పూర్తిగా దివాలా తీసిందనీ, దాని కార్యక్రమం ఆభాసు పాలైందనీ రుజావు పరచేందుకు ఇంతకంటె గట్టి నిదర్శనం నేను చూప నవసరంలేదని అతడు రాశాడు. విషయాన్ని లోతుగా తరచి పర్యాలోచించే వ్యక్తులు ఇందుకు విరుద్ధంగా చెబుతారని నేననుకుంటాను. సర్వప్రపంచ పెట్టుబడిదార్లపైన సోవియట్ రిపబ్లిక్ సాధించిన భౌతిక, నైతిక విజయాన్ని రుజావుచేసేందుకు, మన టెరర్ చర్యలనూ మన యావత్తు వ్యవస్థనూ కారణంగా తీసుకుని మనమీద యుద్ధానికి దిగిన రాజ్యాలు మనతో వ్యాపార సంపర్కంపెట్టుకోవడమనే మార్గాన సాగినట్టయితే, తన్మూలంగా వారు మనని పటిష్ఠవంతం చేయడమే అవుతుందని ఎరిగి కూడా, తమ అభీష్టాలకు వ్యతిరేకంగానే, మనతో వ్యాపార సంపర్కానికి దిగాయన్న విషయంకంటె గట్టి నిదర్శనాన్ని మరి చూపనవసరంలేదు. కేవలమూ ఒక్క రష్యాకే వున్న శక్తి

తోనే ప్రపంచాన్నంతనీ పునః రూపొందించుతామని మనం వాగ్దానం చేసివుండిన పక్షంలోనే, అలా చేస్తామని మనం కలలు కనివుండిన పక్షంలోనే కమ్యూనిజం దివాలాకోరుతనానికి దీనిని నిదర్శనంగా చూపడానికి వీలుపడుతుంది. అంతటి పిచ్చితనంలోకి మనమెన్నడూ దిగలేదు, కాగా ఎప్పుడైతే అన్ని దేశాల కార్మికులూ మన విప్లవానికి ఊత ఇస్తారో అప్పుడే అది విజయవంత మవుతుందని మనం ఎల్లప్పుడూ చెబుతూ వచ్చాం. అసలు జరిగినదేమిటంటే, మనకు ఊత ఇవ్వడంలో వారు సగమే ఇచ్చి వూరుకున్నారు, ఎందుచేతంటే మనమీద లేచిన చేతిని వారు బలహీనపరచి, అంతటితో ఆగిపోయారు; అయినప్పటికీ ఈ విధంగా వారు మనకి సహాయమే చేశారు.

ఆర్.సి.పి.(బి.) మాస్కో కమిటీచే "పార్టీ ప్రచలిత కృషిలో వర్తమాన సమస్యలు" అనే పాంఫ్లెట్‌లో 1920 లో ప్రచురించబడింది.

వి.ఐ. లెనిన్, "రచనలు",
4 వ రష్యన్ కూర్పు,
31 వ సంపుటి,
పుటలు 384–387

ఆర్. సి. పి. (బి.) మాస్కో ఆర్గనైజేషనులోని కార్యశీలుర సమావేశంలో ఇచ్చిన ఉపన్యాసంనుండి

డిశంబరు 6, 1920

ఇప్పుడు ఆర్థిక విషయాల గురించి ప్రస్తావిస్తాను. జర్మన్ ప్రశ్నను తడమడం ప్రారంభించామంటే ఇక ఆర్థిక విషయాల్లోకి వెళ్లామన్నమాటే, వెర్సైయిల్స్ శాంతి తదుపరి, ఆర్థిక దృష్ట్యా జర్మనీ మన లేకపోతూంది; జర్మనీ ఒక్కటే కాదు, తదితర విజిత దేశాలన్నీ, ఉదాహరణకు వెనుకటి సరిహద్దులలో ఆస్ట్రియా-హంగేరీ (దేశంలో కొంత భాగం విజేతలైన రాజ్యాల చేతిలో పడినప్పటికీ), వెర్సైయిల్స్ సంధి కింద ఇక మనగల్గనే లేవు. బ్రహ్మాండమైన ఆర్థిక, సాంకేతిక బలం కల్గిన సంఘంగా ఇవి కేంద్ర యూరప్‌లో ఏర్పడుతున్నాయి. ఆర్థిక దృష్ట్యా, ప్రపంచ ఆర్థిక పునరుజ్జీవానికి ఇవన్నీ అవసరమే. రాయితీలపై 23 వ నవంబరు ఉత్తర్వును[26] మనం శ్రద్ధతో సంపూర్ణంగా పునఃపునః పఠించినట్టయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రాముఖ్యతను మనం నొక్కిచెబుతూన్నట్టు మీకు కనబడుతుంది. కాగా దీనిని మనం బుద్ధిపూర్వకంగానే నొక్కిచెబుతున్నాం కూడా. ఇదే సరైన దృక్పథం అనేది నిర్వివాదం. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవానికి రష్యను ముడి పదార్థాలను ఉపయోగించక తప్పదు. వీటిని ఉపయోగించనిదే బయటపడడం ఉత్తది — ఇది ఆర్థిక సత్యం. అర్థశాస్త్రాన్ని అధ్యయనంచేస్తూ, శుద్ధమైన బూర్జువా దృక్పథంనుంచి అర్థశాస్త్రాన్ని పరిశీలిస్తూన్న శుద్ధ బూర్జువాయే దీనిని ఒప్పుకుంటున్నాడు. "శాంతియొక్క ఆర్థిక అనుషక్తాలు" ["The Economic Consequences of Peace"] అనే గ్రంథాన్ని రచించిన జాన్ కీన్స్ దీనిని ఒప్పుకుంటున్నాడు. హేమా హేమీ కుబేరుడుగా యూరప్ యావత్తూ పర్యటించినట్టి వాన్‌డెర్‌లిప్ సహితమూ ముడిపదార్థాలను యుద్ధం దిగమింగడంచేత ఇవి ప్రపంచంలో మిక్కిలి తక్కువగా వుండడం కారణంగా ఆర్థికవ్యవస్థను పునరుజ్జీవింపజేయడానికి వీలుపడదని ఒప్పుకున్నాడు. రష్యామీద ఆధారపడాల్సి వుంటుందనే అంటున్నాడతడు. ఇప్పుడు రష్యా ప్రపంచం ఎదుట నిలబడి: "ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునరు

జ్జీవింపజేసే కార్యాన్ని మేం నిర్వహిస్తాం — ఇదిగో మా ప్రణాళిక" అని చాటిచెబుతోంది. అర్థశాస్త్రరీత్యా ఇది సరైనది. ఈ తదుపరి కాలంలో సోవియట్ రాజ్యశక్తి బలం చేకూర్చుకుంటుంది, అంతేకాదు తాను బలం చేకూర్చుకోవడమే కాకుండా, యావత్ ప్రపంచ ఆర్థికవ్యవస్థనే పునరుజ్జీవింపజేసేందుకు ఒక ప్రణాళికను ముందుకు తెస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ విద్యుదీకరణ ప్రణాళికకూ మధ్య విజ్ఞానశాస్త్రీయంగా సరైన సంబంధం నెలకొల్పబడింది. మన ప్రణాళికలో ఒక్క కార్మికుల సానుభూతినే కాకుండా, పెట్టుబడిదార్లలో సబుబుకు కట్టుబడేవారి సానుభూతిని సహితమూ — వారి దృష్టిలో మనం "భయంకరులైన బోల్షెవిక్-టెర్రరిస్టులు," వగైరా మనుషులమే అయినప్పటికీ — మనం బహాళ సంపాదించగల్గుతాం, ఇందుచేత మన ఆర్థిక ప్రణాళిక సరైనదే. ఇక పెటీబూర్జువా డెమోక్రాట్లందరూ మన ప్రణాళికను చదివి మన దిశగా ఊగిసలాడుతారు, ఎందుచేతంటే సామ్రాజ్యవాదులు అప్పుడే వాళ్లలో వాళ్లు కొట్లాడుకుంటూండగా, సాంకేతికులూ అర్థశాస్త్రజ్ఞులూ ఎట్టి అభ్యంతరం చెప్పేందుకూ వీల్లేనట్టి ప్రణాళిక ఇక్కడ వుందాయె. ఆర్థిక రంగంలోకి మనం దిగుతున్నాం, దిగి నిర్మాణకార్యానికై ధనాత్మకమైన కార్యక్రమాన్నొకదానిని సర్వ ప్రపంచం ఎదుట మనం ప్రతిపాదిస్తున్నాం.

ఈ ప్రశ్నను మనం పెట్టుబడిదారీ వ్యతిరేక తలంలోకి తీసుకెళ్లుతున్నాం. ప్రశ్నను ముందుకుతెచ్చి మనం ఇలా అంటున్నాం: ప్రపంచాన్ని హేతుబద్ధమైన ఆర్థిక పునాదులపై నిర్మించే కార్యాన్ని మేము నిర్వహిస్తాం, కాగా మేము చెప్పేదే సరైనది కావడంలో ఎట్టి సందేహమూ వుండనవసరంలేదు. ఆధునిక యంత్రాలతోనూ, విజ్ఞానశాస్త్ర సహాయంతోనూ కార్యరంగంలోకి దిగామంటే, యావత్ ప్రపంచపు ఆర్థికవ్యవస్థనూ పునరుజ్జీవింపజేయగల్గడం వెంటనే సాధ్యమవుతుందనడంలో ఎట్టి సందేహమూ లేదు.

"పెట్టుబడిదారీ పెద్దమనుషుల్లారా! మీరెందుకూ పనికిరారు. మిమ్మల్ని మీరే నాశనం చేసుకుంటూన్న సమయంలో, మా ఉద్దేశాల ప్రకారం మేము నిర్మాణకార్యాన్ని సాగించుకుంటున్నాం. కనుకనే, ఏమండీ! మాతో ఒక అంగీకారానికి వచ్చేందుకు ఇంకా వేళకాలేదాండీ?" అని మనం పరిశ్రమాధిపతులతో చెబుతూన్నప్పుడు మనం ఒక తరహా ప్రచారమే చేస్తున్నాం. వాళ్ళు ఎంత బుర్రగోక్కున్నా సరే, ప్రపంచం అంతటిలోనూ వున్న అందరు పెట్టుబడిదార్లు: "అవును, వేళైంది, ఆ వర్తకపు సంధిపై సంతకం చేదామండి," అని ప్రత్యుత్తరమిచ్చి తీరాలి.

అప్పుడే బ్రిటిష్‌వారు ఒక ముసాయిదా రాసి మనకు పంపించారు. అదిప్పుడు చర్చలో వుంది, ఇక దీనితో ఒక నూతన శకం ఆరంభమవుతూంది. యుద్ధంలో వారు మతాబా కాల్చారు, ఇప్పుడిక ఆర్థిక రంగంలో యుద్ధం చెయ్యాలి వారు. మనం దీనిని పూర్తిగానే అర్థంచేసు

కున్నాం. ఇంకేముంది — యుద్ధం చేసేశాం కదా, శాంతి వచ్చేస్తోంది, ఇక సోషలిస్టు దూడ, పెట్టుబడిదారీ తోడేలు రెండూ ఒకదాన్నొకటి కౌగలించేసుకుంటాయి, అని మనం ఎన్నడూ కలలు కనలేదు. అట్టే, ఎన్నడూ అలాంటి కలలు కనలేదు మనం. ఆర్థిక రంగంలో మాతో మీరు యుద్ధంచేయాల్సి వుండడం కూడా ఒక బ్రహ్మాండమైన ప్రగతే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దృక్పథంనుండి రాయితీలను పరిశీలించుతూన్నట్టి సర్వప్రపంచ ప్రణాళికను మేము మీముందుంచుతున్నాం. అర్థశాస్త్రరీత్యా ఇది నిర్వివాదం. ప్రజార్థిక సమస్యను లేవనెత్తే ఏ ఇంజనీరైనా సరే, ఏ వ్యవసాయశాస్త్రవేత్త అయినా సరే దీనిని కాదనలేడు. అంతేకాదు, పెట్టుబడిదార్లలోనే అనేకులు: "రష్యా లేనిదే స్థిరమైన పెట్టుబడిదారీ రాజ్యాల వ్యవస్థ అంటూ వుండేందుకే వీల్లేదు" అంటున్నారు; కాని సర్వప్రపంచ ఆర్థికవ్యవస్థనూ గుణాత్మకంగా వేరైన మరొక ప్రణాళికా విధానంలో నిర్మించేటట్టి కార్యక్రమం ఒకదానిని మనం ముందుకు తీసుకొస్తున్నాం. ప్రచారం దృష్ట్యా దీనికొక బ్రహ్మాండమైన ప్రాముఖ్యత వుంది. మనం మంజూరుచేసే రాయితీలలో ఒక్క దానినైనా కూడా వారు అంగీకరించక పోయినప్పటికీ — బహుశ ఇదే సంభవమని నా అభిప్రాయం కూడా — రాయితీల గురించి లేచిన ఈ రగడ అంతా కేవలం ఏ కొన్ని పార్టీ సమావేశాలూ ఉత్తర్వులూ వీటితో మాత్రమే, ఒక్క రాయితీ అయినా అంగీకరించబడకుండానే అంతమైనప్పటికీ కూడా, ఏదో కొంత గెలుపు మాత్రం మనమప్పుడే సాధించామనే మనమనుకోవచ్చు. ఆర్థిక నిర్మాణానికిగాను ఒక ప్రణాళికను మనం ముందుకు తీసుకొచ్చామన్న విషయం అటుండగా, యుద్ధంవల్ల ధ్వంసం కాబడిన రాజ్యాలన్నిటినీ మన పక్షానికి తిప్పుకోగల్గాం. ప్రపంచం పీడిత జాతుల కిందనూ రాజ్యం చలాయిస్తూన్న జాతుల కిందనూ విభజించబడిందని నేను మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌లో చెప్పాను. ప్రపంచ జనాభాలో పీడిత జాతుల ప్రజలు 70 శాతానికి తక్కువ వుండరు. వెర్సైయిల్స్ శాంతి మరొక 15 కోట్లమందిని వీరితో చేర్చింది.

నిజంగా, అన్నిదేశాల శ్రామికుల ప్రతినిధులముగా మన మీనాడు ప్రపంచం ముందుకు రావడమే కాకుండా, పీడిత ప్రజలందరి ప్రతినిధులుగా మనం ప్రపంచం ముందుకు వస్తున్నాం. "ప్రాచ్య ప్రజలు" అనే పేరుతో ఒక మాసపత్రికను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇటీవల ప్రచురించడం మొదలుపెట్టింది. "సర్వదేశ శ్రామికులారా, పీడిత ప్రజల్లారా, ఏకముకండి!" అనే నినాదాన్ని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రాచ్యప్రజలకిచ్చింది. ఎవరో కాని ఒక కామ్రేడ్ నన్నిలా ప్రశ్నించాడు: "నినాదాలను మార్చడానికి ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎప్పుడు అధికారమిచ్చింది?" ఆ విషయం గురించి నాకు నిజంగా ఏమీ జ్ఞాపకంలేదు. "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" దృక్పథంనుండి చూచినట్టయితే ఇది సరైనదికాదు, సహజంగానే. అయితే "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" రచించినప్పుడున్న పరిస్థితులు కేవలమూ వేరు, కాని ప్రస్తు

తవు రాజకీయాల దృక్స్థానంనుండి చూచినట్లయితే ఇది సరైనదే. పరిస్థితులు మరింత తీవ్రమైపోయాయి. జర్మనీ యావత్తూ అట్టుడికినట్టు ఉడికిపోతూంది, ఆసియా యావత్తూ అట్టుడికినట్టు ఉడికిపోతూంది. ఇండియాలో విప్లవోద్యమం ఎలా రూపొందుతూందో మీరు చదివారు. జపాన్‌వాళ్లంటే చైనాలో వైరిద్వేషం, అమెరికావాళ్లన్నా అంతే. జర్మనీలో ఆంటాంట్‌పట్ల ఎంతగా మండిపడిపోతూన్న ద్వేషమంటే, జర్మన్ కార్మికులకు వారి పెట్టుబడిదార్లంటే వున్న ద్వేషాన్ని చూసినప్పుడు మాత్రమే దీని తీవ్రత అర్థమవుతుంది; రష్యాలో సంభవించిన ఫలితాలవల్ల, రష్యానే ప్రపంచంమీద వున్న సర్వపీడిత ప్రజారాసుల ప్రత్యక్ష ప్రతినిధిగా చేశారు పెట్టుబడిదార్లు; ఇప్పుడు సంభవింమాతూన్న ఘటనల ఫలితంగా రష్యాను ఒక ఆకర్షణ వస్తువుగా భావించడానికి ప్రజలు అలవాటు పడుతున్నారు. జార్జియానుండి వెలువడుతూన్న ఒక మెన్‌షెవిక్ వార్తాపత్రిక ఇటీవల ఇలా రాసింది: "భూమిమీద రెండు శక్తులున్నాయి: ఆంటాంటూ, సోవియట్ రష్యా". ఎవరీ మెన్‌షెవిక్‌లు? గాలి వాటునుబట్టి పోయే మనుషులు — మెన్‌షెవిక్‌లు. అంతర్జాతీయ రంగంలో మనం బలహీనంగా వుండిన రోజుల్లో వీరు: "బోల్‌షెవిక్‌లు నాశనంకావాలి!" అని అరిచారు. ఎప్పుడైతే మనం బలపడనారంభించామో అప్పుడు వీరు: "మేము తటస్థులం!" అని అరిచారు. ఇప్పుడు మనం శత్రువులను తిప్పికొట్టాము గనుక, ఇప్పుడు వీరు: "అవును, ఇప్పుడిక్కడ రెండు శక్తులున్నాయి" అని అంటున్నారు.

రాయితీలపై ఉత్తర్వులో, యావత్తు ముడిపదార్థాలనూ, అవి ఎక్కడున్నా సరే అందుతో నిమిత్తం లేకుండా, ప్రపంచ ఆర్థిక శక్తులను పునరుజ్జీవింపజేసేందుకుగాను వినియోగించేందుకై అర్థశాస్త్రరీత్యా నిర్వివాదమైన కార్యక్రమం ఒకదానితో సర్వమానవాళి తరపున మనం ముందుకొస్తున్నాం. ఆకలి బాధ ఎక్కడా లేకుండా వుండడమే మనకి ముఖ్యం. మీరు, పెట్టుబడిదార్లు, దీనిని తొలగించలేరు, కాని మేము తొలగించగలం. ఈ భూమిమీదవున్న 70 శాతం జనాభా తరపున ప్రతినిధులముగా మేం మాట్లాడుతున్నాం. ఈ ప్రాజెక్టు విషయమై పరిస్థితులు ఎలా పరిణమించినప్పటికీ, అర్థశాస్త్రరీత్యా మాత్రం అది దోషరహితంగానే వుంటుంది. రాయితీల విషయమై ఒప్పందం కుదిరినా కుదరకపోయినా, ఆ సంగతి ఎలా వున్నప్పటికీ, ఆర్థిక దృష్ట్యా వాటికున్న ప్రాముఖ్యత మాత్రం వాటికి వుండనే వుంటుంది.

మీరు చూసినట్లుగా, ఉపోద్ఘాత రూపంలో నేను సుదీర్ఘమైన ఉపన్యాసమే చేసి, రాయితీల మేళ్లను నిరూపించాల్సి వచ్చింది. ఉత్పత్తులను సంపాదించుకుందుకు కూడా రాయితీలు సహజంగానే మనకు ముఖ్యం. ఇది సరైనది, అందుకేమీ సందేహంలేదు. కాని అసలు విషయంలో సారం రాజకీయ సంబంధాలు. సోవియట్ల మహాసభ జరిగే నాటికి మీకు 600 పుటల గ్రంథం — రష్యా విద్యుదీకరణ ప్రణాళిక — అందుతుంది. ఇది ఉత్తమోత్త

మేలైన వ్యవసాయశాస్త్రవేత్తలూ ఇంజనీర్లూ ఆలోచించి తయారుచేసిన ప్రణాళిక. విదేశీయ పెట్టుబడి, విదేశీయ ఉత్పత్తిసాధనాల సహాయంలేనిదే ప్రణాళికను త్వరితగతిని సాధించడం మనకు సాధ్యపడదు. కాని సహాయం పొందాలంటే అందుకు మూల్యం చెల్లించాలి మనం. ఇంతవరకూ మనం పెట్టుబడిదార్లతో యుద్ధంచేస్తూనే వున్నాం; వాళ్లు మనతో ఇలా అన్నారు: 2,000 కోట్లు చెల్లించండి, లేకపోతే మీ పీక నొక్కేస్తాం. కాని మన పీక నొక్కేయడం వాళ్ల తరంకాలేదు, వాళ్లకి రుణాలను మనం ఎంత మాత్రం చెల్లించం. ప్రస్తుతం మనకి కొంత వ్యవధి దొరికింది. మాకు ఆర్థిక సహాయం అవసరమయేంత కాలమూ అందుకు మీకు డబ్బు చెల్లించేందుకు మేము ఒప్పుకుంటాం — ప్రశ్నను ఈవిధంగా రూపొందించితేనే తప్ప మరే విధంగా రూపొందించినప్పటికీ అర్థశాస్త్రరీత్యా దానికి పునాదే వుండదు. రష్యా పారిశ్రామికంగా నాశనమైపోయింది, యుద్ధానికి ముందుండిన స్థితితో పోల్చితే ఇప్పటి స్థితి ఏ పదో వంతుకు దిగిపోయిందో, ఇంకా అంతకంటే కిందకి దిగిపోయిందో కూడా. యావత్తు పెట్టుబడిదారీ ప్రపంచంతోనూ మూడేళ్లపాటు మనం యుద్ధం చేస్తూంటామని మూడేళ్ల క్రితం ఎవరైనా మనతో అని వుంటే, మనమే నమ్మివుండేవాళ్లంకాం. ఇప్పుడు ఎవరైనా మనతో ఇలా అనవచ్చు: "యుద్ధానికి పూర్వమున్న జాతీయ సంపదలో పదోవంతుతో జాతీయార్థిక పునరుద్ధరణ సాధించడమంటే — యుద్ధంచేయడంకంటె ఇదే ఎంతో కష్టసాధ్యమైన కార్యం." నిజమే, యుద్ధంచేయడంకంటె ఇదే ఎంతో కష్టమైన కర్తవ్యం. కార్మిక ప్రజారాసుల, ఆత్మరక్షణకై భూస్వాములతో పోరాడిన రైతుల ఉత్సాహంయొక్క సహాయంతో యుద్ధం సాగించేందుకు వీలుపడింది. ఇప్పుడు భూస్వాములనుండి రక్షించుకోవడం కాదు, ఇప్పుడు చేయాల్సినది రైతులు అలవాటుపడని పరిస్థితులలో ఆర్థిక పునరుద్ధరణను సాగించడం. ఉత్సాహం, ఎదురుదాడి, స్వార్థత్యాగమూ వీటివల్ల ఇక్కడ విజయం చేకూరదు, దైనందినమూ చేయాల్సినట్టి, విసుగెత్తించేటట్టి, ఉత్సాహరహితమైనట్టి చిల్లర పనులవల్లనే ఇక్కడ విజయం చేకూరుతుంది. నిస్సందేహంగా ఇదెంతో కష్టమైన పని. మనకవసరమైన ఉత్పత్తి సాధనాలు ఎక్కడనుంచి వస్తాయి? అమెరికావాళ్లకి ఆశచూపెట్టాలంటే, వాళ్లకి డబ్బు చెల్లించాలి: వాళ్లు వ్యాపారస్థులాయెరి. డబ్బు చెల్లించడం ఎలాగు? బంగారం ఇచ్చా? మనకున్న బంగారం పారేసుకోలేమే. ముడిపదార్థాలనూ ఇచ్చుకోలేం, ఎందుకంటే మన అవసరాలే తీరలేదు ఇంకానూ. ఇటాలియన్లకు లక్ష పూడ్ల ఆహారధాన్యం ఇచ్చే విషయం ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌లో వచ్చినప్పుడు, ఆహార సరఫరాల ప్రజా కమిస్సార్ లేచి నేనివ్వననంటాడు. ఆహారధాన్యం ఎక్కించుకుని వచ్చే ప్రతి రైలు కోసమూ మనం బేరంచేస్తున్నాం. ఆహారధాన్యం లేనిదే మన విదేశ వాణిజ్యం వృద్ధి పొందదు. అయితే మరేమిటిస్తాం? చెత్తసామానా? వాళ్లకి వుంది బోలెడంత చెత్తసామాను. ఆహారధాన్యంతో వ్యాపారం చెయ్యండి అంటున్నారు

వాళ్ళు. మనం ఆహారధాన్యం ఇవ్వలేం. కనుకనే మనం రాయితీలు ఇచ్చి సమస్యను పరిష్కరించుకుందాం.

ఇక తరువాతి విషయం తీసుకుంటాను. రాయితీలు కొత్త ప్రమాదాలను తీసుకొస్తాయి. నా ఉపన్యాసం మొదట్లో నేను చెప్పినదానినే మళ్ళీ చెబుతున్నాను, అదేమిటంటే: "పెట్టుబడిదార్లు మిమ్మల్ని బుట్టలో వేసుకుంటారు సుమండీ, వాళ్ళు గడుసువాళ్ళు, జిత్తులమారులు!" అని అడుగునుండి, కార్మికరాసులనుండి కేక వినబడుతూంది. ఇది వినబడడం సంతోషమే, ఎందుచేతంటే కొవవ్యాపిరిలో సహితమూ పెట్టుబడిదార్లతో యుద్ధం చేసే బ్రహ్మాండరాశి ఎంతగా వృద్ధిపొందుతూందో దీనివల్లనే తెలుస్తూంది. కామ్రేడ్ స్త్రైపానొవ్ అధ్యాపకుని భావంతో రాసిన వ్యాసాలలో (రాయితీలకు వ్యతిరేకంగా వున్న వాదనలన్నిటినీ అతడు మొదట పేర్కొంటాడు, తరువాత రాయితీలకు ఒప్పుకోవాలంటాడు; కాని పాఠకులలో కొందరికి రాయితీలు అవసరమని నమ్మకం కుదిరిపోయి, వ్యాసాలలో మంచి భాగాన్ని ఇక చదవడమే మానివేయవచ్చు) సరైన అభిప్రాయాలు కొన్ని వున్నాయి, కాని లాక్‌హార్ట్ ఇక్కడకు వస్తాడన్న కారణంతో బ్రిటన్‌కు మనం రాయితీలు మంజూరు చేయకూడదని అతడు చేసిన వాదనను నేను ఒప్పుకోను. ఆ రోజుల్లో చె.క.* బాల్యావస్థలోనే వుండి ఇప్పుడున్నంత దార్ఢ్యస్థితిలో లేకపోయినప్పటికీ కూడా, అతగాడి ఆటలను కట్టించగల్గాం. కాగా మూడేళ్ళ యుద్ధం సాగించిన తరువాత సహితమూ గూఢచారులను పట్టుకోవడం ఎలాగో మనకి తెలియకపోతే, ఇక ఇటువంటి మనుషులం మనం రాజ్యాన్ని నడపడం వదులుకోవడమే మంచిది. ఇంతకంటెనూ అపరిమితంగా కష్టమైన సమస్యలనే మనం పరిష్కరిస్తున్నాం. ఉదాహరణకు, ఈనాడు క్రిమియాలో 3 లక్షలమంది బూర్జువాలున్నారు. భవిష్యత్తులో చాటువ్యాపారానికీ, గూఢచారి పనులకీ, పెట్టుబడిదార్లకు నానారకాల మద్దతుకీ ఇది పుట్టిల్లు. అయినప్పటికీ మనం బెదిరిపోవడంలేదే. వారి సంగతేమిటో చూస్తాం, దేశం నాలుగు చోట్లకీ వారిని పంపకం చేసేస్తాం, వాళ్ళని లొంగదీసి, వాళ్ళ అంతు తేల్చేస్తాం అంటున్నాం మనం.

ఇదిలా వున్నప్పుడు, నిర్దిష్టమైన రాయితీల కోసం నియమితులు కాబోయే విదేశస్థులు మనకి ప్రమాదకరంగా తయారవుతారనీ, వారిమీద మనం ఒక కన్నువేసి వుంచలేమనీ అనడం హాస్యాస్పదమే అవుతుంది. అదే గనుక నిజమయితే ఇంత శ్రమపడి మనం రాజ్యాన్ని పరిపాలించడమే అవసరం లేకపోయేది. ఇక్కడ మనకు తటస్థపడుతూన్నది కేవలమూ

---

* చె.క. — విప్లవప్రతిఘాతంపై పోరాటం సాగించేందుకుగాను స్థాపించబడిన అసాధారణ కమీషన్. — అనువాదకుడు.

స్వచ్ఛంగా అర్గనైజేషనుకి సంబంధించిన కర్తవ్యమే, ఇక దీని గురించి అట్టే ప్రస్తావించుతూ కూచోవడం అవసరంలేదు.

అయితే, రాయితీలనివ్వడమంటే ఇక శాంతి స్థాపించబడిందని భావించడం మాత్రం సహజంగా గొప్ప పొరపాటే అవుతుంది. అటువంటిదేమీ కాదిది. రాయితీలు ఒక కొత్త యుద్ధం రూపం తప్ప మరేమీ కాదు. యూరప్ మనమీద యుద్ధంచేసింది, ఇక ఇప్పుడు యుద్ధం ఒక మాతన తలానికి బదిలీ అయింది. వెనుకటి రోజుల్లో ఏ యుద్ధరంగంలోనైతే సామ్రాజ్య వాదులు అంతులేని బలం కల్గివుండేవారో ఆ రంగంలో — సైనిక రంగంలో — యుద్ధం జరుగుతూండేది. వారికీ మనకీ వున్న ఫిరంగుల, మెషీన్‌గన్నుల సంఖ్యనూ, వారి ప్రభుత్వాలూ మన ప్రభుత్వమూ యుద్ధసన్నాహాలకై తరలించగల్గే సైనికుల సంఖ్యనూ సరిపోల్చి చూచినట్టయితే, నిస్సంశయంగా ఒక పక్షం దినాల్లోనే వారు మనను నాశనం చేసివేసి వుందురు. కాని ఆ రంగంలోనే మనం తట్టుకుని నిలబడగల్గాం. ఇక ఇప్పుడు మనం పోరాటాన్ని ఇంకా ముందుకు తీసుకువెళ్లేందుకు పూనుకుంటున్నాం, ఆర్థిక యుద్ధంలోకి మనం మళ్లుతున్నాం. ఒక రాయితీ విభాగం పొరుగున, అనగా ఒక రాయితీ చదరం పక్కనే మన చదరం ఒకటి వుంటుందనీ, దాని పక్కనే మళ్ళీ మరొక రాయితీ చదరం, దాని పక్కను మన చదరం, మళ్లీ దాని పక్కను వాళ్ల చదరం — ఇలా ఏర్పాటవుతుందని మనం ఖండితంగా చెబుతున్నాం; వాళ్ళ ఫ్యాక్టరీల పక్కనే మన ఫ్యాక్టరీలను కట్టుకోవడంవల్ల ఆదర్శప్రాయములైన ఫ్యాక్టరీలను ఎలా స్థాపించుకోవడమో వాళ్ల దగ్గరనుంచి మనం నేర్చుకుంటాం. దీనిని నేర్చుకోలేకపోతే మనం నోరుమూసుక్కూచోవడం మంచిది. సాంకేతిక శాస్త్రంలోని అత్యంత అధునాతనపు పద్ధతుల ప్రకారం ఫ్యాక్టరీలకు ఉపకరణాలను సమకూర్చడమంటే ఈ నాడు ఏమంత సులువైన సమస్యకాదు, దీనిని నేర్చుకోవాల్సి వుంటుంది, ఆచరణవల్ల నేర్చుకోవాల్సి వుంటుంది, ఎందుకంటే ఏ పాఠశాలలూ, విశ్వవిద్యాలయాలూ, కోర్సులూ దీనిని నేర్పలేవు. కనుకనే, "రండి, వచ్చి ఇక్కడకిక్కడే నేర్చుకోండి," అని పిలిచే చదరంగపు గళ్ల నమూనాలో మనం రాయితీలు ఇస్తున్నాం.

రాయితీలవల్ల మనకు బ్రహ్మాండమైన ఆర్థికోపయోగం కల్గుతుంది. వారు జనవాసాలను నిర్మించేటప్పుడు, సహజంగానే వారు తమ పెట్టుబడిదారీ అలవాట్లనే తమతో కూడా తీసుకొచ్చి, రైతాంగాన్ని భ్రష్టు పరచజూస్తారు. కాని మనం వాళ్లను ఒక కంటితో కనిపెట్టుతూనే వుండి, వాళ్ల ప్రభావాన్ని మన కమ్యూనిస్టు ప్రభావంతో అడుగడుగునా ప్రతిఘటిస్తూండాలి. ఒకటి కమ్యూనిస్టు, రెండవది పెట్టుబడిదారీ — ఈ రెండు పద్ధతుల మధ్య, రెండు రూపకరణాల మధ్య, రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య ఇది కూడా ఒకరకమైన యుద్ధమే. వారికంటె మనమే బలవంతులమని నిరూపించుతాం. మనతో వారు ఇలా

అంటున్నారు: "సరే మంచిదే, వైదేశిక రంగంలో మీరు నిలదొక్కుకోగల్గారు. ఇకిప్పుడు నిర్మాణం ప్రారంభించండి, అప్పుడు చూదాం ఎవరు గెలుస్తారో..." సహజంగానే ఇది కష్టమైన కర్తవ్యమే, అయితేనేమి, "సోషలిజానికున్న బలం ఉదాహరణలోనే వుంది," అని మనం ఇదివరకూ అన్నాం, ఇప్పుడూ అంటున్నాం. తన అధికారాన్ని పునస్థాపించుకోవాలని ఎవడు ఆశించుతున్నాడో వాడిమీద బలప్రయోగం తన శక్తిని చూపుతుంది. కాని బలప్రయోగానికున్న ప్రాముఖ్యత అక్కడితో అంతమైపోతుంది, ఇక అటుపైన శక్తి అంతా ప్రభావానిదీ, ఉదాహరణదీనీ.- కమ్యూనిజం అర్థాన్ని ఆచరణలోనూ ఉదాహరణపూర్వకంగానూ చూపించాలి. మనకి యంత్రాలు లేవు యుద్ధం మనని నాశనంచేసేసింది, రష్యాకు ఉండిన ఆర్థిక వనరులను యుద్ధం హరించివేసింది, అయినప్పటికీ ఈ పోటీ అంటే మనకి భయంలేదు, ఎందుకంటే అన్ని విధాలా దీనివల్ల మనకు లాభమే కల్గుతుంది.

ఈ యుద్ధం ఎటువంటిదంటే, ఈ యుద్ధకాలంలో ఎంతటి స్వల్పాతిస్వల్పమైన లొంగుబాటును సహితమూ మనం ప్రదర్శించకూడదు. ఈ యుద్ధరో మనకి అన్ని విధాలా లాభకరమే, ఒక విధంగా శాంతికి పరోక్షమైన హామీ వుందన్న వాస్తవవిషయం అటుండగా, పాత యుద్ధలోనుంచి ఈ కొత్త యుద్ధంలోకి పరివర్తన కూడా మనకి లాభకరమే. యుద్ధనుంచి శాంతిలోకి మనం ప్రవేశించామనీ, కాని యుద్ధం తిరిగివస్తుందన్న విషయం మనం మరచిపోలేదనీ "ప్రావ్ద" లో అత్యంత లోపభూయిష్ఠంగా నివేదించబడిన సమావేశంలో చెప్పాను. సోషలిజమూ, పెట్టుబడిదారీ విధానమూ రెండూ వున్నంత కాలమూ అవి శాంతియుతంగా జీవించలేవు; ఇదో అదో చిట్టచివరకు విజయవంత మవుతుంది, సోవియట్ రిపబ్లిక్‌కో ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికో దేనికో ఒకదానికి చావుబాజా తప్పదు. ఇది యుద్ధం వాయిదా పడిన గడువు కాలం. పెట్టుబడిదార్లు యుద్ధానికి సాకులు వెతకుతూనే వుంటారు. మన ప్రతిపాదనను వారు అంగీకరించి రాయితీలకు ఒప్పుకున్న పక్షమందు వారికి మరింత కష్టమే కల్గుతుంది. ఇటు, ఒకవేళ యుద్ధమే సంభవించనట్టయితే పరిస్థితులు మనకే అమిత అనుకూలంగా వుంటాయి; అటు, యుద్ధాన్ని కోరుకుంటూవ్న వారు రాయితీలకు అంగీకరించరు. రాయితీలు వుండడమనేది, ఆర్థికంగానూ రాజకీయంగానూ, యుద్ధానికి వ్యతిరేకమైన వాదమే అవుతుంది. మనమీద యుద్ధంచేయగల్గేవారు రాయితీలు పుచ్చుకున్న కారణంగా యుద్ధానికి దిగలేకపోతారు, ఇవి ముందుకాళ్లకి బంధంగా తయారవుతాయి. పెట్టుబడిదారీ విధానానికీ బోల్షెవిజానికీ సంఘర్షణ సంభవించే ప్రమాదం దృష్ట్యా చూచినప్పుడు, గాయితీలు యుద్ధం కొనసాగింపే అని చెప్పాల్సి వుంటుంది, కాని ఇది మరొక క్షేత్రంలో కొనసాగించే యుద్ధం. శత్రువుయొక్క ప్రతి అడుగుజాడ కూడా మనం జాగ్రత్తగా కనిపెట్టుతూనే వుండాలి. పరిపాలనా, ఆజమాయిషీ, అధికారమూ, పలుకుబడి,

ప్రశ్నాపమూ, వీటి సాధనాలన్నీ ఇందుకు అవసరమవుతాయి. ఇదీ కూడా యుద్ధమే. ఇక పరలో మనం ఇంతకంటె పెద్ద యుద్ధంలోనే పోరాడాం, కాని వెనుకటి యుద్ధానికి తరలించిన మనుషుల కంటె ఈ యుద్ధంలోకి ఇంకా హెచ్చుమందినే మనం తరలించుతాం. ఈ యుద్ధానికి వారూ వీరూ అనకుండా, పనిచేస్తూన్న ప్రతివారినీ తరలించాల్సే వుంటుంది; వీరితో ఇలా చెప్పి, విశదపరుస్తాం: "పెట్టుబడిదారీ విధానమే దీనిని దానిని సాధించుతూన్నప్పుడు, పెట్టుబడిదార్లను కూలదోసినట్టి మీరు, కార్మికులూ రైతులూ, వాళ్లకంటె తక్కువ సాధించడానికి వీల్లేదే. అందుకని మీరు నేర్చుకోవాలి."

సోవియట్ శక్తి పెట్టుబడిదార్లను అందుకోవడమే కాకుండా వాళ్లను మించి ముందుకు సాగిపోతుందనీ, మనకు చేకూరేది కేవలమూ ప్రత్యక్షమైన ఆర్థిక లాభమే కాకుండా అంతకు మించి వుంటుందనే నా నమ్మకం. విజ్ఞానాన్నీ శిక్షణనూ మనం అలవరచుకుంటాం. ఆచరణసిద్ధమైన సామర్థ్యం లేనిదే ఎట్టి పాఠశాల చదువైనా సరే, ఎంతటి విశ్వవిద్యాలయపు తర్ఫీదైనా సరే ఎందుకూ పనికిరాదు. సరిహద్దుకు దగ్గరగా వున్న జిల్లాలలోనే ప్రధానంగా మనం రాయితీలు ఇస్తూన్నట్టు పాంఫ్లెట్టుకు అనుబంధంగా చేర్చినట్టీ, కామ్రేడ్ మిల్యూతిన్ మీకు చూపెట్టేటట్టీ మ్యాపునుండి మీకు విశదమవుతుంది. యూరపియన్ రష్యాలో ఉత్తరపు అడవుల వైశాల్యం 7 కోట్ల దెస్యతీనలు*. వీటిలో సుమారు కోటీ 70 లక్షల దెస్యతీనలు రాయితీలకుగాను కేటాయించడమైంది. మనం ఉపయోగంలోకి తెచ్చిన అడవుల వైశాల్యం చదరంగపు గళ్ల నమూనాలో ఏర్పాటుచేయబడింది; ఈ అడవులు పశ్చిమ సైబీరియాలోనూ, సుదూర ఉత్తరానా వున్నాయి. ఇందువల్ల మనకు ఏమంతైనా నష్టం కల్గదు. అపార ధనసంపదకు నిలయమైన పశ్చిమ సైబీరియాలో ప్రధాన సంస్థలు స్థాపించబడుతాయి. ఈ ధనసంపదలో మారోవంతు సహితమూ పదేళ్ల తంటాలుపడినా మనం వెలికి తీయలేం. విదేశీయ పెట్టుబడిదార్ల సహాయంతోనూ, ఒక గనిని వారికి ఇవ్వడం వల్లనూ మన గనులను మనం ఉపయోగించుకోగల్గుతాం. రాయితీలు ఇవ్వడంలో ఆ యా ప్రాంతాలను మనమే ఎంచుతాం.

అజమాయిషీ అవసరం దృష్ట్యా రాయితీలను ఎలా ఏర్పాటు చేయాల్సి వుంటుంది? పెట్టుబడిదార్లు మనరైతాంగాన్నీ మన ప్రజారాసులనూ చెడగొట్టడానికి ప్రయత్నిస్తారు. రైతు సన్నకారు ఆస్తిపరుడు అవడంచేత స్వాభావికంగానే అతడు స్వేచ్ఛా వ్యాపారం వైపే మొగ్గుచూపుతాడు, కాని దీనిని మనం ఒక నేరంగా పరిగణిస్తాం. ఇక్కడ రాజ్యాంగయంత్రం ఒక పోరాటాన్ని సాగించాల్సి వస్తుంది. ఆర్థిక వ్యవస్థను నడిపించడంలో రెండు పద్ధతులను — సోషలిస్టు, పెట్టుబడిదారీ పద్ధతులను — సరిగా ఇక్కడే ఒకదానితో ఒకటి పోటీ పడేటట్టు

---

* 1 దెస్యతీన — సుమారు 2 ఎకరాల 70 సెంట్లు — అనువాదకుడు.

మనం చూడాలి. ఇక్కడ కూడా మనకి యుద్ధమే తటస్థించుతుంది, కాగా ఈ యుద్ధంలో మనం అంతిమ పోరాటాన్ని సాగించి తీరాలి. మనకి బ్రహ్మాండమైన పంటనష్టం, పశుగ్రాసం కొరత, పశు నష్టమూ కలుగుతూంది, దీనికి తోడు బృహత్తర భూవిస్తీర్ణాలు సాగుబడిలేక వుండిపోతున్నాయి. వీలైనంత హెచ్చు భూమిలో విత్తులు చల్లేందుకూ వ్యవసాయ వ్యవస్థను మెరుగుపరచేందుకూ సర్వశక్తులును వినియోగించాల్సి వుంటుందని కొద్ది రోజుల్లో ఒక ఉత్తర్వు జారీ అవుతుంది.

ఇంతేకాకుండా మనకి పది లక్షల దెస్యతీన్ల అక్షత భూమి వుంది, మనకు దుక్కి పశువులు లేకపోవడమూ, అవసరమైన వ్యవసాయ పరికరాలు తక్కువగా వుండడమూ ఈ కారణాలవల్ల, ఈ భూమిని సాగులోకి తీసుకు రావడంలేదు; ట్రాక్టరు గనుక వుంటే అది ఈ భూమిని ఎంత లోతుకి పడితే అంత లోతుకు దున్నగల్గుతుంది; కనుకనే ఈ భూమిని అమరకానికి ఇచ్చివేయడమే మనకెంతేనా లాభదాయకం. ఫలసాయంలో సగం కాదుకదా ముప్పాతిక వంతు మనం వదలుకున్నప్పటికి కూడా మనకింకా లాభంగానే వుంటుంది. ఇదీ మన కార్యాలను నడిపించుతూన్న విధానం, కాగా కేవలం ఆర్థిక కారణాలూ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులే కాకుండా, ప్రగాఢమైన రాజకీయ కారణాలు కూడా మన కార్యాలకు ప్రాతిపదికగా ఏర్పడి తీరాలి. ఈ విషయాన్ని ఇంకే విధంగా సమీపించినప్పటికీ అది హ్రస్వదృష్టే అవుతుంది. ఆర్థిక దృష్ట్యా రాయితీలు లాభదాయకమా నష్టదాయకమా అనేదే గనుక ప్రశ్న అయితే, అవి లాభదాయకమనేది నిర్వివాదం. రాయితీలు లేనిదే మన కార్యక్రమాన్ని మన విద్యుదీకరణ ప్రణాళికనూ మనం పూర్తి చేయలేం; అవి లేనిదే మన ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో పునరుద్ధరించడం మనకి సాధ్యంకాదు. కాని ఎప్పుడైతే మనం పునరుద్ధరణను సాధించామో అప్పుడు మనం పెట్టుబడికి అజేయులమవుతాం. రాయితీలు అంటే దాని అర్థం పెట్టుబడితో శాంతి స్థాపించుకోవడంకాదు, దాని అర్థం నూతన తలంలో యుద్ధమే. ఆయుధాలతోనూ టాంకులతోనూ చేసే యుద్ధం ఆర్థిక యుద్ధంలోకి మారుతూందన్నమాట. నిజమే, ఈ యుద్ధంలో కొత్త నష్టాలూ కొత్త ప్రమాదాలూ దాగి వున్నాయి. అయినప్పటికీ వాటిని మనం అధిగమించుతామనే నా నమ్మకం. రాయితీల ప్రశ్నను ఈ విధంగా ప్రదర్శించినప్పుడు, రాయితీలు ఆవశ్యకమని పార్టీ కామ్రేడ్లలో అత్యధికసంఖ్యాకవర్గానికి సులువుగా నచ్చజెప్పగలమనే నా విశ్వాసం. కాగా ఇంతకుముందు నేను పేర్కొన్నట్టి స్వాభావికమైన భయం వుండే, అది ఉపయోగకరమైనట్టి ఆరోగ్యసూచకమైనట్టి భయమే, రానున్న ఆర్థిక యుద్ధంలో మనకు మరింత సత్వరంగా విజయాన్ని చేకూర్చే చలన శక్తిగా దానిని మనం మార్చివేస్తాం.

1923 లో తొలి సారి ప్రచురించబడింది. వి.ఐ. లెనిన్, "రచనలు", 4వ రష్యన్ కూర్పు, 31 వ సంపుటి, పుటలు 421–429

ఎనిమిదవ సోవియట్ల మహాసభలో ఆర్. సి. పి. (బి.) గ్రూపుకు రాయితీలపై ఇచ్చిన నివేదిక

డిశంబరు 21. 1920

కామ్రేడ్స్, మనకు అందిన భోగట్టా ప్రకారం రాయితీల సమస్య సర్వత్రా, ఒక్క పార్టీ సమితులలోనూ కార్మికవర్గ ప్రజారాసులలోనే కాకుండా, రైతాంగపు విశాలరాసుల్లో కూడా గణనీయమైన ఉద్రిక్తతనే కాదుకదా, అలజడి సహితమూ రేకెత్తించిందని తెలుస్తూంది ఈ సంవత్సరం నవంబరు 23 వ తేదీ ఉత్తర్వు దరిమిలా రకరకాల విషయాలపై జరిగిన అత్యధిక సంఖ్య సమావేశాలలో సభ్యులు మిక్కిలి తరుచుగా వేసిన ప్రశ్నలూ, అందిచ్చిన చీట్లూ, రాయితీలను గురించే. ఈ చీట్లలో ఐతేనేమి, సంభాషణలలో ఐతేనేమి సాధారణంగా ఒకేఒక ఆందోళన — మన సొంత పెట్టుబడిదార్లను మనం వెళ్లగొట్టేశాం, ఇక ఇప్పుడేమో మనం విదేశాలనుండి పెట్టుబడిదార్లను రానిస్తున్నామే అనే భయం — ధ్వనిస్తూంది. రాయితీల విషయమై మన పార్టీ కామ్రేడ్లే కాకుండా ఇతరులనేకులు కూడా కనబరుస్తూన్న ఈ భయం, విశాలవ్యాప్తమైన ఈ ఆసక్తి, కార్మిక కర్షకుల రాజ్యాధికారశక్తి రాయితీలు లేకుండానే గడువుకో గళ్లేందుకు తగినంతగా దృఢపడిందనీ, మరీ అవసరమైతేనే తప్ప పెట్టుబడిదార్లతో ఎట్టి బేరసారాలకూ దిగకూడదనే గుణపాఠాన్ని తాము తగినంతగా నేర్చుకున్నామని విశాల ప్రజారాసులు పరిగణించుతున్నాయన్నంత వరకూ కూడా, అమిత కష్టాలతో కూడుకుని మూడేళ్లపాటు సాగిన పోరాటంలో కార్మిక కర్షకుల రాజ్యాధికారశక్తి బలపడినట్లూ, పెట్టుబడిదార్ల విషయంలో మనకు కల్గిన అనుభవం మన మనస్సులో అంత దృఢంగా నాటుకుపోయినట్లూ మనకు చూపెడుతూన్నట్టి ఒక అనుకూల చిహ్నమే అని నేను తలుస్తున్నాను. మనకీ పెట్టుబడిదార్లకీ వున్న సంబంధాలను గురించి ఎంతటి అసాధారణంగా సూక్ష్మమైన శ్రద్ధ చూపబడుతూందో అందుకు అడుగునుంచి వస్తూన్న ఈ రకమైన కంట్రోలే, ప్రజారాసులలోనుంచి పైకి వస్తూన్న ఈ రకమైన భయమే, పార్టీయేతర వర్గాలలో ఈ రకమైన

వ్యాకులతే సాక్ష్యం. విశాల ప్రజారాశుల మనస్థితికి చిహ్నంగా ఇటువంటి భయాలకు ఈ వైపునుండి మనం బేషరతుగా స్వాగతం చెప్పి తీరాలి.

అయినప్పటికీ రాయితీల ప్రశ్న విషయంలో ఈ విప్లవాత్మక సహజజ్ఞానం ఒక్కటే మనకు మార్గదర్శి కాకూడదనే పర్యవసానానికి మనం వస్తామనే నేను తలుస్తాను. ఈ సమస్యను మనం అన్ని వైపులనుండీ చూచి బేరీజు వేసిన తరువాత, మనం అనుసరించిన విధానమే — రాయితీలను ప్రతిపాదించే విధానమే — సరైనదనే నమ్మకానికి మనం వస్తాం. నా నివేదికలో ప్రధాన విషయం — నిజంగా చెప్పాలంటే, ఇటీవల కొద్ది దినాల కిందటే మాస్కోలో కొన్ని వందలమంది బాధ్యతాయుతులైన కార్యకర్తలతో జరిపినట్టి, నివేదికను నేను సిద్ధం చేయకపోవడంచేత దానిని మీకు సమర్పించలేని కారణంగా ఇప్పుడు మరల వివరించుతూన్నట్టి సంభాషణలోని ప్రధాన విషయం — రెండు ప్రమేయాలను రుజువు చేయడమేనని నేను క్లుప్తంగా చెప్పవచ్చు. ఈ రెండు ప్రమేయాలూ ఏవంటే — మొదటిది, శాంతికాలంలో అనుసరించిన రాజకీయాలను కేవలం ఇతర సాధనాలతో కొనసాగింపే ఏ యుద్ధమైనా; రెండవది, మనం ఇస్తూన్నట్టి, మనకు ఇవ్వక విధిలేనట్టి రాయితీలు, ఇతర సాధనాలతో యుద్ధాన్ని మరొక రూపంలో కొనసాగింపే. ఈ రెండు ప్రమేయాలనూ రుజువుచేసేందుకు, లేదా మొదటిదానికి రుజువేదీ ప్రత్యేకంగా అవసరమేలేని కారణాన నిజానికి రెండవదానినే రుజువుచేసేందుకు ఈ ప్రశ్నకున్న రాజకీయ ఆకృతి విషయమై మొదట ఆరంభిస్తాను. ఆధునిక సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య వున్న సంబంధాలలో, ఈనాటి వైదేశిక విధానాన్ని మొత్తంగా అవగాహన చేసుకునేందుకు అవసరమయేటట్టి సంబంధాలనే వివరించుతాను. ఈ విధానాన్నే మనం ఎందుకు అనుసరిస్తున్నామో ఒక అవగాహనకు వచ్చేందుకు ఇది ముఖ్యం.

ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ పేర అమెరికా దేశస్థుడు వాన్‌డెర్‌లిప్ ఒక లేఖ రాశాడు. ఆ లేఖలో అతడీలా అన్నాడు: ''మేము, రిపబ్లికన్‌లం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ అమెరికా సభ్యులం, ఫైనాన్‌షియర్లందరిలోనూ బడా ఫైనాన్‌షియర్ల పార్టీ సభ్యులం, దక్షిణ రాష్ట్రాల విముక్తికి వ్యతిరేకంగా సాగించిన యుద్ధ స్మృతులను ఏ మాత్రమూ పట్టించుకోని మేము ఇప్పుడు అధికారంలో లేం.'' నవంబరులో జరిగిన ఎన్నికలముందు అతడీ లేఖ రాశాడు. ''నవంబరు ఎన్నికల్లో మేమే గెలుస్తాం'' (వారిప్పుడు గెల్చారు), ''మార్చిలో మా పార్టీవాడినే ప్రెసిడెంటుగా చేస్తాం. యూరప్ వ్యవహారాల్లో అమెరికా చిక్కుకుపోయిన తెలివితక్కువను మా విధానం అనుసరించబోదు, మా ప్రయోజనాలను మేము జాగ్రత్తగా చూసుకుంటాం. మా అమెరికన్ ప్రయోజనాలు మమ్మల్ని జపాన్‌తో తలపడేటట్టు చేస్తాయి, మేము జపాన్‌మీద యుద్ధం చేస్తాం. 1923 కల్లా బ్రిటిష్ నౌకాదళంకంటె మా నౌకాదళమే బలంగా వుంటుందన్న సంగతి తెలుసుకోవడం బహుశ మీకు ఆసక్తిదాయకంగానే వుండొచ్చు. యుద్ధం

చేయాలంటే చేతిలో నూనె వుండాలి, నూనె లేనిదే ఆధునిక యుద్ధం సాగించలేం, మాకు నూనె అవసరమై వుండడమే కాకుండా, శత్రువుకి నూనె దొరకకుండా వుండేటట్టి అన్ని చర్యలనూ మేము తీసుకోవాలి. ఈ విషయంలో జపాన్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుంది. కమ్‌చాత్కా సమీపంలో ఎక్కడో ఒక చిన్న సముద్రశాఖ (దాని పేరు మరచిపోయాను), అక్కడ నూనె నిధులున్నాయి, కాగా ఆ నూనె జపాన్‌వాళ్ల చేతిలోకి వెళ్లడం మాకు గిట్టదు. ఆ భూభాగాన్ని మీరు మాకు విక్రయించారంటే, మీ ప్రభుత్వాన్ని మేము వెంటనే గుర్తించేటంతగా మా ప్రజలు ఎంతగానో ఉత్సాహపడతారని మీకు హామీ ఇవ్వగలను. ఆ భూభాగాన్ని మీరు మాకు విక్రయించకుండా, కేవలం రాయితీ మాత్రమే ఇవ్వజూపిన పక్షంలో, ఆ ప్రాజెక్టును పరిశీలించేందుకు మేము నిరాకరించము, కాని సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించేందుకు హామీ ఇచ్చేంతటి ఉత్సాహం వుంటుందని మాత్రం నేను ఖరారు చేయలేను.''

వాన్‌డెర్‌లిప్ లేఖ కుండ బద్దలుకొట్టినట్టు నిష్కపటంగా వుంది; జపాన్‌తో యుద్ధం ముంచుకొస్తూందని స్పష్టంగా గ్రహించి, ''మాతో బేరం కుదుర్చుకోండి, అప్పుడు స్పష్టమైన లాభాలు కొన్ని మీకు ముడుతాయి,'' అని బాహాటంగానూ, సూటిగానూ ప్రశ్నవేసేటట్టి సామ్రాజ్యవాది దృక్పథాన్ని నిరుపమానమైన మానవద్వేషంతో అతడు వ్యక్తపరుస్తున్నాడు. ప్రశ్న ఇలా వుంది: దూరప్రాచ్యమూ, కమ్‌చాత్కా, సైబీరియాలో ఒక చిన్న ముక్క —జపాన్ సైనికబలాలు అక్కడ అధికారం చలాయించుతూన్న మేరకూ, సంగతి సందర్భాల వల్ల దూరప్రాచ్య రిపబ్లిక్‌ను ఒక శాత్రవమధ్యస్థిత రాజ్యంగా సృష్టించడం ఆవశ్యకమై ఉండినంత మేరకూ, సైబీరియన్ రైతులు జపాన్ సామ్రాజ్యవాదుల గుప్పిట్లో చిక్కుకుని నమ్మశక్యంకానంతటి కష్టాలను అనుభవించుతున్నారో, సైబీరియాలో కనివినిఎరుగని దుర్మార్గాలను ఎన్నింటిని జపాన్‌వాళ్లు కావించారో మనకు బాగా సంపూర్ణంగా తెలిసినంత మేరకూ, ఇవి వాస్తవానికి జపాన్‌వాళ్ల స్వాధీనంలోనే వున్నాయి. సైబీరియాలో వున్న కామ్రేడ్లకిది తెలుసు: వారు ఇటీవల వెలువరించిన ప్రచురణలలో దీనిగురించి అన్ని వివరాలూ ఇచ్చారు. అయినప్పటికీ, మనం జపాన్‌తో యుద్ధానికి దిగలేం, జపాన్‌తో యుద్ధం జరగకుండా వాయిదా వేసుకుంటూ, మీరెరిగిన హేతువుల మూలంగా అది మన శక్తికి మించినదై వుండడం కారణంగా, వీలైన పక్షమందు యుద్ధం జరగకుండా వుండేందుకే కూడా సర్వశక్తులూ మనం వినియోగించేటట్టు చూడాలి, కాగా అదేసమయంలో ప్రపంచ వాణిజ్యంతో పసిఫిక్ మహాసముద్రం గుండా మనకున్న సంబంధాలను జపాన్ తెగగొట్టివేస్తూండడం కారణంగా జపాన్ మనకి బ్రహ్మాండమైన హాని కలుగజేస్తూంది. ఇట్టి పరిస్థితులలో, అమెరికా జపాన్‌ల మధ్య నానాటికి పెరుగుతూన్న ఘర్షణ అంతకంతకు మరింతగా తీవ్రమవుతూన్న విరోధం — ఎందుచేతంటే, పసిఫిక్ మహాసముద్రం కోసమూ, దాని తీరప్రాంతాలపైన అధికారం కోసమూ

అనేక దశాబ్దాలుగా జపాన్ అమెరికాల మధ్య మొండి పోరాటం సాగుతూంది, ఈ విరోధం ఎలా వృద్ధిచెందుతూందో, అమెరికా జపాన్‌ల మధ్య యుద్ధం ఎలా అనివార్యమో చూపేటట్టి పూర్తిగా నిర్దిష్టములైన చిహ్నాలతో పసిఫిక్ మహాసముద్రమూ, దాని తీరప్రాంతాల దౌత్య, ఆర్థిక, వాణిజ్య చరిత్ర నిండి వుంది — ఎప్పుడైతే మన కళ్ళెదుట నిల్చివుందో అప్పుడు మనం వెనుకటి మూడేళ్ళుగా ఏ స్థితిలో వున్నామో ఆ స్థితిలోనే ఇప్పుడూ వుంటున్నాం: సోవియట్ రిపబ్లిక్‌పై ద్వేషం పెంచేందుకు ఆందోళన, ప్రచార సాధనాలు ఎన్నైతే వున్నాయో. అన్నిటినీ ఉపయోగించుతూవున్నట్టి, సోవియట్ శక్తి పీక నొక్కేయడానికి — దీనికే సైనిక వ్యవధానం అని వారు పేరుపెట్టారనుకోండి — దొరికే అవకాశాన్ని దేనినీ కూడా జారవిడవనట్టి సైనికంగా మనకంటె అనుపమానమైన శక్తిని కల్గిన సామ్రాజ్యవాద దేశాలచే చుట్టివేయబడిన సోషలిస్టు రిపబ్లిక్ గానే వుంటున్నాం.

ఈ విషయాన్ని జ్ఞాపకం వుంచుకుంటూ, అంతర్జాతీయ రంగంలో సోవియట్ రిపబ్లిక్ ఆక్రమించుతూవున్న స్థానం దృష్ట్యా గత మూడేళ్ల చరిత్రనూ సింహావలోకనం చేసినట్టయితే, మనం ఇంతవరకూ ఓడిపోకుండా నిలబడిగల్గినందుకూ, మన వైట్ గార్డ్‌ల సహాయాన్ని పొందినట్టి నిరుపమాన శక్తిని కల్గిన ఆంటాంట్ రాజ్యాల సంఘాన్ని ఓడించగల్గామంటేనూ, అందుకు కారణం కేవలమూ ఆ రాజ్యాలలో ఐక్యత లేకపోవడమే అనే విషయం స్పష్టమవుతుంది. సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య వున్న తీవ్ర విరోధాల పుణ్యమా అంటూనే, కేవలమూ ఈ విరోధాలు కాకతాళీయమైనట్టీ, పార్టీలోపల వచ్చినట్టి విరోధాలు కాకుండా, భూమి రూపంలోనూ పెట్టుబడి రూపంలోనూ వున్న ప్రైవేటు ఆస్తిపైనే అవి నిలబడి వుండడం కారణంగా, సోవియట్ శక్తికి వ్యతిరేకంగా తమ బలాలను ఐక్యపరచుకుందుకు అవి చేసిన యత్నాలను పూజ్యములు కావించిన దారిదోపిడి విధానాన్నే విధిగా సాగించి తీరిన సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక ప్రయోజనాలలో లోలోతులకు చొచ్చుకుపోయినట్టి, సమూలంగా తొలగించివేయ వీలులేనట్టి విరోధాలు కావడం పుణ్యమా అంటూనే మనం ఇంత వరకూ గెలుస్తూ వచ్చాం. ఇంచుమించు యావత్తు సైబీరియానూ హస్తగతం చేసుకుని, సహజంగావే ఎప్పుడు పడితే అప్పుడే కొల్చాక్‌కి సహాయం చేయగల్గే స్థితిలో వున్న జపాన్‌ని మనం తీసుకున్నట్టయితే, జపాన్ అలా చేయకపోవడానికి మౌలికమైన కారణం తన ప్రయోజనాలు అమెరికా ప్రయోజనాలతో సమూలంగా విభేదించడమే, అమెరికన్ పెట్టుబడి కోసమని జీడిపిక్కల్ని నిప్పుల్లోనుంచి బైటకులాగి తన చేతులు కాల్చుకుందుకు జపాన్ ఇష్టపడకపోవడమే. ఈ బలహీనతను తెలుసుకున్న మనం, మనం స్వయంగా బలపడేందుకని అమెరికా జపాన్‌ల మధ్య వున్న ఈ వైరాన్ని వినియోగించుకుంటూ, మనకు వ్యతిరేకంగా జపాన్ అమెరికాల మధ్య ఒప్పందం కుదిరే అవకాశానికి జాప్యం కల్గించే విధానాన్నే తప్ప వేరొక విధానాన్ని మనం యథార్థంగానే నిర్వహించ

లేకపోయాం. ఇటువంటి ఒప్పందం ఒకటి సాధ్యమే అనేందుకు మనకీ దృష్టాంతం వుంది: కోల్చాక్‌కి సహాయాన్ని వాగ్దానంచేసిన దేశాలన్నిటి మధ్య ఒక ఒప్పందపు వాచకాన్ని అమెరికన్ వార్తాపత్రికలు ప్రచురించాయి[27].

ఈ ఒప్పందం సహజంగానే నీరుగారిపోయింది, కాని మళ్ళీ అవకాశం దొరికీ దొరక డంతో దీనిని తిరిగి లేవనెత్తేందుకు వారు ప్రయత్నించడం ఎంత మాత్రమూ అసంభవం కాదు. కాగా, కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధి ఎంత ప్రగాఢంగానూ ఎంత ప్రచండంగానూ ఉంటుందో, మన రిపబ్లిక్ పీక నులిమివేసేందుకు వారి పునఃప్రయత్నాలు అంత అధికంగా వుంటాయి. కనుకనే ఆ ఒప్పందం కుదరడం కష్టసాధ్యం చేసేందుకుగాను, లేదా సద్యః అది కుదరకుండానే చేసేందుకుగాను సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య వున్న వైరాన్ని వినియోగించు కునే విధానాన్ని మనం పాటిస్తున్నాం. మూడేళ్ళుగా ఇదే మన విధానంయొక్క మౌలిక పంథాగా వుంటూంది. బ్రెస్ట్ శాంతిపై సంతకంచేసే ఆవశ్యకతను ఇదే కల్గించింది, బుల్లిట్‌తో సంధి — మనకు అమితంగా అననుకూలమైనట్టి శాంతి, యుద్ధవిరమణ సంధి — కుదుర్చుకునే ఆవశ్యకతను కూడా ఇదే కల్గించింది, ఈ పంథా మనకిప్పుడు ఏ రూపంలో ప్రత్యక్షమౌతూం దంటే, రాయితీలవంటి ప్రతిపాదనను మనం వదలుకోకూడదనే రూపంలో ప్రత్యక్షమవు తూంది. ఈనాడు మనం కమ్‌చాత్కాను అమెరికాకు ఇస్తున్నాం, జపాన్ సైనికబలాలు అక్కడ వుండడంచేత అది ఎలాగూ మనది కాదన్నమాటే. సద్యః మనం జపాన్‌తో పోరాడే స్థితిలో లేం. నౌకాబలాలుకానీ, సైనికబలాలుకానీ మనకక్కడ భౌతికంగా లేనట్టే, అక్కడకు మనం పంపించజాలనట్టి ప్రదేశాన్ని ఆర్థికంగా ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు అమెరికాకు మనం ఇస్తున్నాం. కాగా ఇలా ఇవ్వడంలో, అమెరికా సామ్రాజ్యవాదాన్ని జపాన్ సామ్రాజ్యవాదం మీదనూ, అన్ని బూర్జువావర్గాల కంటెనూ మనకు మిక్కిలి చేరువలో వుండి, దూరప్రాచ్య రిపబ్లిక్‌ను ఇంతవరకూ తన గుప్పిట్లోనే వుంచుకున్న జపాన్ బూర్జువావర్గం మీదనూ ఉసి కొల్పుతున్నాం.

ఈలా రాయితీలను గురించిన సంప్రతింపులలో ప్రధానంగా రాజకీయ ప్రయోజనాలనే మనం చూసుకున్నాం. కాగా ఈ రాయితీలను గురించి సంప్రతింపులు సాగించినంత మాత్రానే మనకు లాభం చేకూరిందన్న విషయాన్ని ఇటీవలి ఘటనలే సంపూర్ణంగానూ విస్పష్టంగానూ రుజువు చేశాయి. ఇంతవరకూ మనం ఏ రాయితీలనూ మంజూరుచేయలేదు, అమెరికా అధ్యక్షుడు అధికారంలోకి వచ్చేంత వరకూ — ఇది మార్చినెల ముందు ఏలాగూ జరగదు — మంజూరు చేయం కూడానూ; ఇంతే కాకుండా ఒప్పందంలోని వివరాలు రూపొందించబడుతూన్నప్పుడు సహితమూ ఒప్పందంపై సంతకంచేయ నిరాకరించే అవకాశాన్ని మనం అట్టేపెట్టుకుంటాం కూడా,

ఇక పోతే, ఆర్థికంగా ఈ ప్రశ్నకు ఏమంత ప్రాముఖ్యతలేదు, దీనిలో వున్న యావత్తు సారమూ రాజకీయ ప్రయోజనంలోనే ఇమిడి వుంది. మనకందిన యావత్తు పత్రికా సమాచారన్నిబట్టే మనకి లాభమే చేకూరినట్టు రుజువవుతూంది. రాయితీలను గురించిన ప్రాజెక్టు ప్రస్తుతానికి రహస్యంగా వుంచాల్సిందని వాన్‌డెర్‌లిప్పే పట్టుబట్టాడు. రిపబ్లికన్ పార్టీ ఎన్నికలలో గెల్చిందని తెలిసే పర్యంతమూ ఇది రహస్యంగానే వుండాలన్నాడతడు. అతని కోరిక గానీ, ప్రాథమిక ముసాయిదానుగానీ ప్రచురించమని మనమూ ఒప్పుకున్నాం. కాని ఇటువంటి రహస్యం సహజంగానే దాగదు. వాన్‌డెర్‌లిప్ అమెరికా తిరిగి చేరుకున్నాడో లేదో ఆ ఉత్తర క్షణమే రకరకాల రహస్యాలు బయటకు పొక్కడం మొదలైంది. అమెరికాలో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరిగేముందు హార్డింగ్ అభ్యర్థిగా నిలబడ్డాడు. ఇప్పుడు గెల్చింది కూడా అతడే. వాన్‌డెర్‌లిప్ ద్వారా తాను సోవియట్ ప్రభుత్వంతో సంబంధాలు పెట్టుకున్నట్టు వెలువడిన వార్తలను ఖండించుతూ ఈ హార్డింగే పత్రికల్లో ప్రకటించాడు. అతని ఖండన నిర్ద్వంద్వంగా వుండి ఇంచుమించు ఈ మోస్తరుగా వుంది: వాన్‌డెర్‌లిప్‌ను నేనెరగను, సోవియట్ ప్రభుత్వంతో నాకెట్టి సంబంధమూ వున్నట్టు కూడా నేను ఒప్పుకోను. ఇటువంటి ఖండనకు కారణం ఏమై వుంటుందో పూర్తిగా అర్థమౌతూనే వుంది. సోవియట్ ప్రభుత్వంతో ఒప్పందానికి హార్డింగ్ సుముఖుడని, బూర్జువా అమెరికాలో ఎన్నికలు రేపింకా జరుగుతాయనగా అంతకు ముందు రోజున బయటపడినట్టయితే అందువల్ల అతనికి పడాల్సిన వోట్లలో కొన్ని వేల వోట్లు పడకపోవచ్చన్నమాట. అందుచేత వాన్‌డెర్‌లిప్ ఎవడో తాను ఎరగనని అతడు ఆదరాబాదరా ప్రకటించుకున్నాడు. అయితేనేం, ఎన్నికలు అయిపోయీ అయిపోవడంతో అమెరికానుంచి మరొక రకమైన వార్తలు మనకు అందడం ప్రారంభమైంది. వార్తాపత్రికలకు తాను రాసిన వ్యాసపరంపరలో సోవియట్ ప్రభుత్వంతో ఒక ఒప్పందాన్ని సిఫార్సు చేయడానికి వాన్‌డెర్‌లిప్ సర్వవిధాలా ప్రయత్నించడమే కాకుండా, తాను లెనిన్‌ని వాషింగ్టన్‌తో సరిపోల్చుతున్నానని ఒక వార్తాపత్రికలో అతడు రాశాడు కూడా. మనతో ఒప్పందానికి అనుకూలంగా బూర్జువా దేశాల్లో మనకి ప్రచారకులున్నారనీ, సోవియట్ రాయబారిగానీ, ఎవరో కొందరు పత్రికా రచయితలుగానీ ఈ ప్రచారకులు కారనీ, వాన్‌డెర్‌లిప్‌లాంటి అతి నాశిరకం దోపిడీదార్ల ప్రతినిధులమండే మనకీ ప్రచారకులు దొరుకుతున్నారనీ ఇప్పుడు దీనివల్ల తేలుతూంది.

నేనిప్పుడు మీతో చెబుతూన్నదే బాధ్యతాయుతులైన కార్యకర్తల సమావేశంలో నేను చెప్పినప్పుడు, అమెరికాలో వాన్‌డెర్‌లిప్‌కున్న ఫ్యాక్టరీలలో ఒక ఫ్యాక్టరీలో పనిచేసి స్వదేశానికి తిరిగి వచ్చివేసిన ఒక కామ్రేడ్ దిగాలుపడిపోయి, వాన్‌డెర్‌లిప్ ఫ్యాక్టరీలలో తాను చూసిన దోపిడీ మరే చోటా తాను చూడలేదన్నాడు. ఇక ఇప్పుడు, సోవియట్ రష్యాలో వర్తక సంబంధాలు పెట్టుకోవడం కోసం ప్రచారకుడుగా ఇలాంటి పెట్టుబడిదారీ సొరచేప రూపంలో

వ్యక్తి మనకొకడు దొరికాడు, కాగా రాయితీల విషయమై ఏదో చూచాయిగా అనుకుంటూన్న ఈ ఒప్పందం తప్ప ఆంతకుమించి మరేమీ మనకు లభించకపోయినప్పటికీ కూడా, అందువల్ల మనకి లాభం చేకూరిందనే చెప్పవచ్చు. మనకందుతూన్న అనేక వర్తమానాలనుండి — అవి సహజంగా రహస్యపు వర్తమానాలే — సోవియట్ రష్యాపై వసంతకాలంలో మళ్ళీ యుద్ధం మొదలుపెట్టే ఉద్దేశ్యంతో పెట్టుబడిదారీ రాజ్యాలు కొన్ని సన్నాహక చర్యలు తీసుకుంటున్నాయని వరుసగా వర్తమానాలు అందుతున్నాయి, అన్ని దేశాల్లోనూ వున్న వైట్ గార్డ్‌లు తయారీలో వుంటున్నారని కూడా చెప్పవచ్చు. ఇందుచేత మన ప్రధాన ప్రయోజనమేమిటంటే, వ్యాపార సంబంధాలను పునరుద్ధరించుకోవడం, ఇందుకోసం పెట్టుబడిదార్లలో అధమపక్షం కొంత భాగాన్నయినా సరే మన వైపు తెచ్చుకోవడమూనూ.

బ్రిటన్‌లో బహుకాలంగా పోరాటం జరుగుతూంది. పెట్టుబడిదారీ దోపిడీలో అతి నికృష్టమైన పెట్టుబడిదారీ దోపిడీకి ప్రతినిధులైనవారిలో సహితం కొందరు రష్యాతో వ్యాపార సంబంధాలను పునరుద్ధరించుకోవాలనే విధానాన్ని సమర్థించేవారు మనకి దొరకడమే మనకొక లాభం. బ్రిటన్‌తో ఒప్పందంపై, వర్తకపు ఒప్పందంపై, ఇంతవరకూ సంతకాలు జరగలేదు. దీని గురించి క్రాసిన్ ఇప్పుడు లండన్‌లో చురుకుగా సంప్రతింపులు సాగిస్తున్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం తన ముసాయిదాను మనకు అందజేసింది, దానిపైన మన మారుముసాయిదాను మనం పంపించాం, ఇదంతా జరుగుతూన్నప్పటికీ, ఒప్పందం విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం కాలయాపన చేస్తూండడమూ, వ్యాపారపు ఒప్పందాలు కుదరకుండా వుండేందుకే గట్టిగా ఐక్యం కల్గించుకుంటూన్న అభివృద్ధి నిరోధక మిలిటరీ పార్టీదే ఇంతవరకూ పైచేయి అవడమూ మనం చూస్తూనే వున్నాం. మనతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుందుకు పాటుపడుతూన్న పార్టీలూ గ్రూపులూ మరింతగా బలపడేందుకు అవకాశమిచ్చే ఊత అంతా ఇవ్వడమే మన తక్షణ ప్రయోజనానికి అనుగుణ్యంగా వుంటుంది, అదే మన తక్షణ విధ్యుక్తం కూడా. ఇందుకు మనకు సహాయకారిగా వుండే వ్యక్తి వాన్‌డెర్‌లిప్, కాగా ఇది కేవలం యాదృచ్ఛికమూ కాదు, వాన్‌డెర్‌లిప్ ప్రత్యేకంగా చొరవగలవాడనీ, లేదా సైబీరియా ఆతడికి బాగా తెలుసుననీ చెప్పి, ఈ విధంగా దీనికొక వివరణ ఇచ్చేందుకూ వీల్లేదు. ఇక్కడున్నవి బాగా లోలోతులకు వెళ్తూన్న కారణాలు, నమ్మశక్యంకానంత సంఖ్యలో వలస అధీనాలను కలిగివున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదంయొక్క ప్రయోజనాల అభివృద్ధితో పెనవేసుకుపోయిన కారణాలు. అమెరికన్, బ్రిటిష్ సామ్రాజ్యవాదాల మధ్య వున్న విరోధం ఇక్కడ లోలోతుకు పోతూంది, దీనిని ఆధారంగా చేసుకోవడం మనకు నిర్నిబంధమైన విధి.

సైబీరియా విషయంలో వాన్‌డెర్‌లిప్ ప్రత్యేకంగా అభిజ్ఞుడని పైన చెప్పాను. మనతో అతని సంభాషణలు పూర్తి కానున్న సమయంలో వాన్‌డెర్‌లిప్‌కు నేను దర్శనమివ్వడం బాగుం

టుందనీ, పశ్చిమ యూరప్‌లో ఇటుపైన అతడి కార్యకలాపంపై ఇది క్షేమంగా పనిచేస్తుందనీ క్రామేడ్ చిచేరిన్ సూచించాడు. ఇటువంటి పెట్టుబడిదారీ పౌరచేవతో భేటీ సహజంగానే ప్రీతికరమైన విషయమేమీ కాకపోయినప్పటికీ, దివంగతుడైన మిర్‌బాఖ్‌తో ఎంతో మర్యాదగానే భేటీ సాగించడం నా విధిగా పాటించినప్పుడు, వాన్‌డెర్‌లిప్‌తో సంభాషించడమంటే సహజంగానే నాకేమీ భయంవేయలేదు. ఆసక్తిజనకమైన సంగతి ఒకటి జరిగింది: మా ఇద్దరి మధ్యనూ కొంత మర్యాదా సంభాషణ సాగిన తరువాత, వాన్‌డెర్‌లిప్ హాస్యాలలోకి దిగి, అమెరికన్లు అసాధారణంగా ఆచరణాత్మకులైన ప్రజలనీ, ఎవ్వరేమి చెప్పినాసరే తమ కళ్ళారా తాము చూస్తేనేగాని నమ్మరనీ చెప్పేసరికి, నేనూ సగం పరిహాస ధోరణిలో: “సోవియట్ రష్యాలో ఎంత బాగుందో మీరిప్పుడు చూశారు కదా, అమెరికాలో కూడా దీనిని ప్రవేశపెట్టండి,” అని జవాబు చెప్పాను. నా మాటకు బదులు చెబుతూ అతడు ఇంగ్లీషున మాట్లాడకుండా, “కావచ్చు” అని రష్యన్‌లో మాట్లాడాడు. “మీకు రష్యన్ కూడా తెలుసునా ఏమిటి?” అని నేను అడిగే సరికి, అందుకు జవాబు చెబుతూ, “ఎన్నో ఏళ్ల కిందట సైబీరియాలో ఐదువేల వెర్‌స్తులు ప్రయాణం చేశాను. సైబీరియా అంటే నాకు అపరిమితమైన ఆసక్తి కల్గింది” అన్నాడు. వాన్‌డెర్‌లిప్‌తో హాస్యాలాడుతూ నడచిన ఈ మర్యాదా ప్రసంగం అంతమై ఇక అతడు వెళ్లిపోయేటప్పుడు ఇలా అన్నాడు: “అవును, మిస్టర్ లెనిన్‌కి కొమ్ములు లేవన్న మాట నిజమే, ఈ మాట అమెరికాలో నా స్నేహితులతో చెప్పాలి నేను.” సోవియట్ రాజ్యాధికారశక్తి ఒక బ్రహ్మరాక్షసి అనీ, దానితో ఎట్టి సంబంధాలూ పెట్టుకోగూడదనీ యూరప్ దేశాల పత్రికల్లో కథనాలు ఇంకా పడుతూండడంవల్లనే గాని, లేకుంటే ఇదొక హాస్యంగానే వేళాకోళంగానే వుండిపోయేది. ఈ చిత్తడి నేలలోకి మనతో వర్తకసంబంధాల పునరుద్ధరణను సమర్థించుతూన్న వాన్‌డెర్‌లిప్ అనే వ్యక్తి రూపంలో ఒక రాయి విసరేందుకు మనకొక అవకాశం దొరికింది.

ఇప్పుడు జపాన్‌నుండి వస్తూన్న వార్తలలో జపాన్ దేశపు వాణిజ్య వర్గాలలో ఇది వరకెన్నడూ కనివినియెరుగనంతటి ఉద్రేకం రేగినట్టు పేర్కొనని వార్త ఒక్కటైనా సరే వుందా? తన ప్రయోజనాలలో రవంతైనా సరే వదలుకునేది లేదనీ, సోవియట్ ప్రభుత్వం రాయితీలు మంజూరుకు తాను వ్యతిరేకమనీ జపాన్ ప్రజాభిప్రాయం అంటూంది. ఒక్క మాటలో చెప్పాలంటే, జపాన్ అమెరికాల మధ్య వున్న శత్రుత్వం తారస్థాయి చేరుకుంటూంది, ఈ విధంగా మనమీద జపాన్ అమెరికాల వొత్తిడి నిస్సందేహంగా బలహీనపడింది.

బాధ్యతాయుతులైన కార్యకర్తల సమావేశంలో నేనీ విషయం ప్రస్తావించగా, తదుపరి జరిగిన చర్చలో ఈ రకం ప్రశ్న ఒకటి వేయడం సంభవించింది: “చూడబోతే జపాన్ అమెరికాలను ఒకరిమీద ఒకరిని యుద్ధానికి మనం ఉసికొల్పుతూన్నట్టుగా కనబడుతూంది, అయితే

యుద్ధంచేసేది కార్మికులూ కర్షకులూనూ, కాగా ఈ రెండు రాజ్యాలూ సామ్రాజ్యవాద రాజ్యాలే అయినప్పటికీ కార్మికులు తమ రక్తాన్ని చిందించేందుకే దారితీసేటట్టే యుద్ధాన్ని ఈ రెండు రాజ్యాల మధ్యనూ పురికొల్పడం సోషలిస్టులమైన మనకి తగిన పనేనా?" అని ఒక కామ్రేడ్ చీటి రాసి పంపించాడు. దీనికి జవాబు చెబుతూ, కార్మికులనూ కర్షకులనూ ఒకరిమీద ఒకరిని యుద్ధంచేయమని మనం నిజంగా పురికొల్పిన పక్షంలో, అప్పుడు మనం నేరస్థులమే అవుతాం. కాని మన రాజకీయాలూ ప్రచారమూ వీటి యావత్తు లక్ష్యమూ యుద్ధాన్ని అంతంచేయడమే తప్ప రాజ్యాలను యుద్ధంలోకి దించడం కానేకాదు. శాశ్వత యుద్ధాల నుండి బయటపడేందుకు సోషలిస్టు విప్లవం ఒక్కటే తప్ప వేరొక మార్గం లేదని చాలి నంతగా అనుభవం రుజువుచేసింది. కాబట్టే మన విధానం యుద్ధాన్ని పురికొల్పే విధానం కానే కాదు. జపాన్ అమెరికాల మధ్య యుద్ధాన్ని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సమర్థించే పనిని దేనినీ మనం చేయలేదు. బ్రిటిష్, జర్మన్ గ్రూపుల మధ్య 1914 లో జరిగిన యుద్ధం ఏ విధంగానైతే సామ్రాజ్యవాద యుద్ధమే అయిందో, అలాగే అమెరికా జపాన్‌ల మధ్య యుద్ధం కూడా సామ్రాజ్యవాద యుద్ధమే అవుతుందనే సత్యాన్ని తమ మాతృభూమి రక్షణ గురించి గాక, పెట్టుబడిదార్ల శక్తిని కూలదోయడం గురించే, కార్మికుల విప్లవాన్ని గురించే ఆలోచించాలనే సత్యాన్ని గూర్చిన వివరణలతోనే మన ప్రచారమంతా మన వార్తాపత్రికా వ్యాసాలన్నీ నిండివున్నాయి. కాని ఈ విప్లవాన్ని త్వరితపరచేందుకు యావచ్ఛక్తినీ వినియోగించుతూన్న మనం, సామ్రాజ్యవాద బందిపోటుదొంగల దాడికి గురైనట్టి ఒక బలహీనమైన సోషలిస్టు రిపబ్లిక్ స్థితిలోనే వుండినట్టయితే, మనకు వ్యతిరేకంగా వారు ఏకమవడం మరింత కష్టసాధ్యం చేసేందుకని వారిలో వారికున్న విరోధాన్ని మనం ఉపయోగించుకోవడం మనకు సరైన విధానమేనా? నిస్సందేహంగా అది సరైన విధానమే. ఈ విధానాన్నే మనం గత నాల్గేళ్లుగా పాటిస్తున్నాం. కాగా ఈ విధానాన్ని ప్రధానంగా వ్యక్తీకరించుతూన్న వాస్తవవిషయం బ్రెస్ట్ సంధి. జర్మన్ సామ్రాజ్యవాదం తన ప్రతిఘటన సాగించినంత కాలమూ, అప్పటికింకా ఎర్రసైన్యం ఏర్పడకపోయినప్పటికీ కూడా, సామ్రాజ్యవాదుల మధ్య వున్న వైరుధ్యాలను ఉపయోగించుకుంటూనే నిలదొక్కుకని వుండగల్గాం మనం.

ఈ పరిస్థితులలో రూపొందింది కమ్‌చాత్కా విషయంలో మన రాయితీ విధానం. ఈ రకం రాయితీ కేవలమూ అసాధారణమైనదే. ఇతర రాయితీ పద్దులు ఎలా రూపొందుతున్నాయో తరువాత ప్రస్తావిస్తాను. ఈ ప్రశ్నకున్న రాజకీయ స్వరూపానికి మాత్రమే ప్రస్తుతానికి నేను పరిమితమవుతాను. రాయితీలను ఇవ్వజూపడమూ, లేదా వాటిని ఒక ఎరగా చూపడమూ మనకు ఏ విధంగా లాభకరమో విశదపరచే స్పష్టీకరణకు మూలకందం జపాన్ అమెరికాల పరస్పర సంబంధాల్లోనే వుందనే విషయం మీకు చెప్పదల్చుకున్నాను. రాయితీలు

ఖర్చేముందూ వాటిని పుచ్చుకునేముందూ ఏదో ఒక విధమైన శాంతిపూర్వకపు ఒప్పందాల పునరుద్ధరణ, వర్తకపు ఒప్పందాల పునస్థాపన అంటూ వుండడం ముందుగానే అవసరం; మనకవసరమైన యంత్రాలను సరోవరి కొనుక్కొనేందుకు విస్తృతావకాశాలు మనకు అందుబాటులో వుండడం ముందుగానే అవసరం. కాగా ఇది సార్థకమయేందుకు మన యావచ్ఛక్తినీ వినియోగించాల్సి వుంటుంది. ఇదింకా సార్థకంకాలేదు.

బ్రిటన్‌తో వర్తక సంబంధాల పునరుద్ధరణ గురించి ప్రశ్నవేసిన కామ్రేడ్, ఆ దేశంతో ఒప్పందంపై సంతకం జరగడానికి ఎందుకు ఆలస్యమవుతూందని అడుగుతున్నాడు. ఈ ఆలస్యానికి బ్రిటిష్ ప్రభుత్వం తటపటాయింపే కారణమని జబాబు చెబుతున్నాను. బ్రిటిష్ వాణిజ్య, పారిశ్రామిక బూర్జువావర్గంలో అధికసంఖ్యాకవర్గం సంబంధాల పునస్థాపనకు సుముఖంగానే వుంది, యుద్ధాన్ని బలపరచే చర్యలను తీసుకోవడమంటే అసాధారణ ప్రమాదాలకు సిద్ధంకావడమే అవుతుందనీ, విప్లవాన్ని త్వరిత పరచడమే అవుతుందనీ దానికి తెలుసు కూడా. వార్సావైపు మనం పురోగమించుతూండగా, పెట్రోగ్రాడ్‌ను సమీపించమని తమ నౌకాదళానికి ఆజ్ఞలు జారీచేస్తామని బ్రిటిష్ ప్రభుత్వం మనని బెదరించడమూ, ఇక అందుపైన బ్రిటన్ అంతటా "కార్యాచరణ సమితులు"[28] ఏర్పడడమూ, అక్కడున్న మెన్‌షెవిక్ నాయకులు తాము యుద్ధానికి వ్యతిరేకమనీ, ఈ యుద్ధానికి తాము సమ్మతించేది లేదనీ ప్రకటించడమూ మీకు జ్ఞాపకమే వుంటుంది. అటు బ్రిటిష్ బూర్జువావర్గంలో అభివృద్ధి నిరోధక భాగమూ, ఆస్థానపు మిలిటరీ ముఠా యుద్ధాన్ని కొనసాగించేందుకే సుముఖంగా వున్నాయి. వీటి ప్రభావమే వర్తకపు ఒప్పందంపై సంతకం చేయడంలో జరుగుతూన్న జాప్యానికి కారణమనడంలో ఎట్టి సంశయమూ లేదు. బ్రిటన్‌తో ఈ వర్తకపు సంబంధాల వివరాలన్నిటిని గురించీ, బ్రిటన్‌తో వర్తక సంబంధాలపై ఈ ఒప్పందంలో వున్న వివరాలన్నిటిని గురించీ ఇప్పుడు ప్రస్తావించను, ఎందుకంటే వాటిని గురించి ప్రస్తావించాలంటే ఇంకా ఎంతో దూరం వెళ్ళాల్సి వుంటుంది. ఈ సున్నిత సమస్యను పార్టీ సెంట్రల్ కమిటీ ఇటీవల ఆమూలమూ చర్చించింది. దీనిని అన్నీ ఇన్నీ కాదు అనేక పర్యాయములు పునరాలోచించాము, కాగా ఈ విషయమై మన విధానం ఎంత గరిష్ఠ పరిమితిలో ఉసులుబాటుతనాన్ని కల్గి వుండాలో అంత ఉసులుబాటుతనాన్ని కల్గివుందనే స్పష్టంగా నిరూపితమైంది. వర్తకపు సరుకుల మార్పిడిని మరింత అధికంగానూ నియమితాను సారంగానూ ఆరంభించేందుకూ, ప్రజా ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకై మనం వేసుకున్న విస్తృత ప్రణాళిక నిమిత్తం ఆవశ్యకమయే యంత్రాలను వీలైనంత శీఘ్రంగా కొనుగోలుచేసే అవకాశం కల్గించేందుకూ బ్రిటన్‌తో వర్తకపు ఒప్పందం కుదుర్చుకోవడమే ఇప్పుడు మన లక్ష్యం. దీనిని మనం ఎంత శీఘ్రంగా సాధించగల్గితే, పెట్టుబడిదారీ దేశాల గుప్పిటనుండి బయటపడిన మన ఆర్థిక స్వాతంత్ర్యపు ప్రాతి

పదిక అంత విశాలంగా వుంటుంది. రష్యాపై సాయుధ దండయాత్ర సాగించి చేతులు కాల్చుకున్న తరువాత మళ్ళీ వెంటనే యుద్ధం ప్రారంభించేందుకు ప్రత్యేకంగా ప్రస్తుతం వీరు తలపెట్టలేరు; గరిష్ఠపరిమితిలో సౌకర్యాలను చూపించడమనే మూల్యాన్ని చెల్లించి అయినా సరే వర్తక సంబంధాలను సాధించుకుందుకు మనం ఈ అవకాశం వినియోగించుకోవాలి, ఎందుచేతంటే సామ్రాజ్యవాద రాజ్యాలతో మనకి శాశ్వతమైన వర్తక సంబంధాలు ఏర్పడతాయని ఒక్క క్షణమాత్రమైనా నమ్మేందుకు వీల్లేదు; ఇదొక తాత్కాలికమైన విరామసమయమే అవుతుంది. యుద్ధాలూ, యుద్ధపరంపరా అనివార్యములని చరిత్రలో జరిగిన విప్లవాల, గొప్ప సంఘర్షణల అనుభవం మనకొక గుణపాఠం నేర్పుతూంది. పెట్టుబడిదారీ దేశాల సరసన సోవియట్ రిపబ్లిక్ — పెట్టుబడిదారీ దేశాలచే చుట్టివేయబడిన సోవియట్ రిపబ్లిక్ — ఉనికి అనే ప్రశ్న -- ఇది పెట్టుబడిదారీ విధానానికి ఎంతగా గిట్టని విషయమంటే, మళ్ళీ యుద్ధం ప్రారంభించడానికి పెట్టుబడిదార్లు ఏ అవకాశాన్నయినా సరే లంకించుకుంటారు. ఈనాడు ప్రజలు సామ్రాజ్యవాద యుద్ధంతో విసిగిపోయున్నారు, యుద్ధం ఇంకా కొనసాగే పక్షంలో తమ ఆగ్రహం ఇంకా జోరవుతుందని వారు బెదిరిస్తున్నారు, కాని కొద్ది సంవత్సరాల తరువాతనే పెట్టుబడిదార్లు యుద్ధాన్ని పునరారంభించగల్గే అవకాశం లేకపోలేదు. కనుకనే ఇప్పుడొక అవకాశం దొరికింది కాబట్టి, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వర్తకపు ఒప్పందాలు కుదుర్చుకుందుకు యావచ్ఛక్తినీ మనం వినియోగించి తీరాలి.

జూలై నెలలో పోలెండ్ సంపూర్ణంగా పరాజయం పొందే ప్రమాదం ఎప్పుడైతే ఏర్పడిందో, ఎర్ర సైన్యం పోలెండ్‌ని తుక్కుకింద ఓడించేసే ప్రమాదం ఎప్పుడైతే ఏర్పడిందో అప్పుడు బ్రిటన్ ఒక ఒప్పందపు పూర్తి వాచకాన్ని ప్రతిపాదించింది; దానిలో ఇలా వుంది: ప్రాచ్యంలో బ్రిటిష్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా అధికారయుతమైన ఎట్టి ప్రచారాన్ని గానీ, ఏ చర్యను గానీ మేము సాగించమని మీరు సూత్రప్రాయంగా ప్రకటించాలి. దీని విపులీకరణ మీదటికి సమావేశమయ్యే ఒక రాజకీయ కాన్ఫరెన్స్‌లో జరుగుతుంది, కాని ఇప్పుడు మాత్రం మేము ఇలాంటి వర్తకపు ఒప్పందం కుదుర్చుకుంటాం. దీనిపై సంతకం చేయడం మీ కిష్టమేనా? మా కిష్టమే, అని మనం జవాబు చెప్పాం. ఇప్పుడు కూడా చెబుతున్నాం, ఈ ఒప్పందంపై సంతకం చేస్తామని. ప్రాచ్యంలో బ్రిటన్‌కి వున్న ప్రయోజనాలేమిటో రాజకీయ కాన్ఫరెన్స్ కచ్చితంగా నిర్వచించుతుంది. ప్రాచ్యంలో మనకీ వున్నాయి కొన్ని ప్రయోజనాలు, వాటిని వివరించాల్సిన అవసరం ఎప్పుడైతే పడుతుందో అప్పుడు వాటిని మనమూ వివరించుతాం. తానే స్వయంగా చేసిన తన జూలై ప్రతిపాదనను ఇప్పుడు వదలుకుంటున్నానని బ్రిటన్ మాటిగా చెప్పలేకుండా వుంది. అందుచేత బ్రిటన్ ఇలా జరుపులు పెట్టుకొంటూ, సంప్రతింపుల విష

యమై అసలు సత్యాన్ని తన ప్రజలనుండే కప్పిపుచ్చుతూంది. సంప్రతింపులు అనిశ్చిత పరిస్థితుల్లో పడ్డాయి, ఒప్పందంపై సంతకం జరుగుతుందని మనం హామీ ఇవ్వలేకుండా వున్నాం. బ్రిటన్‌లో ఆస్థానానికీ మిలిటరీ ముఠాకీ వున్న శక్తివంతమైన ప్రభావం ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా పనిచేస్తూంది. కాని మనమిప్పుడు గరిష్ఠపరిమితి సౌకర్యాలు కల్గించేందుకు ఒప్పుకుంటున్నాం, వర్తకపు ఒప్పందాన్ని కుదుర్చుకోవడమూ, మన రవాణా వ్యవస్థను పునరుద్ధరించేందుకు మౌలికావసరములైన రైల్వేఇంజన్లూ, పరిశ్రమను పునరుద్ధరించేందుకూ విద్యుదీకరణకూ మౌలికావసరాలూ, వీటిలో కొన్నింటిని వీలైనంత శీఘ్రంగా కొనుగోలు చేయడమూ మన ప్రయోజనాలకు అనుగుణ్యంగా వుంటుందని మనం నమ్ముతున్నాం. ఇదే మనకన్నిటికంటేనూ ముఖ్యం. ఇది గనుక మనకు లభించిన పక్షమందు కొద్ది సంవత్సరాల్లోనే మనం ఎంతగా దృఢపడతామంటే, ఇక ప్రమాదం మరీ ముంచుకొచ్చి కొన్ని సంవత్సరాల తరువాత సైనిక వ్యవధానమే గనుక సంభవించినప్పటికీ కూడా, ఇప్పటికంటె మనం బలపడి వుండడం చేత అది భంగపాటు చెందే తీరుతుంది. బ్రిటన్‌కు గరిష్ఠపరిమితిలో సౌకర్యాలను కల్గించే విధానాన్ని మనం సెంట్రల్ కమిటీలో అనుసరిస్తున్నాం. కాగా మనం చేసిన వాగ్దానాలలో ఏదో ఒకదానికి భంగం కలిగిందంటూ ఈ పెద్దమనుషులు మనపై నేరం మోపాలని ఆలోచించే పక్షంలో, మన ప్రభుత్వం ఏలాంటి అధికారయుత ప్రచారాన్నీ సాగించదనీ, ప్రాచ్యంలో బ్రిటన్‌కున్న ప్రయోజనాలలో దేనికైనా కూడా హాని కల్గించడం మా ఉద్దేశం కాదనీ మనం ప్రకటించుతాం. దీనితోనే తమ పబ్బం గడుపుకుందామని వారు ప్రయత్నిస్తూంటే, అలాగే ప్రయుత్నించమనండి. దీనితో మనకి పోయేదేమీ లేదు.

బ్రిటన్‌కీ ఫ్రాన్సుకీ వున్న సంబంధాలను గురించి ఇప్పుడు ప్రస్తావిస్తాను. ఈ సంబంధాలు చిక్కులుపడి వున్నాయి. ఇటు బ్రిటనూ ఫ్రాన్సూ నానా జాతి సమితిలో వున్నాయి, రెండూ కలిసి పనిచేయక తప్పదాయె; అటు, పరిస్థితి తీవ్రమైనప్పుడల్లా రెండూ విడిపోతాయి. కామ్రేడ్ కామెనెవ్ లండన్‌వెళ్లి క్రాసిన్‌తో కలిసి సంప్రతింపులు జరిపినప్పుడు ఈ విషయం ప్రత్యక్షంగా కనబడిపోయింది. పోలెండ్‌కూ వ్రాంగెల్‌కూ వత్తాసు ఇవ్వడానికి ఫ్రాన్సు సిద్ధంగా వుండెను. కాని "ఫ్రాన్సుతో మేం కలిసిరాం" అనేసింది బ్రిటన్. ఫ్రాన్స్‌కంటె బ్రిటనే రాయితీల పట్ల సుముఖంగా వుంది. అప్పుల బాకీలు ముడుతాయనే ఫ్రాన్సు ఇంకా కలలు కంటూండగా, బ్రిటన్‌లో ఆ మాత్రపు ఈ మాత్రపు వ్యవహారజ్ఞానం వున్న పెట్టుబడిదార్లు వాటిగురించి ఆలోచించడమే మానుకున్నారు. ఈ దృక్స్థానంమండి కూడా, బ్రిటస్ ఫ్రాన్సుల మధ్య వున్న వైమనస్యాన్ని ఉపయోగించుకోవడమే మనకు లాభదాయకం, కమకనే బ్రిటన్‌కి రాయితీలను మంజూరు చెయ్యాలనే రాజకీయ ప్రతిపాదనను మనం ఎంతమాత్రమూ వదలుకోకూడదు. సుదూర ఉత్తరాన కలప రాయితీలు గురించి ఒప్పందపు ముసా

యిదా ఒకటి ఇప్పుడు మన ముందుంది. ఇప్పుడు మనం ఎటువంటి స్థితిలో వున్నామంటే, మనకు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్సులు సైనిక మిత్రత్వాన్ని నెరవుకోవడం కష్టతరమయేందుకు, బ్రిటన్ ఫ్రాన్సుల మధ్య వున్న రాజకీయ అనైక్యతను అవకాశంగా తీసుకోవడమును, ఇలా తీసుకోవడంలో కొంత ప్రమాదం వున్నాసరే, తిరస్కరించకపోవడమే మన విధాయకమవుతుంది. బ్రిటన్, ఫ్రాన్సుల వత్తాసుతో కొత్త యుద్ధం ఒకటి మనమీద వచ్చిపడినట్టయితే (వ్రాంగెల్‌తో యుద్ధం ఎలాగైతే మన పూర్తి విజయంతో అంతమైందో, అలాగే ఇది కూడా అంతమయే పరిస్థితుల్లో సహితమూ), అది మనకొక బ్రహ్మాండమైన భారమే అవుతుంది, మన ఆర్థికాభివృద్ధికి కష్టాలు తెచ్చిపెడుతుంది, కార్మికుల స్థితినీ రైతుల స్థితినీ దిగజార్చేస్తుంది. కనుకనే ఏ మార్గాన వెళితే మనకి తక్కువ నష్టాలు కల్గుతాయో ఆ మార్గమే మనం అనుసరించాలి. మన ఆర్థిక నిర్మాణ కార్యంలో జాప్యం కల్గడం వల్లనూ, ఒకవేళ సామ్రాజ్యవాదుల మిత్రత్వాన్ని మనం ప్రతిఘటింపజాలని ఫలితంగా వేలాది కార్మిక కర్షకుల మృతి వల్లనూ కల్గే నష్టాలతో సరిపోల్చిచూస్తే, రాయితీలవల్ల కల్గే నష్టాలు అసలు వుండవు — ఈ విషయం స్పష్టంగా కనబడుతూనే వుంది. వీరి మిత్రత్వాన్ని ప్రతిఘటించి నిలబడేందుకు రాయితీలపై బ్రిటన్‌తో సంప్రతింపులు సాగించడం ఒక సాధనం. ఇదీ ఈ సమస్యను రాజకీయ పార్శ్వంనుండి చూచినప్పుడు అవుపడే దృశ్యం.

చిట్టచివరకు జర్మనీ పట్ల, బ్రిటన్, మొత్తంగా అంటాంట్‌ల వైఖరిని పరిశీలించుదాం. అమెరికాను మినహాయించితే, అన్ని దేశాల్లోనూ అధికంగా పురోగమించిన దేశం జర్మనీయే. విద్యుచ్ఛక్తి అభివృద్ధి విషయంలో జర్మనీ సాంకేతిక స్థాయి ఇంకా ఉన్నతం. ఇటువంటి దేశం వెర్సెయిల్స్ సంధి వల్ల ఎటువంటి పరిస్థితుల్లో ఇరుక్కుపోయిందంటే, దాని అస్తిత్వమే అసలు అసాధ్యమై పోతూంది. ఇటువంటి స్థితిలో జర్మనీ సహజంగానే రష్యాతో మిత్రత్వపు దిశగా నెట్టబడుతూంది. రష్యన్ సైనికబలాలు వార్సా పట్నం సమీపించుతూండినప్పుడు జర్మనీ యావత్తూ అట్టుడికినట్టు ఉడికిపోయింది. పీక పిసుక్కుపోతూన్న ఆ దేశానికీ, బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తులను కదలించగల్గే అవకాశాలున్న ఆ దేశానికీ రష్యాకీ మిత్రత్వం అనే భావం ఆ దేశాన్ని ఎంతగా కుదిపివేసిందంటే, జర్మనీలో రాజకీయంగా ఒక తక్కిడి బిక్కిడి తారుమారు తయారయింది: రష్యన్ బోల్‌షెవిక్‌ల పట్ల తమ సానుభూతిని చూపడానికని జర్మన్ వల్లదండు ముఠాలు స్పార్టాకిస్టులతో కలిశారన్నమాట. దీనిని పూర్తిగా అర్థం చేసుకోవచ్చు కూడా, ఎందుచేతంటే, ఇది ఆర్థిక కారణాలనుండే ఉత్పన్నమవుతూంది, యావత్తు ఆర్థిక పరిస్థితికీ, మన వైదేశిక విధానానికీ ఇదే పునాదిగా ఏర్పడుతూంది.

మనం ఏకాకులుగానూ, పెట్టుబడిదారీ ప్రపంచం బలోపేతంగానూ వున్నంత కాలమూ మన వైదేశిక విధానం ఇటు వైమనస్యాలను ఉపయోగించుకోవడంలో వుంటుంది

(సామ్రాజ్యవాద రాజ్యాలన్నిటినీ ఓడించి వేయడంకంటె సంతోషకరమైన కార్యం మరొకటుండదు సహజంగానే, కాని ఇది సాధ్యమయేందుకు మనకింకా చాలా కాలమే పడుతుంది). ఇటు సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పరస్పరమూ వుండే మౌలిక విభేదాలపైనా, అటు అంటాంట్ విజయమూ, వెర్సైల్స్ సంధీ జర్మన్ జాతిలోని అత్యధికసంఖ్యాకవర్గపు జీవితాన్నే దుస్సాధ్యం చేసివేస్తూన్న పరిస్థితిలోకి అమాంతమూ తోసివేసి వుండడంపైనా మన అస్తిత్వం ఆధారపడి వుంది. ఊపిరి తీసుకుందుకు క్షణమాత్రపు వ్యవధి కల్గుతుందనీ, తనను ఎవ్వరూ దోచుకొనడం లేదనీ, తన జీవితాన్ని గడపుకుందుకు ఆదరవును తన దగ్గరనుంచి ఎవ్వరూ అపహరించడం లేదనీ, తన ప్రజలు ఆకలితో మాడి దుంపనాశనమైపోరనీ కలలోనైనా ఊహించుకోలేని స్థితిని జర్మనీకి సృష్టించింది వెర్సైల్స్ సంధి, కాగా ఇటువంటి పరిస్థితుల్లో తన ప్రాణాలను రక్షించుకుందుకు ఏకైక సాధనం రష్యాతో మిత్రత్వమే కాబట్టి ఆ దేశం వైపు జర్మనీ తన దృష్టిని మరల్చుతూంది. సోవియట్ రష్యాను పిచ్చి పగతో ఆడిపోస్తున్నారు, బోల్షెవిక్‌లంటే వారికి గుడ్డి ద్వేషం, పురంపెట్టిన వైట్ గార్డ్ సైనికులు కమ్యూనిస్టులను కాల్చిపారేసినట్టు వారి దేశంలో వున్న కమ్యూనిస్టులను వారు కాల్చిపారేస్తున్నారు. బోల్షెవిక్‌ల పట్ల జర్మన్ బూర్జువా ప్రభుత్వం వైరిద్వేషం ప్రదర్శించుతూంది, కాని తనకు ఎంత ఇష్టం లేకపోయినప్పటికీ సోవియట్ రష్యాతో తాను శాంతి నెరపుకొనే దిశగానే అంతర్జాతీయ ప్రయోజనాలు దానిని లాక్కుపోతున్నాయి. బూర్జువావర్గం మోపిన భారాన్ని చైతన్యయుతంగా గుర్తెరిగిన ప్రజలందరికీ సోవియట్ రిపబ్లిక్‌తో మైత్రివినా విముక్తి మార్గం లేదని నిరూపించడం — ఇదీ, కామ్రేడ్స్, మన అంతర్జాతీయ విధానానికి, మన వైదేశిక విధానానికి రెండవ మూలరాయి. సామ్రాజ్యవాదుల ఎదురుదాడికి సోవియట్ రిపబ్లిక్ మూడేళ్ల పాటు తట్టుకుని నిలబడగల్గిందన్న వాస్తవవిషయం, సామ్రాజ్యవాదులు మోపిన ఈ భారాన్ని విజయవంతంగా కూలదోయగల్గిన దేశం ప్రపంచంలో కల్లా ఒక్కటే, కేవలం ఒక్కటే వుందని రుజావుచేస్తూంది. ఈ దేశం "దోపుడుదొంగలది", "బందిపోట్లది", "గజదొంగలది" బోల్షెవిక్‌లూ వగైరాలదీ అయితే కావచ్చు — పోనీ, అలాగే అనుకోనీయండి — అయితేనేమి, ఆ దేశం లేనిదే ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం సుతరామూ సాధ్యపడదు.

ఇటువంటి పరిస్థితిలో రాయితీల ప్రశ్నకు మరొక ప్రాధాన్యత కూడా కల్గుతూంది. రాయితీలపై జారీచేయబడిన 23 వ నవంబరు ఉత్తర్వును గురించిన పాంఫ్లెట్ నా ఎదుట వుంది. మహాసభ సభ్యులందరికీ ఇది అందజేయబడుతుంది. రాయితీలపై ఈ పాంఫ్లెట్‌ను సాధ్యమైనన్ని విదేశభాషలలోకి అనువదించి విదేశాలలో ప్రచురించాలని మనం ఉద్దేశిస్తున్నాం. సాధ్యమైనంత అధికసంఖ్య విదేశాలలోని, అందులోనూ ముఖ్యంగా ఏ యే దేశాలలోనైతే ప్రజా పీడన హెచ్చుగా వుంటూందో ఆదేశాల్లోని ప్రజలకు రాయితీలలో ఆసక్తిని రేకెత్తించేందుకు

మన చేతనైనదంతా చేయడమే మన ఉద్దేశ్యం. జపాన్ ప్రయోజనాలూ అమెరికా ప్రయోజనాలూ పరస్పరం బ్రహ్మాండంగా విభేదిస్తున్నాయి. చైనానూ, ఇంకా కొన్ని ద్వీపాలనూ వీరు పంచుకోవడంలో వారికి పంతులు కుదర్కడంలేదు. జర్మనీకీ ఆంటాంట్‌కీ వున్న పరస్పర విభేదాలు వేరొక తరహాకు చెందినవి. జర్మనీపై ఆంటాంట్ విధించిన షరతుల కాఠిన్యత కారణంగా జర్మనీ ఉనికే అసాధ్యమైపోతూంది. ఆ దేశంనుండి మోటార్లనూ పశువులనూ ఆంటాంట్ తరలించుకు పోతూండడంచేత ఆ దేశంలో ప్రజలు చచ్చిపోతున్నారు. ఇట్టి పరిస్థితి జర్మనీని సోవియట్ రష్యా దిశగా నెట్టుతూంది: జర్మనీ ఆంటాంట్‌ల మధ్య జరిగిన సంధి వివరాలు నాకు తెలియవు. ఏమైతేనేమి, జర్మనీ సోవియట్ రష్యాల మధ్య వర్తక సంబంధాలను ఆ సంధి నిషేధించుతూన్న సంగతి మాత్రం బహిరంగంగా తెలిసినదే. కాని జర్మనీలో నేడున్న జీవిత పరిస్థితులు నల్లదండు ముఠాలూ పెట్టుబడిదార్లతో సహా మొత్తంగా జర్మన్ ప్రజలందరినీ సోవియట్ రష్యాతో సంబంధాలకోసం అన్వేషింప జేస్తున్నాయి. దీన్నిబట్టి, రాయితీలను ఒక ఆర్థిక పద్ధతిగా — ఈ ప్రాజెక్టును మనం ఎంత మేరకు అమలులోకి తీసుకురాగల్గుతామా అనే విషయంతో నిమిత్తం లేకుండానే — ప్రతిపాదించడం మనకు తప్పని సరి అవుతూందన్న విషయం స్పష్టంగానే కనబడుతూంది. రాయితీల పట్ల ప్రదర్శితమవుతూన్న ఆసక్తి ఎంత విస్పష్టంగా వుందంటే, ఒకే ఒక రాయితీని సహితమూ మంజూరు చేయడంలో మనం విఫలులమైనప్పటికీ కూడా, ఒకే ఒక రాయితీ ఒప్పందానికైనా మనుగడ లేకపోయినప్పటికీ కూడా (ఇది సహితం పూర్తిగా సంభవమే), అచ్చంగా ఇదే జరిగినప్పటికిన్నీ మన విధానాన్నే మనం ఇంకా అనుసరిస్తూండాలి, ఎందుచేతంటే ఇలా అనుసరించడంవల్లనే పెట్టుబడిదారీ దేశాలకు మనపై దాడిచేయడం మరింత కష్టతరమవుతుంది.

ఇది ఎలా వున్నానరే, దీనితో ప్రసక్తి లేకుండానే, పట్టెడు దేశాలు ఇతర ప్రజల పీకలు పిసికేస్తున్నాయనీ — వెర్సైయిల్స్ సంధి ఫలితమే ఇది — ఈ ప్రజలు సహాయం కోసమని బహిరంగంగానో రహస్యంగానో, చైతన్యయుతంగానో చైతన్యరహితంగానో మనవైపు తిరుగుతున్నారనీ, అంతర్జాతీయ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోవియట్ రష్యాతో మిత్రత్వం ఆర్థికంగా ఆవశ్యకమనే భావనకు వీరు అలవాటుపడుతున్నారనీ మనం పీడిత ప్రజలకు మొత్తంగా నిరూపించాల్సి వుంది. ఇందుచేత ఆహార వస్తువుల రాయితీలకు పాతకాలపు బూర్జువా రాయితీ పరిధులకు మించిన అవకాశాలున్నాయి. వీటికీ పాతకాలపు పెట్టుబడిదారీ రాయితీలకూ ఇక పోలికే వుండదు. ఇవి పెట్టుబడిదారీ రాయితీలుగానే వుంటాయి, ఎందుచేతంటే పెట్టుబడిదార్లతో మనం, ఫలానా ఫలానా సంఖ్యలో మాకు ట్రాక్టర్లను ఇవ్వండి, ఫలానా ఫలానా వైశాల్యంగల భేష్షైన అక్షత భూమి ఆహారధాన్యాలూ మీకిస్తాం, అని మనం జర్మన్ పెట్టుబడిదార్లతో అంటున్నాం. బ్రహ్మాండమైన లాభాలు దొరుకుతాయనే ఆశచూపించుతూ

పెట్టుబడిని మనం ఆకర్షిస్తున్నామన్నమాట. ఈ సందర్భంలో రాయితీల మంజూరు స్వచ్ఛమైన పెట్టుబడిదారీ వ్యవహారంగానే వుంటుంది, కాని ఒక జాతిగా చూచినప్పుడు జర్మనీ గానీ, ఆస్ట్రియా, ఇంకా ఇతర దేశాలు గాని అసలు మనుగడే సాగించలేకుండా వున్నాయి, ఇందుకు కారణం వాటికి ఆహార వస్తువుల రూపంలో సహాయం అవసరంగా వుంది, పెట్టుబడి దారుడు నూరు శాతమో, రెండువందల శాతమో లాభం సంపాదిస్తున్నాడన్న మాటతో నిమిత్తంలేకుండానే, మొత్తంగా ప్రజలు, వారికి బోల్షెవిక్ వ్యతిరేక దురభిమానాలు వున్నప్పటికీ కూడా, పీడిత ప్రజలందరూ సామ్రాజ్యవాదులు తమపై మోపిన గాటినుండి విముక్తి సాధించుకుందుకు అవకాశం కల్గించేటట్టి పూర్తిగా వేరే విధమైన అంతర్జాతీయ సంబంధాలను బోల్షెవిక్‌లు స్థాపించుతున్నారని చూడగల్గుతారు. గత మూడేళ్లలోనూ మనం సాధించిన విజయాలకు మించిన ఘనవిజయాలనే మన అంతర్జాతీయ విధానం వచ్చే ఏడు మనకు తీసుకురానున్నది. మనం అనుసరించుతూన్న విధానమే సామ్రాజ్యవాదంచే పీక నులిమి వేయబడుతూన్న పెట్టుబడిదారీ దేశాలను సోవియట్ యూనియన్ చుట్టూ చేరదీస్తుంది. ఇందుచేత మన రాయితీల ప్రతిపాదనకు పెట్టుబడిదారీ విధాన ప్రాముఖ్యతకు మించిన ప్రాముఖ్యత వుంది, ఇందుచేతనే అది జర్మన్ పెట్టుబడిదార్లతో: "మీదగ్గరున్న వందలాది ట్రాక్టర్లను తీసుకురండి, రూబులుకు మూడువందల శాతం లాభం కూడా ఆర్జించుకోండి," అంటూ వారి వైపు చాపిన చేయే కాకుండా, పీడిత ప్రజల వైపు చాపిన చేయే అవుతుంది, రానున్న శ్రామిక విప్లవంలో ఒక అంశమైన పీడిత ప్రజారాసుల మిత్రత్వమే అవుతుంది. రష్యా పెద్ద దేశం అవడంచేతనూ, స్వయంపోషక సాధనాలు కల్గివుండడంచేతనూ, ప్రమాదాలను లెక్కచేయకుండా సోషలిస్టు విప్లవంలోకి దిగగల్గుతూండగా, యూరప్‌లోని పారిశ్రామిక దేశాలమైన మేము మాకు మిత్రులు లేకపోవడంచేత అలా దిగలేకపోతున్నాం, అంటూ పురోగామి దేశాలలో వెల్లడి అవుతూన్న అనుమానాలూ భయాలూ కేవలమూ నిరాధారాలే కాగా, మనం ఏ మంటామంటే: "మీకొక మిత్రముంది — అది సోవియట్ రష్యా." కాగా మనం రాయితీలను మంజూరు చేస్తున్నాం కాబట్టి, ఇది ప్రపంచ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైన మిత్రత్వాన్ని బలపరుస్తుంది. ఈ మూలసూత్రాన్ని మనం దృష్టిలో పెట్టుకోవడం మరచిపోకూడదు, ఇది మన రాయితీల విధానాన్ని సమర్థించుతుంది, రాయితీలను కుదుర్చుకోవడం అవసరమని నిరూపించుతూంది.

ఇకిప్పుడు కేవలమూ స్వచ్ఛమైన ఆర్థిక విషయాలను గురించి పర్యాలోచించుదాం. ఆర్థిక విషయాల్లోకి వెళ్లడంలో ఇక్కడున్న కామ్రేడ్లందరూ నవంబరు 23 వ తేదీ చట్టాన్ని చదివేవుంటారనే నేను ఆశించుతూన్నప్పటికీ, ఈ చట్టంలోని కొన్ని ప్రమేయాలను నేను మీకు చదివి వినిపించుతాను. అయితేనేమి, దీని గురించి మీకు సంక్షిప్తంగా జ్ఞాపకం

చేస్తాను. రాయితీదార్లు ఉత్పత్తిచేసే వస్తువులలో కొంత భాగం వారికివ్వవలసిన చెల్లింపుల కింద వారికి ఇవ్వబడుతుందనీ, ప్రత్యేకమైన సాంకేతిక మెరుగులు ఉపయోగించబడిన సందర్భాల్లో వర్తకపు లాభాలను కల్పించేందుకు మనం సిద్ధంగా వున్నామనీ, రాయితీల కాలపరిమితి హెచ్చుగా వుండడమూ తక్కువగా వుండడమూ వినియోగించబడే ఖర్చుల పరిమాణంపైనా, వినియోగించబడే ఖర్చుల స్వభావంపైనా ఆధారపడివుంటుందనీ అందులో వుంది. వ్యాపార సంస్థలకు చెందిన ఆస్తులు జప్తు చేయబడవనీ, రిక్విజిషన్ చేయబడవనీ మనం హామీ ఇస్తున్నాం.

ఇదిలేని పక్షమందు, సహజంగానే, ప్రైవేటు పెట్టుబడిదార్లూ ప్రైవేటు ఆస్తిదార్లూ మనతో సంబంధాలు పెట్టుకుందుకు ఒప్పుకోరు. కాని ఒడంబడిక ముసాయిదాలో మొదట ఉదహరించబడిన న్యాయస్థానాల ప్రశ్న, ఇది మనకు అనుకూలంగా వుండదని తోచిన కారణాన, తరువాత తొలగించివేయబడింది. కాబట్టి మన భూభాగంపై వున్న న్యాయాధికారం మన చేతిలోనే వుంటుంది. తగాదా ఏర్పడిన పక్షంలో, తగాదాను మన న్యాయాధిపతులే పరిష్కరించుతారు. ఇది రిక్విజిషనింగ్ రూపంలో వుండదు, మన న్యాయస్థానాలకున్న న్యాయ పరిపాలనాధికారాలను అమలుపరచడం రూపంలోనే వుంటుంది.

ఒప్పందంలో వున్న ఐదవ విషయం కార్మిక శాసన సంహితను గురించి. వాన్‌డెర్‌లిప్‌తో చర్చించిన ఒప్పందపు అసలు ముసాయిదాలో వెనుకబడిన తెగలు — ఇవేవో మనకి తెలియదు — నివసించుతూన్న ప్రదేశాల సందర్భంలో కార్మిక శాసన సంహిత ఉపసంహరించబడే అవకాశం సూచించబడింది. ఈ ప్రదేశాలలో కార్మిక శాసన సంహిత అమలుపరచడం అసాధ్యమే అవుతుంది. ఈ మినహాయింపు, కార్మిక సంహిత స్థానే కార్మికులకు హామీలను కలుగజేస్తున్నట్టి ఒక ప్రత్యేక ఒప్పందం రూపంలో వుంటుంది.

ఏకపక్షపు మార్పులు అస్వీకారములని రాయితీదారునికి మనం హామీ ఇస్తూన్నది చివరి అంశం. ఈ హామీ లేనిదే రాయితీలను మంజూరు చేయుడమనే ప్రశ్నే వుండదు, సహజంగానే. అయితే ఏకపక్షంగా జరగకూడని మార్పుల నిర్వచనం మాత్రం వెల్లడిగానే వదలివేయబడింది. ఇది ప్రత్యేకంగా ఒక్కొక్క రాయితీకి సంబంధించిన ఒప్పందపు వాచకంపై ఆధారపడి వుంటుంది. కొన్ని తటస్థ రాజ్యాల ద్వారా పంచాయతి వుండడం సాధ్యమే కావచ్చు. ఈ అంశంలో అభిప్రాయభేదానికి దారితీసే అవకాశం వుంది, అసలు రాయితీ షరతులు నిర్వచించడంలోనే కొంత ఉనులుబాటును ఇది కల్గించుతూంది కూడా. మెన్‌షెవిక్ నాయకులు పెట్టుబడిదారీ ప్రపంచంలో విశ్వసనీయులైన వ్యక్తులుగా పరిగణించ బడుతున్నారని ప్రసంగవశాత్తూ ఇక్కడ చెప్పవచ్చు. వీరు బూర్జువావర్గ ప్రభుత్వాలకు చెందినవారు, కాగా యూరప్ దేశాల మెన్‌షెవిక్‌లనూ, సోషల్-ద్రోహులనూ పంచాయతీదార్లుగానూ మధ్యవర్తులుగానూ తిరస్క

రించేందుకు బూర్జువావర్గ ప్రభుత్వాలకు బహుకష్టమే అవుతుంది. ఇదిలా వుండగా, ఎప్పుడైనా సరే పరిస్థితులు బాగా తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు, ఈ అమెరికన్, యూరపియన్ మెన్షెవిక్ పెద్దమనుషులకు ఎలా ప్రవర్తించడమో తెలియదు, కాగా విప్లవానికి తాము శత్రువులే అయినప్పటికీ విప్లవాత్మక రాసుల ఒత్తిడికి వారు తప్పక లొంగి తీరుతారని మనకు అనుభవంవల్ల విదితమౌతూంది. ఈ ప్రశ్న వెల్లడిగానే వుండిపోతూంది, కాగా దీనిని మనం ముందుగావే నిర్ణయించం.

పెట్టుబడిదారీ రాయితీదార్లకూ సోషలిస్టు రిపబ్లిక్‌కూ మధ్య సంబంధాలు ఏమంత దృఢమైనవీ, స్థిరమైనవీ కావని నేను చదివి వినిపించిన షరతులనుండి మీరు తెలుసుకుంటారు. ప్రైవేటు ఆస్తినీ, దోపిడీ సంబంధాలనూ అట్టే పెట్టుకుంటూన్న పెట్టుబడిదారుడు సోషలిస్టు రిపబ్లిక్‌లో పరాయి వస్తువుగానే తప్ప మరొక విధంగా వుండేందుకు వీల్లేదన్న విషయం స్పష్టంగానే కనబడుతూంది. దీనిలోనే వుంది నా ఉపన్యాసంలో అంతర్గర్భితంగా వున్న ఒక అతి ప్రధాన విషయం — యుద్ధాన్ని ఇతర సాధనాలతో కొనసాగించే రాయితీలు. మరొక్క క్షణంలో ఈ విషయాని కొస్తాను, ఈలోపున రాయితీలలో ప్రధానమైన రకాలను లేక ఆబ్జెక్ట్‌లను మూడింటిని మొదట పేర్కొంటాను.

ఈ పాంప్లెట్‌లో, రాయితీలలో ప్రధాన ఆబ్జెక్ట్‌ల జాబితా ఇచ్చాం, కాగా ఈ పాంప్లెట్‌లోని విషయాలకు సంబంధించిన వివరాలను ఇచ్చి, దీని ప్రచురణకు సంపాదకత్వం వహించిన ప్రజా ఆర్థిక సుప్రీమ్ కౌన్సిల్ కామ్రేడ్లు ఈ ఆబ్జెక్ట్‌లను చూపుతూన్న మ్యాపులను పాంప్లెట్‌కు అనుబంధంగా చేర్చారు. ఈ మ్యాపులనుండి రాయితీ ఆబ్జెక్ట్‌లు మూడు రకాలని తెలుస్తూంది — మొదటిది, సుదూర ఉత్తరాన వున్న అటవీ రాయితీలు; రెండవది, ఆహార వస్తువుల రాయితీలు; మూడవది, సైబీరియాలో గనుల రాయితీలు.

యూరపియన్ రష్యాలో సుదూర ఉత్తరాన వున్న అటవీ రాయితీలలో మనకున్న ఆర్థిక ప్రయోజనం స్పష్టమే, కోటానకోటి దెస్యతీన్ల అడవులున్నాయి. రైళ్ళూ, ఉత్పత్తి సాధనాలూ, అక్కడ పనిచేసే కార్మికులకు ఆహారం అందివ్వగల్గే అవకాశాలూ లేకపోవడం కారణంగా వీటిని మనం వినియోగించుకో లేకపోతున్నాం. శక్తివంతమైన నౌకాదళమూ, కలప సామగ్రిని సముచిత పద్ధతిని సిద్ధపరచి వాటిని బ్రహ్మాండమైన పరిమాణంలో ఎగుమతి చేయగల్గే సమర్థతా ఏ ప్రభుత్వానికి వుంటుందో ఆ ప్రభుత్వానికే వీటిని వినియోగించుకోవడం సాధ్యమవుతుంది.

మనం విదేశాలతో వర్తకం చేయాలంటే — విదేశవర్తకంయొక్క అవశ్యకతను మనం గ్రహించుకున్న కారణంగానే అలా చేయాలనే వుంది మనకి — పెట్టుబడిదారీ దేశాలనుండి ఉత్పత్తి సాధనాలను (రైల్వే ఇంజన్లు, యంత్రాలు, విద్యుచ్ఛక్తి పరికరాలూ) మనం సాధ్యమైనంత త్వరగా సంపాదించుకోవడంలోనే వుంది మన ప్రధాన ప్రయోజనం. ఇవి లేనిదే మన

ఫ్యాక్టరీలకు అవసరమైన యంత్రాలు అందుబాటులో లేని కారణంగా, మన పరిశ్రమను పునరుద్ధరించడానికి మనం ఎంత మనస్ఫూర్తిగా ప్రయత్నించినప్పటికీ వీలుపడదు, కొన్ని పరిశ్రమలను పునరుద్ధరించడానికి అసలు వీలుపడదు. పెట్టుబడిదారీ విధానానికి బ్రహ్మాండమైన లాభాలను లంచాలుగా ఇవ్వాలి. పెట్టుబడిదారీ విధానానికి అదనపు లాభం ముడుతుంది — ఆరె భగవంతుడా, ఎంత అదనపు లాభమో! — మన మౌలికావసరాలు మనకి ముడుతాయి, వీటి సహాయంతో మనం బలపడి, చిట్టచివరకు మన కాళ్లపైన మనం నిలబడి, ఆర్థికంగా పెట్టుబడిదారీ విధానంపై విజయం సాధిస్తాం. ప్రశస్తమైన యంత్రాలు వగైరాలను సంపాదించాలంటే మనం వాటిని కొనుక్కోవాలి. ఏమిచ్చికొంటాం మనం? మన దగ్గర ఇంకా కొన్ని లక్షల బంగారం నిల్వ మిగిలి వుంది. కొన్ని దశాబ్దాల కాలంలో మాత్రమే విద్యుదీకరణ ప్రణాళికను పూర్తిచేసేందుకు వీలయేటట్టుగా తయారుచేయబడిన ప్రత్యేకపు విద్యుదీకరణ ప్రణాళికను మీరు చూసినట్టయితే, పరిశ్రమ పునరుద్ధరణకు అవసరమైన అదనపు పనులతో సహా ఈ ప్రణాళికకోసం రమారమి 17 వేల మిలియన్ల బంగారపు రూబుళ్లు ఖర్చు చేయాల్సి వుంటుందని మీకు తెలుస్తుంది. ఒక్క విద్యుదీకరణకే ప్రత్యక్ష ఖర్చులకింద వెయ్యి మిలియన్ల బంగారపు రూబుళ్లు అవసరమవుతాయి. మన దగ్గర వున్న బంగారపు నిల్వ ఈ ఖర్చుకు చాలదు; మనకున్న ఆహార వస్తువులు మన పరిశ్రమకే చాలనందున వాటిని ఎగుమతి చేయడం అత్యంత అనుచితమూ ప్రమాదకరమూ అవుతుంది, అయినప్పటికీ కూడా మనం ఈ ఖర్చు చేయక తప్పదు. ఇందుకు మనకు సుదూర ఉత్తరాన నమ్మశక్యంకానంత వైశాల్యం కలిగిన అడవులున్నాయి గనుక వీటికంటె ఆర్థికంగా ఉపయోగకరమైన ఆబ్జెక్ట్ ఇంకొకటి లేదు, కాగా ఆర్థిక దృష్ట్యా వాటిని మనం సరిగా వినియోగించుకొన లేకపోవడం కారణంగా అవి మగ్గిపోయి నష్టమైపోతున్నాయి. ఇంతేకాదు, ప్రపంచ మార్కెట్టులో కలపకు బ్రహ్మాండమైన విలువ వుంది. కాగా ఈ సందర్భంలో సుదూర ఉత్తరంలో బహుదూరాన వున్న సరిహద్దు ప్రాంతమవడం కారణంగా రాజకీయంగా మనకి అనుకూలమైన ప్రాంతం. తత్కారణాన దీని పట్ల మనం గట్టి శ్రద్ధ తీసుకోవాలి. యూరపియన్ రష్యా ఉత్తరప్రదేశంలో రాయితీలను గురించి బ్రిటన్‌తో సంప్రతింపులు బాగానే సాగుతున్నాయని ఇంతకుముందు నేను మీతో చెప్పిన మాస్కో కాన్ఫరెన్స్‌లో మిల్యూతిన్ నివేదించాడు. కొన్ని కోట్ల దెస్యతీన్ల వైశాల్యం వున్న అడవులు అక్కడున్నాయి. ఏ ముప్పై, ఏభై లక్షల దెస్యతీన్లనో చదరంగపు గళ్ల పద్ధతిలో ఏర్పాటుచేసి వీటిని మంజూరు చేసినట్టయితే, అత్యున్నత స్థాయి పరిణతిని అందుకున్న పారిశ్రామిక సంస్థలను వినియోగించుకునే అవకాశాన్ని, వాటిలో మన సాంకేతికులు పాల్గొని నేర్చుకునే అవకాశాన్ని మనం సంపాదించుకుంటాం, ఈ విధంగా గొప్ప లాభాన్ని ఆర్జించే అవకాశమూ మనకి కల్గుతుంది. ఒకవేళ యుద్ధమే గనుక సంభవించిందంటే,

యుద్ధం అన్నిటినీ రద్దుచేసివేస్తుంది కాబట్టి, అన్ని బిలింగులూ, యంత్రనిర్మాణపు అమరికలూ, రవాణా మార్గాలూ మనకే చెందుతాయి గనుక, మనతో బేరం కుదుర్చుకున్న పెట్టుబడిదారీ రాజ్యాలకు మనకు వ్యతిరేకమైన సైనికోద్యమాలలో పాల్గొనడానికి ఈ కారణంవల్ల, కష్టమూ అవుతుంది. కొత్త కొల్చాక్‌లూ దెనికిన్‌లూ వగైరాలు మనపైన ఒకవేళ సాగించబోయే ఉద్యమాలను ఇవి సులభతరం చేయకుండా వుంటాయి.

రెండవ రకం రాయితీలు ఆహార వస్తువులను గురించినవి. ప్రశస్తమైన భూమి బ్రహ్మాండమైన విస్తీర్ణంలో వుండి కూడా, రైల్వేకి అతి దూరంలో వుండడం కారణంగా మనం ఉపయోగించుకుందుకు వీలులేకుండా వుండిపోయినట్టి పశ్చిమ సైబీరియాని లెక్కలోకి తీసుకోకుండానే, ఒక్క యూరపియన్ రష్యాలోనూ, ఉరాల్ నదీతీరానా — మన వ్యవసాయ కమిస్సారియట్ ఆదేశాల ప్రకారం దర్యాప్తుచేసి కట్టిన లెక్కలనుబట్టి ఉరాల్ నదీతీరాన మనకు సాగుచేసేందుకు సమర్థతలేని కారణంగా విడిచిపెట్టేసిన భూముల విస్తీర్ణం 3 మిలియన్ల దెస్యతీన్లకు తక్కువలేకుండా వుందనీ, అంతర్యుద్ధం విజయవంతంగా సమాప్తి చెందడం ఫలితంగా ఈ భూములను కొస్సాక్‌లు వదిలిపెట్టేశారనీ తెలుస్తోంది — సాగుకిందకి తెచ్చి తీరాల్సినట్టి భేషైన భూములున్నాయి, కాని దుక్కి పశువులు లేకపోవడమూ, మన ఉత్పాదక శక్తులు బలహీనపడిపోవడమూ కారణంగా మనం ఈ భూములను సేద్యం చేయలేకుండా వున్నాం.

దోన్ ప్రాంతపు ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాల్లో మనం సేద్యం చేయలేని భూమి సుమారు 8 లక్షల దెస్యతీన్నులుంది, దీనిని సాగుచేయాలంటే బ్రహ్మాండమైన సంఖ్య దుక్కి పశువులు, లేదంటే కొన్ని శ్రేణులకు శ్రేణులు ట్రాక్టర్లు అవసరమవుతాయి, వీటిని ఉపయోగించేందుకు మనకివి లేకుండా వుండగా, ఆహార వస్తువులు అత్యవసరంగా కావాల్సివున్న కొన్ని పెట్టుబడిదారీ దేశాలు — ఆస్ట్రియా, జర్మనీ, బొహీమియా లాంటివి — ఈ భూముల్లో ట్రాక్టర్లను పనిలోపెట్టి వేసవికారులో భేషైన గోధుమ పంటను పండించగల్గుతాయి. దీనిని మనం ఏ మేరకు వాస్తవం చేయగల్గుతామో మనకి తెలియదు. ప్రస్తుతం మన దేశంలో రెండు ట్రాక్టరు ఫ్యాక్టరీలు — ఒకటి మాస్కోలోనూ, ఒకటి పెట్రోగ్రాడ్‌లోనూ — పనిచేస్తున్నాయి, కాని ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల్లో ఇవి ట్రాక్టర్లను ఏమంత పెద్ద సంఖ్యలో తయారు చేయలేకపోతున్నాయి. ఇప్పటికంటె ఇంకా అధికసంఖ్యలో ట్రాక్టర్లను కొని తద్వారా పరిస్థితులను కొంతవరకూ మెరుగుపరచగల్గుతాం. పాతకాలపు సేద్య విధానాన్ని సమూలంగా తొలగించివేయడానికీ, సాగుభూమి విస్తీర్ణాన్ని హెచ్చించడానికీ ట్రాక్టర్లే అతిముఖ్యమైన సాధనాలు. ప్రపంచ ఆర్థికవ్యవస్థను బ్రహ్మాండ పరిమాణంలో మనం వృద్ధిచేయగలమని అనేక దేశాలకు ఈ రాయితీల ద్వారా మనం నిరూపించుతాం.

మన ప్రచారమూ, మన ప్రతిపాదనా విజయవంతంగా సఫలీకృతం కాకపోయినప్పటికీ కూడా, మన ప్రతిపాదన ఇతరులకు అంగీకృతం కాకపోయినప్పటికీ కూడా, రాజకీయంగానే కాకుండా సోషలిజానికి కూడా ఉపకరించేటట్టి లాభాన్నే మనం పొందుతాం. పెట్టుబడిదారీ ప్రపంచంలో ఈనాడు జరుగుతూవున్నది కేవలమూ సంపదను వృథా చేయడమే కాకుండా, అదొక వెర్రితనమూ నేరమూ కిందకి సహితమూ దిగిపోతూంది, ఎందుచేతంటే యుద్ధంలో ఓడిపోయిన దేశాలు కొన్నిటిలో చలామణీలో జరిగిన విప్లవాల మూలాన డబ్బుకి వుండిన విలువ నశించిపోవడం కారణంగా, కొన్ని దేశాల్లో ప్రత్యక్షంగా అవుపడుతూవున్న అదనపు ఆహార వస్తువులను అమ్మడానికి వీల్లేకుండా వుంది. కుప్పతెప్పలుగా పడివున్న ఆహార వస్తువుల రాసులు కుళ్ళిపోయి పురుగులు పట్టిపోతున్నాయి, అదేసమయంలో జర్మనీలాంటి దేశాల్లో కోట్లాది ప్రజ ఏకంగా చచ్చిపోతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క ఈ అసంబద్ధత, ఈ అపరాధం పెట్టుబడిదారీ దేశాలన్నిటికీ, రష్యా చుట్టూ వున్న చిన్న దేశాలకూ ప్రత్యక్షంగా కనబడతూంది. ఈ దేశాలతో రష్యా ఇలా అంటూంది: "లక్షలాది దెస్యతీన్ల విస్తీర్ణం కల్గినట్టి, ట్రాక్టర్లతో దున్నేందుకు అనువైనట్టి శ్రేష్ఠమైన రకం సాగుభూమి మా దేశంలో వుంది, మీకు ట్రాక్టర్లున్నాయి, మీకు పెట్రోలుంది, తర్ఫీదుపొందిన సాంకేతిక నిపుణులున్నారు మీకు; ఆర్థికవ్యవస్థ పునరుద్ధరణమూ ఆకలి బాధనుండి సర్వప్రజల రక్షణమూ తమ రాజకీయ విధానానికి పునాదిరాయిగా చేయమని పెట్టుబడిదారీ దేశాల ప్రజలతో సహా అందరి ప్రజలకూ మేం ప్రతిపాదిస్తున్నాం." పెట్టుబడిదార్లు దీనిని అర్థం చేసుకోని పక్షమందు, పెట్టుబడిదారీ విధానం ఎంతగా కుళ్ళిపోతూందో, దానికి ఎంతగా పిచ్చి ఎక్కిందో, అది ఎంతటి అపరాధం చేస్తూందో చూపేందుకు ఇదొక వాదనగా ఉపయోగపడుతుంది. దీనికి కేవలం ప్రచారపు విలువ వుండడమే కాకుండా, విప్లవానికి ఇదొక కమ్యూనిస్టు పిలుపే అవుతుంది, ఎందుచేతంటే పెట్టుబడిదారీ విధానం బద్దలైపోతూందనీ, ప్రజల అవసరాలను అది తీర్చలేదనీ అందరి ప్రజల చైతన్యంలోనూ నానాటికి మరింత దృఢంగా నాటుకుని పోతూందన్న విషయాన్ని ఇది నిస్సంశయంగా నిరూపించుతూంది. స్వల్పాతిస్వల్పమైన అల్పసంఖ్యాకవర్గంగా వున్న సామ్రాజ్యవాద దేశాలు అంతకంతకు మరింతగా ధనరాసులు పోగుచేసుకుంటూండగా, ఎన్నో ఇతర దేశాలు సర్వనాశనమైపోవడానికి సిద్ధంగా వున్నాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం అత్యంతావశ్యకం. కాగా పునర్వ్యవస్థీకరణకు ఒక ప్రణాళికను, వ్యవహార సరళిలో వున్నట్టీ నిర్వివాదమైనట్టీ ఆచరణీయమైనట్టీ ప్రతిపాదనను తీసుకొని సోవియట్ రిపబ్లిక్ ముందుకువచ్చి: "అద్భుతమైన సాంకేతిక సంపదవున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానంకింద మీరు ఆకలితో చచ్చిపోతున్నారు, మా ముడిపదార్థాలను మీ సాంకేతిక విద్యతో జతచేసినట్లయితే, ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు మనకు అవకాశం వుంది, కాని పెట్టు

బడిదార్లు ఇందుకు అడ్డుపడుతున్నారు. మేమేమో దీనిని వారి ఎదుట ప్రతిపాదింపుతున్నాం, కాని వారు దీనిని వెనక్కిలాగుతూ ధ్వంసం చేస్తున్నారు" అని అంటూంది. ఇది రెండవ రకం రాయితీ, ఆహార వస్తువుల, లేక ట్రాక్టర్ల రాయితీ.

మూడవ రకం రాయితీలు గనుల రాయితీలు. వీటిని సైబీరియా మ్యాపులో చూపడ మైంది. ఏ యే చోట్ల రాయితీలను ఇవ్వడం గురించి ఆలోచనలు జరుగుతున్నాయో ఆ చోట్లు అన్నీ మ్యాపులో సవివరంగా గుర్తుపెట్టి వున్నాయి. సైబీరియా ఖనిజ సంపద నిజంగా అక్ష యమే, అంతేకాదు అనుకూల పరిస్థితులలో, పనులన్నీ జయప్రదంగా సాగినప్పటికీ కూడా కొన్ని ఏళ్లలోనైనా సరే దానిలో నూరోవంతైనా మనం వెలికి తీసి ఉపయోగించుకోలేం. ఆ ఖనిజాలు ఎటువంటి స్థితిలో వున్నాయంటే, అత్యుత్తమ రకం యంత్రపరికరాలుంటేనే గాని అక్కడ పనిచేసేందుకు వీలుండదు. ఇక్కడ తామ్ర ఖనిజంలాంటి ఖనిజాలు దొరుకుతాయి, ఇదెంతో కొరతగా వుండడంచేత విద్యుత్ సామానులు తయారీకై పెట్టుబడిదార్లు దీనికోసం తహతహ పడిపోతున్నారు. మనతో సరైన సంబంధాలను గనుక వారు ఏర్పరచుకున్నట్టయితే, ప్రపంచ ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించేందుకూ, ప్రపంచమంతటా సాంకేతికశాస్త్ర స్థాయిని మరింత పైకి తీసుకుపోయేందుకూ అవకాశం వుంటుంది.

ఈ రాయితీలను వాస్తవపరచడం నిస్సందేహంగా కష్టమే, అనగా అడవుల, ఆహార వస్తువుల రాయితీల కంటె వీటిలో చాలా కష్టాలున్నాయి. ఆహార వస్తువులకు సంబంధించి నంత వరకు, ఆ యా తరుణాల్లో ట్రాక్టర్లతో స్వల్పకాలపు కృషే అవసరమవుతుంది. అటవీ రాయితీలను వాస్తవపరచడం కూడా, ముఖ్యంగా అవి మనకు అందుబాటులోలేని ఆబ్జెక్ట్ లకి సంబంధించినవి అవడంచేత, ఏమంత కష్టమైనది కాదు; కాని గని రాయితీలలో కొన్ని రైల్వేలైన్లకు ఏమంత దూరంగా కాకుండానూ, కొన్ని జనసంకీర్ణ ప్రదేశాల్లోనూ వుంటాయి. ఇక్కడ పెద్ద ప్రమాదమే తటస్థించుతుంది. అందుచేత ఇటువంటి రాయితీలను ఇవ్వడం గురించి పూర్వాపరాలను అతి జాగ్రత్తగా ఆచి తూచి మరీ నిర్ణయించుకోవాల్సి వుంటుంది; ప్రత్యేక షరతులను కొన్నింటిని విధించాల్సి వుంటుంది కూడాను,. ఎందుచేతంటే రాయితీలు ఒక కొత్త యుద్ధమే — అందులో ఎట్టి సందేహమూ లేదు. మనతో ఒక కొత్త యుద్ధంలో దిగడానికి పెట్టుబడిదార్లు మన దగ్గరకొస్తున్నారు, అసలు పెట్టుబడిదార్ల అస్తిత్వమే సోష లిస్టు ప్రపంచంపై యుద్ధం. సోషలిస్టు రాజ్యంలో పెట్టుబడిదారీ వ్యాపారస్థులు వుండడం — స్వేచ్ఛావ్యాపారం కోసం యుద్ధమే, నిర్బంధపు దినుసు విడుదల విధానంపై యుద్ధమే, ప్రైవేటు ఆస్తి కోసమై, అట్టి ఆస్తిని రద్దుచేసిన రిపబ్లిక్‌పై యుద్ధమే. ఈ ఆర్థిక మూల కందం నుండి ఏకంగా వరుసకి వరుస సంబంధాల పరంపరే ("సూహారెవ్క"[29] క్కూ మన సంస్థలకూ వున్న యుద్ధ సంబంధాలను పోలినట్టివి) మొలకెత్తుతుంది. "సూహారెవ్క"ను

మూసివేసి, పెట్టుబడిదార్లను దేశంలోకి రానివ్వడమంటే, కొన్ని కొత్త "సూహారెవ్క" లను తెరవడమే అవుతుంది కదా, అని ఎవరైనా అనవచ్చు. ఈ విషయాన్ని మనం గమనించక పోవడంలేదు, కాని మనం ఏమంటున్నామంటే, ఇంతవరకూ మనం జయప్రదంగానే సాగిపోతున్నప్పుడు, మన పారిశ్రామిక సంస్థలను విధ్వంసం చేసివేసేందుకు మన శత్రువులు ఎన్ని కుత్సిత సాధనాలు ఉపయోగించాలో అన్నీ ఉపయోగించినప్పుడు సహితమూ, ఈ విధ్వంసన కార్యాలు సంస్థలలోపలినుండీ బైటనుండీ కూడా ఏకసమయంలో జరిగినప్పుడు సహితమూ మనం విజయం సాధించినప్పుడు, నిర్దిష్టమైన షరతులూ, సంబంధాలూ అమలులో వున్నట్టి కొన్ని ప్రత్యేక స్థలాలకే వారిప్పుడు పరిమితమై వున్న పరిస్థితులలో వాళ్ల ఆటలు సాగకుండా చూస్తూ, వాళ్లపై మనం తప్పకుండా నిఘాపెట్టగల్గుతాం. సైనిక గూఢచారి కార్యకలాపాలపైనా, పెట్టుబడిదారీ విధానపు విధ్వంసన చర్యలపైనా పోరాటం సాగించడంలో మనకు ఆచరణసిద్ధమైన అనుభవం వుంది. మన వ్యాపార సంస్థలలో ఇవి దాగి వుండినప్పుడే వీటితో మనం పోరాడగల్గినప్పుడు, ఒక నిర్దిష్టమైన జాబితా ప్రకారం, నిర్దిష్టమైన షరతులకు లోబడి పెట్టుబడిదార్లను మన దేశంలోకి రానిచ్చినప్పుడు వాళ్ల ఆటలను మనం నిజంగా సాగనిస్తామా? మన షరతులను వారు పాటించరని మనం సహజంగానే ఎరుగుదుం, అట్టి అతిక్రమణను మనం గట్టిగా ఎదుర్కొంటాం. కాని, కామ్రేడ్స్, పెట్టుబడిదారీ విధాన మూలసూత్రాల ప్రకారం రాయితీలు అంటే — యుద్ధమే. ఇతర దేశాల్లో పెట్టుబడిని మనమింకా కూలదోయనంత వరకూ, మనకంటే పెట్టుబడే ఇంకా బలంగా వున్నంతవరకూ, తన బలాలను అది ఎప్పుడు పడితే అప్పుడే మనమీదకి పంపించగల్గుతుంది, మన మీద మళ్ళీ యుద్ధం ప్రారంభించగల్గుతుంది. ఈ కారణంచేత మనం ఇంకా అధికంగా బలపడాలి, అందుకు మనం పెద్ద పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలి, మన రవాణావ్యవస్థను ఉన్నతస్థాయికి తెచ్చుకోవాలి. ఇది సాధించడంలో మనం కొంత ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నాం, యుద్ధ సందర్భాలు మళ్ళీ ఇక్కడ ఎదురవుతాయి, మళ్ళీ పోరాటమే ఎదురవుతుంది, కాగా మన విధానంపై వారు దెబ్బతీయబోయారంటే మనం వాళ్లతో పోరాడుతాం. రాయితీలపై శాంతియుతమైన ఒడంబడిక అంటే పెట్టుబడిదారీ విధానంతో శాంతియుతమైన ఒడంబడికే అని అనుకోవడం గొప్ప పొరపాటే అవుతుంది. ఇది యుద్ధానికి సంబంధించిన ఒడంబడిక, అయితే మనకు అంతకంటె తక్కువ ప్రమాదకరమైనట్టీ, కార్మికులపైనా కర్షకులపైనా కూడా తక్కువ భారాన్ని మోపేటట్టీ ఒడంబడిక, వారికున్న టాంకులు, ఫిరంగులలో పెద్దవాటిని మనపై వారు తరలించుతూండిన రోజులలో కంటె తక్కువ బాధాకరమైనట్టి ఒడంబడిక కనుక, మనం ఆర్థిక సౌకర్యాలను కలుగజేసైనా సరే మన ఆర్థిక శక్తులను అభివృద్ధిచేసుకుని, మన ఆర్థిక పునరుద్ధరణను మరింత సులభతరం చేసుకునే మార్గాన పయనించేందుకు అన్ని విధానాలనూ మనం వినియో

గించుకోవాలి. తాము చేసుకున్న ఒడంబడికలను పెట్టుబడిదార్లు సహజంగానే నువ్వించరు — అని, రాయితీలంటే భయపడే క్రామేడ్లు అంటారు. పెట్టుబడిదార్లు ఒడంబడికను నెరవేర్చుతారని మనం ఆశలు పెట్టుకోవడం ఎన్నటికీ తగదని వేరే చెప్పనవసరం లేదు. ఇది యుద్ధమే కాబోతూంది, కాగా ఇక మొత్తానికి ఆఖరి వాదన, సోషలిస్టు రిపబ్లిక్‌తో పెట్టుకున్న సంబంధాలు దారితీసే అంతిమ వాదన — యుద్ధమే.

ఈనాడు ఈ యుద్ధం గడియ గడియకూ మనను బెదరించుతూంది. పోలెండ్‌తో మనం శాంతి సంప్రతింపులు సాగిస్తున్నాం, శాంతి స్థిరపడే అవకాశాలు, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, అవకాశాలలో అధమపక్షం అత్యధికసంఖ్యాక వర్గం, ఈ శాంతి స్థిరపడేందుకే అనుకూలంగా వున్నాయి. ఈ సంధి కుదరకుండా వుండేందుకు సావింకొవ్‌లూ[30], ఫ్రెంచి పెట్టుబడిదార్లూ పనిచేస్తూన్నారనడంలో ఎట్టి సందేహమూ లేదు. పెట్టుబడిదార్ల పక్షంనుండి ఈ రోజు, కాకపోతే రేపు, కాకపోతే ఎల్లుండి, ఎప్పుడైనా యుద్ధం రావచ్చు, మూడేళ్ల అనుభవంనుండి వాళ్లు గుణపాఠం నేర్చుకోబట్టి గాని, లేకుంటే ఈ రోజే యుద్ధం ప్రారంభించేందుకే వాళ్లు సిద్ధపడి వుండేవారు. రాయితీలు అంటే కొంత నిర్దిష్ట ప్రమాదావకాశమే; రాయితీలు అంటే కొంత నష్టమే; రాయితీలు అంటే యుద్ధం కొనసాగింపే. ఇది నిస్సంశయం, అయినప్పటికీ ఈ యుద్ధంవల్ల మనకు మరింతగా లాభమే కల్గుతుంది. మనకు ఉత్పత్తి సాధనాలూ, రైల్వేఇంజన్లూ, యంత్రాలూ కొంత కనిష్ఠ పరిమాణంలో ఎప్పుడైతే లభించుతాయో, అప్పుడు ఆర్థికంగా మన స్థితి ఈనాటి వరకూ వున్న స్థితికంటె వేరుగా వుంటుంది, ఇక అప్పుడు సామ్రాజ్యవాద దేశాలనుండి మనకు కల్గబోయే ప్రమాదం ఇప్పటికంటె మరింత తక్కువగానే వుంటుంది.

రాయితీదార్లు తమ కార్మికులకు అసాధారణమైన మెరుగు పరిస్థితులు కల్పించుతారనీ, వారికోసం మంచి దుస్తులూ, మంచి జోళ్ళూ, మంచి ఆహార వస్తువులూ తీసుకువస్తారనీ మనతో కొందరు అంటున్నారు. ఇది కష్టాలతో బాధపడుతూన్నట్టి, ఇంకా సుదీర్ఘకాలం వరకూ కష్టాలతో బాధపడాల్సే వున్నట్టి మన కార్మికుల మధ్య వాళ్లుచేసే ప్రచారం. సోషలిస్టు రిపబ్లిక్‌లో మన కార్మికులు దారిద్ర్యంలో పడికొట్టుకుంటూండగా, పక్కనే వున్న పెట్టుబడిదారీ లంకలో పనిచేస్తూన్న కార్మికులు అదేసమయంలో భేషుగ్గా జీవించుతూంటారు. ఇలాంటి భయాలు మన పార్టీ సమావేశాల్లో మిక్కిలి తరుచుగా వెల్లడించుతూండడం కద్దు. ఇటువంటి ప్రమాదం వుంది, నిజమే; రాయితీలంటే యుద్ధం కొనసాగింపే కాని, శాంతి కాదని ఇది చూపుతూంది; కాని ఇంతకంటెనూ ఎంతో నికృష్ట దారిద్ర్యాన్నే మనం అనుభవించాం, అయినప్పటికీ పెట్టుబడిదారీ దేశాలనుండి కార్మికులు, రష్యాలో తాము భరించాల్సిన ఆర్థిక పరిస్థితులు చాలా పాడుగా వుంటాయని తెలిసివుండి కూడా మన దేశానికి

రావడం మనం చూశాం; ఇలాంటప్పుడు ఈ ప్రచారాన్ని మనం ఎదురు ప్రచారంతో తట్టుకోలేమా? పెట్టుబడిదారీ విధానం తన కార్మికులలో కొన్ని నిర్దిష్ట గ్రూపులకు మంచి పరిస్థితులను కల్పించగల్గి వుండగా, మరి కడమ కార్మికరాసుల పరిస్థితులు మెరుగుపడేందుకు ఇది దారితీయడం లేదని మన కార్మికులకు మనం నిజంగా రుజువుచేయలేమా? ఇక చిట్టచివరకు, బూర్జువా యూరప్, అమెరికాలతో మనకు సంపర్కం ఏర్పడినప్పుడు ప్రతీ సారీ కూడా గెలుపు మనదే అవుతూండడమేమి, వారిది కాకపోవడమేమి? ఇంతవరకూ కూడా మన దేశానికి ప్రతినిధివర్గాలను పంపించడానికి వారే ఎందుకు భయపడాలి, వారి దేశాలకు పంపించడానికి మనం ఎందుకు భయపడడం లేదు? ఇంతవరకూ కూడా మన దగ్గరకు వచ్చిన ప్రతినిధివర్గాలలో ప్రధానంగా మెన్‌షెవిక్ మూలధాతువులే వుండినప్పటికీ, ఈ ప్రతినిధివర్గాలలో అధమ పక్షం ఒక స్వల్పభాగాన్నయినా, ఈ మనుషులు మన దగ్గరకు స్వల్పకాలానికే వచ్చినప్పటికీ కూడా, మన పక్షానికి తిప్పుకోగల్గామే, మరి అలాంటప్పుడు మన కార్మికులకు యుద్ధాన్ని వివరించి చెప్పలేకపోతామేమో అని మనం భయపడడమా?! ఇలా మనం భయపడుతున్నామంటే, - రాయితీల విషయంలో అన్నిటికంటె ఉన్నతంగా ఎంచుకోవాల్సినట్టి మన సూటి ప్రయోజనాల కంటేనూ ఇటువంటి ఆలోచనలకే మనం ఉన్నత స్థానం ఇచ్చినట్టయితే, ఇక మనం వుత్త వెర్రి నాగమ్మలం అన్నమాటే. మన రైతుల, కార్మికుల స్థితి కష్టంగానే వుంది, దాని మెరుగుపరచి తీరాలి. ఈ విషయమై ఎట్టి సందేహానికీ తావులేదు. రాయితీల విధానం కూడా యుద్ధాన్ని కొనసాగించే విధానమే అనీ, పెట్టుబడిదారీ శత్రువుల చక్రబంధంలో చిక్కుకుని ఏకాకిగా వున్న సోషలిస్టు రిపబ్లిక్ అస్తిత్వాన్ని సుస్థిరం చేయడమూ, చక్రబంధంలో ఇరికించిన పెట్టుబడిదారీ శత్రువులకంటె అమిత బలహీనంగా వున్న రిపబ్లిక్‌కు భద్రత కల్గించడమూ, మనకు వ్యతిరేకంగా పోరాడేందుకని మన శత్రువులు పరస్పరమూ మిత్రత్వాన్ని ఏర్పరచుకునే సాధ్యతను వమ్ముచేసి, వారి విధానాలకు భంగపాటు కల్గించి, విజయాన్ని సాధించే అవకాశాలను వారికి లేకుండా చేయడమూ మన కర్తవ్యమనీ మనం అంగీకరిస్తామనే నేను ఆశిస్తున్నాను; రష్యాకు తన ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించుకుందుకు అవసరమయే ఉపకరణాలనూ ధననిధులనూ సంపాదించుకోవడం మన కర్తవ్యం, ఎందుచేతంటే దీనిని మనం ఎప్పుడైతే నిర్వర్తిస్తామో అప్పుడు మన కాళ్లమీద మనం ఎంత దృఢంగా నిలబడతామంటే, ఇక పెట్టుబడిదారీ శత్రువులెవ్వరూ మనను బెదరించరు. ఇదీ, రాయితీలపై మన విధానాన్ని నిర్ణయించుకోవడంలో మనను నడిపినట్టి, నేను వివరించినట్టి దృక్స్థానం.

1930 లో తొలి సారి ప్రచురించబడింది.

వి.ఐ. లెనిన్, "రచనలు",
4 వ రష్యన్ కూర్పు,
31 వ సంపుటి,
పుటలు 433 – 455

ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ క్రియాకలాపంపై ఎనిమిదవ అఖిల రష్యా సోవియట్ల మహాసభకు ఇచ్చిన నివేదికనుండి

డిశంబరు 22, 1920

మనకు సన్నిహితమూ అత్యావశ్యకమూ అయినట్టి చాలా కాలంనుండి మనను ఆకర్షిస్తూ వున్నట్టి ఆర్థికనిర్మాణ కార్యానికి — ఈ కార్యం సాఫీగా జరగకుండా అడ్డంకులు కల్గించడానికి పెట్టుబడిదారీ యజమానులకు వెనుక వుండినంత సులువు ఇప్పుడు వుండదనే విశ్వాసంతో — మరింత అధికమైన ఆత్మవిశ్వాసంతోనూ కృతనిశ్చయంతోనూ మనమీనాడు పూనుకోవచ్చు. అయినప్పటికీ మనం అప్రమత్తులమై వుండడమే సబబు. యుద్ధం జరగదనే హామీ మనకప్పుడే లభించిందని చెప్పేందుకు మనకెంతమాత్రమూ వీల్లేదు. ఇలా హామీ లేకపోవడానికి కారణం మనకింకా సలాంఛనములైన శాంతి సంధులు లేకపోవడం కానేకాదు. వ్రాంగెల్ సేనావశేషాలు ఇంకా నాశనం కాబడలేదనీ, ఇవి అట్టే దూరాన కాకుండా చేరువనే మాటు దాగివున్నాయనీ, వాటికి పెట్టుబడిదారీ రాజ్యాలు ఆశ్రయమిస్తూ, రక్షణ కల్పిస్తూ పునస్సమీకరణకు వాటికి సహాయం చేస్తున్నాయనీ, రష్యన్ వైట్ గార్డ్ ఆర్గనైజేషన్లు వెనుకటి సైనికయూనిట్లనో లేక కొత్తవాటినో పునస్థాపించేందుకున్నూ, వ్రాంగెల్ చేతికింద వున్న బలాలతో కలిసి అనుకూలమైన తరుణంలో రష్యాపై దాడిచేసేందుకని తయారయేందుకున్నూ శక్తివంచన లేకుండా పాటుపడుతున్నాయనీ మనకు బాగా తెలుసును.

ఇందుచేత మనం అన్ని పరిస్థితుల్లోనూ మన సైనిక సన్నద్ధతను భద్రపరచుకుంటూ వుండాలి. సామ్రాజ్యవాదంమీద మనం ఇదివరకు తీసిన దెబ్బలపైనే మనం ఆధారపడకుండా, ఏది ఏమైనా సరే మన ఎర్రసైన్యాన్ని సంపూర్ణ సన్నాహంలో వుంచి, దాని పోరాటపాటవాన్ని ఇనుమడింప జేస్తూండాలి. సైన్యంలో కొంత భాగాన్ని విడుదల చేయడానికీ, ఈ భాగాన్ని త్వరగా ఇంటికి తరలించడానికీ ఇది ఎంత మాత్రమూ ఆటంకం కల్గించదు. ఎర్రసైన్యమూ, దాని నాయకులూ యుద్ధసమయంలో గడించుకున్న మహత్తరానుభవం దానిని గుణాత్మకంగా మెరుగుపరచేందుకు సహాయపడుతుందనే మనం పరిగణించుతున్నాం. సైన్యాన్ని

తగ్గించడంలో, దేని పోషణ భారమైతే రిపబ్లిక్‌కు మరీ కష్టంగా వుండదో అట్టి మౌలికమైన ప్రధానభాగాన్ని భద్రపరచేందుకు మనం యత్నిస్తాం; అదేసమయంలో సంఖ్యలో చిన్నదే అయిన సైన్యంతోనే అవసరమైనప్పుడు మరింత శక్తివంతమైన బలాన్ని సిద్ధపరచి యుద్ధసన్నాహాలకై తరలించేందుకూ, వెనుకటికంటె మరింత మంచి అవకాశాలే మనకి వుండే పరిస్థితులను సుస్థిరం చేసుకుంటున్నాం.

కాగా మనపై వైట్ గార్డ్లు పన్నిన కుట్రలకు తాము వెనుకనుండి అందిచ్చిన మద్దతు కారణంగా ఎంతో నష్టం అనుభవించిన మన పొరుగు రాజ్యాలు నిస్సందేహమైన గుణపాఠాన్ని ఒంటపట్టేటట్టుగా నేర్చుకున్నాయనీ, మన బలహీనతగా వారు అంతవరకూ లెక్కకట్టినట్టి మన సామరస్యపు యత్నాలను ఇప్పుడు సరిగా విలువకట్టాయనీ మనం నమ్ముతున్నాం. దృఢమైన శాంతికాంక్షను మనం ప్రదర్శించుతూండినప్పటికీ, అదేసమయంలో సైనికంగా మనం సంసిద్ధంగానే వుండినట్టు వారు ఈ మూడేళ్ల అనుభవంనుండి నేర్చుకుంటేకాని వారికి తెలిసిరాలేదు. మనమీద యుద్ధానికి దిగే ప్రతి ప్రయత్న ఫలితమూ ఏమిటంటే, అలా యుద్ధంలోకి దిగిన రాజ్యాలకు యుద్ధం లేకుండానే యుద్ధాత్పూర్వం లభించి వుండగల్గినట్టి పరిస్థితులతో పోల్చిచూస్తే యుద్ధఫలితంగానూ యుద్ధం తరువాతనూ లభించే పరిస్థితులు అధ్వాన్నంగా వుండబోవడమే. ఇది అనేకరాజ్యాల విషయంలో రుజువైంది. కాగా ఇది మనం గెల్చుకున్న విజయం, దీనిని మనం ఎంతమాత్రం వదలుకోం, మన చుట్టూ వున్నట్టీ, రష్యాతో రాజకీయంగా సంపర్కం వున్నట్టీ రాజ్యాలలో ఒక్కటైనా కూడా దీనిని మరచిపోవడమూ జరగదు. దీని పుణ్యమా అంటూనే మన పొరుగు రాజ్యాలతో మన సంబంధాలు నిరంతరమూ మెరుగవుతున్నాయి. రష్యాకి పశ్చిమ సరిహద్దున వున్నట్టీ, వెనుకటిరోజుల్లో రష్యన్ సామ్రాజ్యంలో భాగాలుగా వుండినట్టీ మన విధానానికి పునాదులైన సూత్రాలకు అనుగుణ్యంగా సోవియట్ రాజ్యశక్తినుండి తమ స్వాతంత్ర్యాన్ని నిర్నిబంధంగా పొందినట్టీ అనేక రాజ్యాలతో చిట్టచివరకు శాంతి సంధిపై సంతకం జరిగిందన్న సంగతి మీకు తెలును. ఈ సూత్రాలపై ఏర్పడిన శాంతికి, పెట్టుబడిదార్లకూ పశ్చిమ యూరపియన్ రాజ్యాలు కొన్నిటికీ నచ్చినంతటికంటెనూ ఎక్కువ కాలమే సుస్థిరంగా నిలబడి వుండేందుకు అన్ని అవకాశాలూ వున్నాయి.

లాట్వియా ప్రభుత్వానికి సంబంధించినంత వరకు, ఒక సమయంలో పరిస్థితులు ఎంతగా విషమించాయని మనకు భయంవేసిందంటే, దౌత్యసంబంధాలు విరమించుకునే ఉద్దేశం పొడచూపే అవకాశం సహితమూ కల్గేంత వరకూ వెళ్లాయనే నేను చెప్పాల్సి వుంది. అయినప్పటికీ లాట్వియాలో మన ప్రతినిధి పంపిన కడపటి నివేదికనుబట్టి ఆ రాజ్యం అనుసరిస్తూన్న విధానంలో అప్పుడే మార్పు కల్గినట్టూ, అనేక అపార్థాలకూ అసంతృప్తికీ న్యాయంగానే వుండిన కారణాలు ఇప్పుడు తొలగిపోయాయనీ తెలుస్తూంది. పశ్చిమ యూరప్‌తో ఎస్తోని

యాకూ, రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ సరిహద్దున వున్న కడను ఇతర రాజ్యాలకూ వున్నట్టి యావత్తు వాణిజ్యంకంటె లాత్వియాకున్న వాణిజ్యమే అధికమైన కారణంగా లాత్వియాతో ఆర్థిక సంబంధాలే మనకు హెచ్చు ఉపయోగకరంగా వుంటాయన్న విషయం స్వతస్సిద్ధమే కాబట్టి, లాత్వియాతో సమీప భవిష్యత్తులో ఆర్థికంగా సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకుంటామని మనకు నిజమైన ఆశలు కల్గుతున్నాయి.

ప్రాచ్యంలో మన విధానానికి ఈ సంవత్సరంలో ఘనవిజయాలు లభించాయని కూడా మీతో చెప్పాల్సి వుంది. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని స్థాపించుకున్నందుకే కాకుండా, అందుకు తోడు, రాజ్యాధికార శక్తిని కార్మికులూ రైతులూ కైవసం చేసుకున్నట్టి బుఖారా, అజర్‌బైజాన్, ఆర్మేనియా రిపబ్లిక్‌ల అవతరణకూ వాటి సుస్థిరస్థాపనకూ మనం హర్షం వెలిబుచ్చాల్సి వుంది. సోవియట్ రాజ్యశక్తి భావాలూ సూత్రాలూ ఒక్క పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లోనే కాకుండా, శ్రామికవర్గాన్నే సామాజిక ఆధారంగా కల్గిన దేశాల్లోనే కాకుండా, రైతాంగమే పునాదిగా ఏర్పడిన దేశాల్లో సహితమూ అర్థమౌతున్నాయనీ, తక్షణమే అన్వయించవీలనీ రుజువుపరచేందుకూ ధ్రువపరచేందుకూ ఈ రిపబ్లిక్‌లే దృష్టాంతాలవుతున్నాయి. రైతు సోవియట్లు అనే భావం విజయవంతమైంది. రాజ్యాధికార శక్తి రైతుల చేతిలో స్థిరపడింది – భూమీ, ఉత్పత్తి సాధనాలూ వీరికే వున్నాయి. ఆచరణ రంగంలో మన విధానం సాధించిన ఫలితాలవల్ల రైతు సోవియట్ల ప్రభుత్వానికీ, రష్యన్ సోషలిస్టు రిపబ్లిక్‌కీ వున్న మైత్రీ సంబంధాలు ఇప్పటికప్పుడే బలపడ్డాయి.

సామ్రాజ్యవాదం మోపిన గాటికింద బాధపడుతూన్న అందరి ప్రజల మౌలిక ప్రయోజనాలూ ఒకటే అవడంవల్ల పరస్పర మైత్రీ సంబంధాలు సుస్థిరమౌతూన్నట్టి పర్షియా దేశంతో మనం ఒడంబడికపై సంతకం చేయబోతూన్నందుకు కూడా మనం హర్షం వెలిబుచ్చవచ్చు.

ఆఫ్ఘనిస్థాన్‌తోనూ, ఇంకా అంతకంటె ఎక్కువగా టర్కీతోనూ నెలకొల్పబడిన మైత్రీసంబంధాలు నానాటికి మరింతగా విస్తృతమౌతూ బలపడుతున్నాయని కూడా మనం పేర్కొనాల్సి వుంది. టర్కీ విషయంలో, ఆ దేశానికీ పశ్చిమ యూరపియన్ దేశాలకూ ఏదో ఒక విధమైన ప్రామాణిక సంబంధాలంటూ వుండేందుకు వీలులేకుండా చేయడానికి ఏమేమైతే చేయాలో అన్నిటినీ చేశాయి ఆంటాంట్ దేశాలు. ఈ సంగతిని సోవియట్ రాజ్యశక్తి యొక్క దృఢత్వంతో జోడించినప్పుడు – బూర్జువావర్గం ఎన్ని ప్రతికూల చర్యలు అవలంబించి, ఎన్ని దుస్తంత్రాలు పన్నినప్పటికీ, రష్యా చుట్టూ బూర్జువా దేశాలను నిలబెట్టి వుంచినప్పటికీ – రష్యాకీ ప్రాచ్యంలో వున్న పీడిత దేశాలకూ వున్న ఐక్యత, మైత్రీసంబంధాలు బలపడుతూండడానికే నానాటికి మరింత సుస్థిరమైన హామీగా ఈ సంగతి ఏర్పడుతూంది,

ఎందుచేతనంటే విజేతల సంఖ్యలో తాము కూడా ఒకరై వుండేందుకు వోచుకోని ప్రజల విషయంలో సామ్రాజ్యవాదం అవలంబించే బలప్రయోగమే రాజకీయాలంతటిలోనూ అత్యంత ప్రధానమైన వాస్తవవిషయం, కాగా సామ్రాజ్యవాదం అవలంబించుతూన్న ఈ ప్రపంచ విధానం పీడిత ప్రజలందరూ ఐక్యమయేందుకూ స్నేహితులయేందుకూ దారితీస్తూంది. ఇంతేకాకుండా, ఈ విషయంలో మరింత అధికంగా యూరపియనీయమైపోయిన రాజ్యాలకు సంబంధించినంత వరకు, మనం పాశ్చాత్యంలో కూడా సాధించిన విజయం, మన వైదేశిక విధానానికి ఈనాడు ఏర్పడుతూన్న పునాదులు సరైనవనీ, మన అంతర్జాతీయ స్థితిలోని మెరుగుదల దృఢమైన ప్రాతిపదికపైనే నిలబడి వుందనీ నిరూపించుతూంది. శాంతి విధానం కొనసాగించడంవల్లనూ, మనం చూపుతామంటూన్న సదుపాయాలవల్లనూ (యుద్ధాన్ని వారించాలంటే వీటిని మనం మంజూరు చూపే తీరాలి), మనతో కయ్యం పెట్టుకుందుకు ఏదో ఒక రాజ్యాన్ని సహజంగానే ఎప్పుడు పడితే అప్పుడే ఉసికొల్పగల్గే సామ్రాజ్యవాదుల కుహకాలూ పన్నాగాలూ అన్నీ వుంటే వుండు గాక, అవి ఎలా వున్నప్పటికీ కూడా, మన మౌలిక విధాన మార్గమూ, సామ్రాజ్యవాద విధాన మూలప్రకృతినుండే ఉత్పన్నమయే మౌలిక ప్రయోజనాలూ వాటి ఫలితాన్ని అవి కలుగజేస్తున్నాయనీ, రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ మధ్యనూ ఎక్కువకెక్కువ సంఖ్య పొరుగు రాజ్యాల మధ్యనూ నానాటికి మరింతగా సన్నిహితమయే సంబంధాలను నెలకొల్పుతున్నాయనీ మనం నమ్ముతున్నాం. మన కృషిని ప్రధానంగా ఆర్థిక నిర్మాణానికే అంకితం చేయగల్గేందుకూ, నెమ్మదిగానూ దృఢసంకల్పంతోనూ ఆత్మవిశ్వాసంతోనూ సుదీర్ఘకాలం మనం పని చేయగల్గేందుకూ ఇది మనకు హామీ ఇస్తూంది.

బ్రిటన్‌తో వర్తకపు ఒప్పందంపై సంతకంచేసే విషయమై సంప్రతింపులు జరుగుతున్నాయని కూడా చెప్పాల్సి వుంది. దురదృష్టవశాత్తూ ఈ సంప్రతింపులు మరీ మెల్లగా సాగుతున్నాయి, ఇంత మెల్లగా సాగడం మనకేమీ నచ్చడంలేదు. ఇందుకు తప్పు మనది కానేకాదు, లోగడ జూలై నెలలోనే సోవియట్ సైనికబలగాలు ఘనవిజయాలను సాధించుతూండిన రోజుల్లో, వర్తక సంబంధాలు స్థాపించుకుందుకు అవకాశాన్ని కల్గించే ఒక ఒప్పందపు వాచకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం మనకి అధికారయుతంగా అందజేసింది; దీనికి మన సంపూర్ణాంగీకారం తెలియజేస్తూ మనం ప్రత్యుత్తరమిచ్చాం, కాని బ్రిటిష్ ప్రభుత్వంలోనూ, బ్రిటిష్ రాజ్యాంగ యంత్రంలోనూ వున్న ధోరణుల మధ్య నలుగుతూన్న పోరాటం కారణంగా అప్పటిమండి ఈ విషయంలో జాప్యం కలుగుతూంది. బ్రిటిష్ ప్రభుత్వం ఊగిసలాటలూ, మనతో అసలు సంబంధాలనే తెగతెంపులు చేసుకుంటామనీ, పెట్రోగ్రాడ్‌కు తక్షణమే యుద్ధనౌకలు పంపించుతామనీ వారు చేస్తూన్న బెదరింపులను మనం చూస్తూనే వున్నాం. అదే సమయంలో ఈ బెదరింపుకు జబాబుగా బ్రిటన్ అంతటా "కార్యాచరణ సమితులు" లేవడమూ మనం చూశాం.

అవకాశవాద ధోరణిలో చిట్టచివరి పైమెట్టున వున్న వారిలో అగ్రగణ్యులు సహితమూ కార్మికుల ఒత్తిడికి లొంగి, కేవలమూ "రాజ్యాంగ విరుద్ధమైన" విధానాన్నే, దేనినైతే క్రితం రోజున వారు ఖండించారో ఆ విధానాన్నే ఇక విధిలేక వారు అనుసరించడమూ మనం చూశాం. బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలో నిన్నమొన్నటి వరకూ పెత్తనం సాగించుతూండిన మెన్‌షెవిక్ దురభిమానాలను లెక్కచేయకుండానే కార్మికులు తీసుకొచ్చిన ఒత్తిడీ, వారి వర్గచైతన్యమూ ఎంత బలంగా వుండెనంటే, వాటి ఫలితంగా సామ్రాజ్యవాదుల కజ్జాకోరు విధానంలో వుండిన జోరు ఇప్పుడు తగ్గిపోయింది. కాగా శాంతి విధానాన్నే కొనసాగించుతూనే వున్న మనం, బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదాను మనం ఇప్పుడు కూడా ఒప్పుకుంటూనే వున్నాం. వర్తకపు ఒప్పందంపై వెంటనే చేవ్రాలుచేసేందుకు మనం సిద్ధంగానే వున్నాం, ఆ ఒప్పందంపై ఇంకా సంతకాలు పడలేదూ అంటే అందుకు తప్ప బ్రిటిష్ ప్రభుత్వవర్గాలలో వర్తకపు ఒప్పందాన్ని భగ్నంచేయ దల్చుకుంటూన్నట్టీ, ఒక్క కార్మికులలో అధికసంఖ్యాకవర్గంయొక్కే కాకుండా, బ్రిటిష్ బూర్జువావర్గంలో అధికసంఖ్యాకవర్గంయొక్క అభీష్టానికి సహితమూ వ్యతిరేకంగా సోవియట్ రష్యాపై దాడిచేయడానికి సంపూర్ణ స్వేచ్ఛకై అవకాశం కోరుతూన్నట్టీ ధోరణులూ వైఖరులదే కేవలమూనూ. అది వాళ్ల వ్యవహారం.

పలుకుబడిగల కొన్ని బ్రిటిష్ వర్గాలలోనూ, ఫైనాన్స్ పెట్టుబడిదార్లలోనూ, సామ్రాజ్యవాదులలోనూ, ఈ విధానం కొనసాగుతూన్నకొద్దీ ఫైనాన్‌షియల్ పరిస్థితిని ఇది మరింత తీవ్రతరం చేస్తుంది, బూర్జువా బ్రిటన్‌కీ సోవియట్ రిపబ్లిక్‌కీ మధ్య ఇప్పుడు తప్పకుండా వుండితీరాల్సిన సగం సగం ఒప్పందాన్ని ఇది మరింత సాచివేస్తూంది, సగం సగం ఒప్పందం బదులు తదుపరి సంపూర్ణమైన ఒప్పందాన్నే అంగీకరించాల్సిన అవసరానికే సామ్రాజ్యవాదులను ఇది మరింత దగ్గరగా తీసుకువస్తుంది.

కామ్రేడ్స్, మన ఆర్థిక విధానానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన సమస్యలలో ఒకటైన రాయితీల సమస్య, బ్రిటన్‌తో వర్తకపు ఒప్పందం కుదుర్చుకోవడంతో ముడిపడి వుందనే చెప్పాల్సి వుంది. ఈ నివేదిక కాలంలో సోవియట్ రాజ్యాంగం మంజూరుచేసిన ముఖ్య చట్టాలలో ఒకటి ఈ సంవత్సరం నవంబరు 23 తేదీగల రాయితీల విషయమైన చట్టం. ఈ చట్టపు వాచకం మీకందరకూ పరిచయమే అని వేరే చెప్పనవసరంలేదు. ఈ సమస్య విషయమై పూర్తి భోగట్టాను ఇచ్చే అదనపు సమాచార సామగ్రిని మనమిప్పుడు ప్రచురించామన్న సంగతి మీకు తెలును, దీనినుండి ఇందుకు సంబంధించిన అన్ని వివరాలూ సోవియట్ల మహాసభ సభ్యులందరకూ తప్పకుండా లభించుతాయి. ఒక్క చట్టం పాఠమే కాకుండా, రాయితీలకింద మంజూరు చేయబడే ఆబ్జెక్ట్‌లలో అత్యంత ముఖ్యమైనవాటి — ఆహార వస్తువులు, అడవులు, గనుల — జాబితా కూడా చేర్చి ఒక పాంఫ్లెట్‌ను ప్రచురించాం. ఇప్పుడు ప్రచురించిన పాఠం

పాశ్చాత్య యూరపియన్ రాజ్యాలకు సాధ్యమైనంత త్వరగా అందేటట్టు ఏర్పాటుచేశాం, కాగా మన రాయితీల విధానం ఆచరణసాధ్యమైన విజయాలను చేకూర్చుతుందనే మనం ఆశించు తున్నాం. సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌లో, అదిన్నీ బలహీనంగానూ వెనుకబడిన్నీ వున్న దేశంలో, ఈ విధానాన్ని అవలంబించడంలో వున్న ప్రమాదాన్ని చూడకుండా మనం ఎంతమాత్రమూ కళ్ళు మూసుకోవడంలేదు. పెట్టుబడిదారీ ప్రపంచమంతటికీ సోవియట్ రిపబ్లిక్ ఏకాకిఅయి నిలబడుతూన్న సరిహద్దు ప్రాంతంగా వున్నంత కాలమూ, సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని గురించిన్నీ, రకరకాల ప్రమాదాలు అంతరించిపోయాయనిన్నీ మనం తలపోస్తే మాత్రం, అది కేవలమూ పరిహాసాస్పదమైన భ్రమ, ఊహాగానమే అవుతుంది. ఇటువంటి మౌలిక వైరుధ్యాలు వుంటూన్నంత కాలమూ, ప్రమాదాలు కూడా సహజంగానే వుంటూనే వుంటాయి. వాటిని తప్పించుకుని మనం ఎక్కడకూ పోలేం కూడా. వాటినుండి బతికి బయటపడేందుకు మనం ధృఢంగా నిలబడాలి, పెద్ద ప్రమాదాలేవో చిన్న ప్రమాదాలేవో మనం గుర్తుపట్టి తెలుసుకోగల్గి, పెద్ద ప్రమాదాన్ని బదులు చిన్న ప్రమాదాన్ని తీసుకుందుకే మనం ఎంచుకోవాలి.

నీజ్ని నోవ్‌గొరొద్ గుబేర్నియాలోని అర్జమాస్ ఉయేజ్ద్* సోవియట్ల మహాసభలో, పార్టీయేతరుడైన ఒక రైతు రాయితీల విషయమై ఈ విధంగా ఉద్ఘాటించాడని మాకు ఇటీవల తెలిసింది: "కామ్రేడ్స్, మేం, రైతులం మరో మూడేళ్ళు ఆకలినీ చలినీ భరించి, నిర్బంధ విధులను నెరవేర్చుతాం, కాని రాయితీలకింద మాత్రం రష్యా మాతను అమ్మేయకండి, అని మిమ్మల్ని అఖిల రష్యా మహాసభకు పంపిస్తూ ప్రకటిస్తున్నాం." అతి విస్తృతంగా, మహా విస్తృతంగా వ్యాపించి వున్న ఇటువంటి మనస్థితికి నేను స్వాగతం చెబుతున్నాను. పెట్టుబడిదార్లనుండి విముక్తి అన్నిటికంటెనూ అమూల్యమైనదనే భావన కల్గేందుకు అవకాశమిచ్చి ఆ భావనను వ్యక్తీకరించేటట్టు వారిని బలవంతపెట్టుతూ, పెట్టుబడిదారీ విధానాన్ని పునస్థాపించే నూతన ప్రమాదావకాశాలకు దారితీసే ప్రతి చర్యపట్ల త్రిగుణీకృతమైన అప్రమత్తతనూ అసాధారణమైన అనుమానాన్నీ ప్రదర్శింపజేస్తుందో అట్టి రాజకీయ, ఆర్థికానుభవం పార్టీయేతర శ్రమజీవి రాసులలో, ఒక్క కార్మికులలోనే కాకుండా, రైతులలో సహా మూడేళ్ల కాలంలో పరిపక్వమైనదన్న విషయాన్ని మనకిది రుజావుచేస్తూంది. ఇటువంటి ప్రకటనలను మనం నిస్సందేహంగా అత్యంత శ్రద్ధతో వింటున్నాము; అయినప్పటికీ రష్యాను పెట్టుబడిదార్లకు అమ్మివేసే ప్రశ్నే లేదిక్కడ, ఇక్కడున్న ప్రశ్న అంతా రాయితీల విషయమైన ప్రశ్న, ప్రతి ఒక్క ఒడంబడికలోనూ రాయితీల కాలపరిమితినీ, ఒప్పందల కుదిరిన విష

* గుబేర్నియాలూ, ఉయేజ్దులూ 1929 – 1930 వరకూ రష్యాలో పరిపాలనా విభాగాలుగా వుంటూండేవి. ఒక గుబేర్నియాలో అనేక ఉయేజ్దులు వుంటూండేవి. – సం.

యాలనూ నిర్వచించుతూన్న షరతులుంటాయి; జాగ్రత్తగా ఆలోచించినట్టే, ఈ మహా
సభలోనూ తరువాత జరిగే అన్ని కాన్ఫరెన్సులలోనూ మీరు అనేక పర్యాయములు పర్యాలో
చించి చర్చించనున్నట్టే అన్ని విధములైన హామీలూ అందులో పేర్కొనబడి వుంటాయి,
ఈ తాత్కాలిక ఒడంబడికలను క్రయంతో పోల్చేందుకే వీల్లేదు. రష్యాను అమ్మివేయడంతో
పోలినది ఏదీ వీటిలో వుండదు, కాని మన ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించుకుందుకు అనివార్య
ములై మనకు ఆవశ్యకములవుతూన్నట్టి రైల్వేఇంజన్లనూ యంత్రాలనూ సాధ్యమైనంత
శీఘ్రంగా మనకు లభించేందుకుగాను పెట్టుబడిదార్లకు కలుగజేసే కొన్ని నిర్దిష్టములైన
ఆర్థిక సౌకర్యాలే అవి. మన కార్మికుల పరిస్థితులలోనూ రైతుల పరిస్థితులలోనూ ఏ మాత్రం
మెరుగుపరచగల్గే ఏ విషయాన్ని సహితమూ ఉపేక్షించేందుకు మనకు హక్కులేదు.

వర్తక సంబంధాలను సాధ్యమైనంత శీఘ్రంగా పునస్థాపించేందుకు మనం చెయ్యా
ల్సినది గరిష్ఠ పరిమితి వరకూ మనం చేసితీరాలి. కాగా ఇప్పుడు దీని విషయమై సంప్రతిం
పులు సగం చట్టసమ్మతంగా జరుగుతున్నాయి. రైల్వేఇంజన్లనూ యంత్రాలనూ మనం
కొద్ది సంఖ్యలోనే ఆర్డరు చేస్తున్నాం, ఇది మనకు ఎంత మాత్రమూ సరిపోదు, కాని ఆర్డరు
చేయడం ప్రారంభమైంది. చట్టసమ్మతమైన సంప్రతింపులను మనం ప్రారంభించితే అప్పుడు
ఈ అవకాశాలను మనం బ్రహ్మాండమైన స్థాయిలో హెచ్చించుకుంటాం. పరిశ్రమ సహాయంతో
అతిస్వల్ప వ్యవధిలోనే అత్యధికమైన అభివృద్ధిని మనం సాధించుకుంటాం, కాని మనం
సాధించుకునే విజయం అత్యధికంగానే వున్నప్పటికి కూడా, ఈ వ్యవధికి కొన్ని సంవత్సరాలు
కాదు కదా, కొన్ని సంవత్సరాల వరుసరే అవసరమవుతుంది. మనమిప్పుడు సైనిక విజయాన్నే
సాధించుకుని శాంతిని పొందినప్పటికీ, ఏ ఒక్క ప్రధాన సమస్య, ఏ ఒక్క విప్లవమూ యుద్ధ
పరంపర వల్లనే తప్ప ఇతర విధంగా నిర్ణయించబడలేదనే ఆటు చరిత్ర మనకి గుణపాఠం
నేర్పుతూందని మనం మర్చిపోకూడదు. కాగా ఈ పాఠాన్ని మనం మరచిపోము. మనతో యుద్ధా
నికి దిగవద్దని శక్తివంతములైన రాజ్యాలు చాలావాటికే మనమిప్పుడు బుద్ధి చెప్పాం, కాని ఇది
ఎంత కాలం నిలుస్తుందో మనమేమీ హామీ ఇవ్వలేము. పరిస్థితులలో రవంత మార్పు సంభ
వించినప్పుడల్లా సామ్రాజ్యవాద దోపిడిదొంగలు మనమీద మళ్లీ దాడి చేస్తారనే అనుకుని
అందుకు మనం సిద్ధంగా వుండాలి. ఇందుకు మనం సన్నద్ధులమై వుండాలి. కనుకనే
అన్నిటికంటే ముందు ఆర్థికవ్యవస్థ పునరుద్ధరణ ఆవశ్యకం, దాని కాళ్లమీద దానిని దృఢంగా
నిలబెట్టడం అవసరం. ఇందుకు ఆవశ్యకమైన ఉపకరణసామగ్రి లేనిదే, పెట్టుబడిదారీ
దేశాలనుండి యంత్రాలు లేనిదే ఈ కార్యాన్ని మనం త్వరగా నిర్వర్తించలేం. ఈ పరిస్థితులలో,
పునరుద్ధరణను మనం సాగించగల్గేంత కలామూ పెట్టుబడిదార్లు అధిక లాభాలు చేసుకున్న
ప్పటికీ మనమేమీ బాధపడనవసరంలేదు. త్యాగాలన్నా, లేమి అన్నా మేము భయపడమని చెప్పిన

ఈ పార్టీయేతర రైతుల మనస్థితిలోనే కార్మికులూ రైతులూ వుండడం అవసరం. పెట్టుబడిదార్ల జోక్యంవల్ల కలగబోయే ప్రమాదాన్ని గ్రహించుకున్న వీరు రాయితీలను భావలోతిత మైన దృక్పథంనుంచి చూడకుండా, మరొక తలానికి బదిలీ చేయబడినట్టి నిర్దాక్షిణ్యమైన పోరాటంగానే వీటిని చూస్తున్నారు; పాత పెట్టుబడిదారీ విధానాన్ని పునస్థాపించేందుకై బూర్జువావర్గం కొత్త ప్రయత్నాలు చేసే అవకాశం వుందనే వీరు భావించుతున్నారు. ఇది క్షేమంగ్గా వుంది, మన ప్రయోజనాలపై అజమాయిషీ వహించడమూ, వాటిని కాపాడడమూ సోవియట్ రాజ్యాధికార శక్తి ఒక్కటే పట్టించుకో వలసిన విషయం కాకుండా, అది ప్రతి ఒక్క కార్మికుడూ ప్రతి ఒక్క రైతూ పట్టించుకో వలసిన విషయమనేందుకు ఇది హామీ ఇస్తూంది. ఇక ఇలాంటప్పుడు రాయితీ ఒప్పందాలను మనం నెరవేర్చుతూన్నప్పుడు సహితమూ పెట్టుబడిదార్లు మళ్లీ అధికారానికి వచ్చే ప్రశ్నే అంటూ లేకుండానే, మన ప్రయోజనాలను కాపాడుకోగల్గుతామనే విశ్వాసం మనకుంటుంది; ఈ ప్రమాదాన్ని కనిష్ఠ పరిమితికే తగ్గించి వేయడంలోనూ, దీనిని యుద్ధప్రమాదం కంటెనూ తక్కువ పరిమితులలో వుంచడంలోనూ, యుద్ధం తిరిగి సంభవించడమును మరింత కష్టతరంచేసి, ఇంకా మరింత స్వల్ప వ్యవధిలోనే, కొద్ది సంవత్సరాలలోనే (కొన్ని సంవత్సరాల సుదీర్ఘ పరంపరలోనే ఈ సమస్య పూర్తి అవుతుంది) మన ఆర్థికవ్యవస్థను మనం పునరుద్ధరించుకునే అవకాశాన్ని సుస్థిరం చేసుకోవడంలోనూ మనం విజయం సాధించుతాం...

''ఎనిమిదవ అఖిల రష్యా సోవియట్ల మహాసభ. పదానుపద నివేదిక'' అనే పుస్తకంలో 1921 లో ప్రచురించబడింది.	వి.ఇ. లెనిన్, ''రచనలు'', 4 వ రష్యన్ కూర్పు, 31 వ సంపుటి, పుటలు 458—464

పదవ అఖిల రష్యా ఆర్. సి. పి. (బి.) కాన్ఫరెన్స్ ముగింపు ముందు ఇచ్చిన ఉపన్యాసంనుండి

మే 28, 1921

...ప్రస్తుతపు అంతర్జాతీయ పరిస్థితి ఏ విధంగా వుందంటే, తాత్కాలికంగా అస్థిరమైనదే అయినప్పటికీ ఒక విధమైన సమతాస్థితే ఇప్పుడు ఉత్పన్నమైంది; సోవియట్ రష్యా పట్ల సామ్రాజ్యవాదులకు ఎంత ద్వేషం వున్నప్పటికీ, సోవియట్లమీద ఎప్పుడు ఉరుకుదామా అనే ఆకాంక్ష ఎంతగా వున్నప్పటికీ, పెట్టుబడిదారీ ప్రపంచం నిలకడగానూ నానాటికి అధికంగానూ విచ్ఛిన్నమైపోతూ, దాని ఐక్యత దినదినమూ అంతకు మరింతగా తగ్గిపోతూండగా, తత్ఫలితంగా (**తత్వ్యతి**)రేకంగా నూరుకోట్ల సంఖ్యలో వున్న పీడిత వలస ప్రజల పక్షంనుండి వస్తూన్న ఒత్తిడి బలం, ఏ యేటికాయేడు, ఏ నెలకా నెల, ఆ మాటకొస్తే, ఏ వారానికా వారం మరింత శక్తివంతమౌతూండడం కారణంగా ఈ ఆలోచను వారు వదలుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఈ విషయమై ఎట్టి ఊహలు సహితమూ మనం చేయకూడదు. అంతర్జాతీయ విప్లవంపైన మన ప్రభావాన్ని ఈనాడు ప్రధానంగా మన ఆర్థిక విధానం ద్వారానే మనం తీసుకొస్తున్నాం. అందరి దృష్టి, ఎట్టి మినహాయింపు లేకుండా, ఎట్టి అతిశయోక్తి లేకుండా, ప్రపంచంలో వున్న అన్ని దేశాల కార్మిక ప్రజారాసుల దృష్టి రష్యన్ సోవియట్ రిపబ్లిక్‌పైనే వుంది. దీనివి మనం సాధించాం. దీని గురించి పెట్టుబడిదార్లకు కిమ్మన్నాస్తిగా వూరకుందుకు వీల్లేదు, దీనిని పైకి తెలియకుండా దాచిపెట్టడం వారి తరంకాదు; కనుకనే అన్నిటికంటెనూ హెచ్చుగా ఆర్థిక విధానంలో మన పొరపాట్లపైనే, మన బలహీనతపైనే వారి కళ్ళ అన్నీ వున్నాయి. ఇప్పుడు పోరాటః ప్రపంచ స్థాయిలో ఈ క్షేత్రంలోకి బదిలీ అయింది. ఈ సమస్యను మనం పరిష్కరించామంటే — అప్పుడు నిర్దిష్టంగానూ అంతిమంగానూ ప్రపంచ స్థాయిలో గెల్చుకున్నామన్న